ఆంధ్రమహిళ



APRIL '54

ANDHRA MAHILA

ANNAS 8



1954 మార్చిలో జరిగిన కాశీ విశ్వవిద్యాలయపు ఎడ్మిషన్ పరీక్షకు ఉత్తీర్ణులైన
ఆంధ్ర మహిళా సభ విద్యార్థినులు.

ఆంధ్ర మహిళ

వ్యవస్థాపకురాలు :

శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్

యెం.యే., బి.యెల్.,

సంపాదకురాలు :

శ్రీమతి చెన్నఘంటమ్మ

యెం.యే., యెల్.టి.,

సంవత్సర చందా ఆరు రూపాయిలు

ఆంధ్ర మహిళా సభవారిచే స్థాపించబడిన ముద్రణాలయములో ముద్రితము.

గమనిక

'ఆంధ్ర మహిళ' స్త్రీల సచిత్ర మాస పత్రిక. ఆంధ్ర లోకంతో సన్నిహితానుబంధం ఏర్పరచుకొని, మహిళా సంఘంలో నూతన ప్రబోధం కలిగించే ఆశయంతో ఆంధ్ర మహిళా సభ తరపున "ఆంధ్ర మహిళ" పత్రిక 10 సం॥రములనుండి ప్రకాశితమగుచున్నది.

దీనియందు స్త్రీల మనోవికాసానికి తోడ్పడే వ్యాసములు, కథలు, నాటికలు, పిల్లలకు బాలానందం మొదలగు గద్య పద్యాత్మకములైన పలురకముల రచనలున్నవి. సాంఘిక రాజకీయ విషయములు, ప్రభుత్వము వారు దేశాభివృద్ధికై జరుపుచున్న సంక్షేమ కార్యక్రమాలు, స్త్రీలకుపయుక్తమైన గృహ పరిశ్రమలు మున్నగు వానిని గూర్చి మాసామాసముయిందు ప్రకటింపబడును.

వార్షిక సంచిక, తపాలా ఖర్చులతోసహా

సంవత్సర చందా 6-0-0

సేవాసంస్థలకు, గ్రంథాలయములకు, కళాశాల, పాఠశాలలకు,

సంవత్సర చందా రూ. 4-8-0 మాత్రమే.

వివరములకు:

మేనేజరు
'ఆంధ్ర మహిళ'

ఆంధ్ర మహిళా సభ,
24-ఎ, లజ్ చర్చిరోడ్డు, మైలాపూర్, మద్రాసు 4.

చిన్న మొత్తములలో నిల్వ సేకరణ-
ఆంధ్ర మహిళా సభలో కార్యాలయము.

———:o:———

చిన్న మొత్తముల నిల్వలు ప్రోత్సాహించి, ప్రభుత్వమువారి పంచవర్ష ప్రణాళికకు తోడ్పడు స్త్రీల ఉద్యమములో ఆంధ్రమహిళాసభ సభ్యురాండ్రు ఎక్కువగా తోడ్పడవలెనని నిశ్చయింపబడినది. ఇందు కొరకై, ఆంధ్రమహిళా సభ ఆవరణలో ఒక ప్రత్యేకమైన కార్యాలయము ఏర్పరుపబడును. ఇందు దైనిక కార్యక్రమాన్ని నిర్ణయించి, స్త్రీ సామాన్యములో యీ ఉద్యమాన్ని గూర్చి ప్రచారం చేయుటకు, నిల్వచేయదలచినవారికి తగు సలహానిచ్చుటకు, సభ తరపున కొందఱు యువతులు నియమింపబడుదురు. ఈ ఉద్యమంలో ఒక ప్రత్యేక ప్రతినిధిగా వ్యవహరించి, ధనము వసూలు చేయుటకు భారత ప్రభుత్వమువారు, ఆంధ్ర మహిళాసభకు అధికారమిచ్చియున్నారు. సభకు వచ్చిగాని, పోస్టు ద్వారాగాని అన్ని వివరములు తెలిసికొనవచ్చును,

ఇంకొక విషయము— మీరు కొనదలచిన సేవింగ్సు సర్టిఫికెట్లు సభ ద్వారా కొన్నయెడల సభకు 1½% కమీషను వచ్చును. ఈ కమీషను సభయొక్క కార్యకలాపాలకై వినియోగించుకోవచ్చును. అందువల్ల మీరు నిల్వ చేయదలచిన మొత్తమునకు సభద్వారా సర్టిఫికెట్లు కొన్నచో, సభకు కూడా సహాయము చేసినవారగుదురు.


ఉత్సాహ వంతులైన సోదరీమణులు, యింత వరకూ సభద్వారా నిల్వ సర్టిఫికెట్లు తీసుకున్న మొత్తము రమారమి రూ. 22000/- ఇందు మూలముగా సభకు వచ్చిన కమీషను రూ. 275/- ఇంకా పెక్కుమంది సోదరీమణులు యీవిధముగా సభద్వారా సర్టిఫికెట్లుకొని సహాయ పడవలెనని కోరుచున్నాను.

అ. చన్నఘంటమ్మ,
కార్యదర్శిని.

ఆంధ్రమహిళ

సంపుటి 10 :: ఏప్రిల్ '54 :: సంచిక 12

సంవత్సర చందా :: ఆరు రూపాయలు.



ఆంధ్ర మహిళ

సంపుటి 10 :: ఏప్రిల్ '54 :: సంచిక 12

యుద్ధాలు అరికట్టాలంటే

—— . ० . ——

"మీ దేశంలో జన్మించిన ఒక మహా వ్యక్తి ఉపదేశముల ననుసరించి, కొన్ని వినూత్నమైన ఆదర్శాలతో, ఒక అపూర్వమైన మార్గములో, మీరు స్వాతంత్ర్యం సంపాదించుకున్నారు. ఆ ఆదర్శాలు ఆధారంగా, ఆ ఉపదేశాల ఊతంగా, వర్తమానంలో ప్రపంచాన్ని గగ్గోలు పరచుచున్న తీవ్రసమస్యల నెదుర్కోడానికి, మీరేమైనా క్రొత్త విధానం చూపగలరా? మీదేశస్థులైన స్త్రీలు తమకు గల గొప్ప బాధ్యతలను గుర్తించినారా?" అని విదేశస్థులు తనను తరచు ప్రశ్నిస్తూవుంటారని ఐక్యరాజ్యసమితి అధ్యక్షురాలు, శ్రీమతి విజయలక్ష్మి, మొన్న మదరాసు నగర మహిళా సమాజాలు సమిష్టిగా సమర్పించిన స్వాగత పత్రానికి బదులు చెప్తూ ప్రసంగించినారు.

ఆమె సెలవిచ్చినట్లు రెండు ప్రపంచ సంగ్రామాలు మనకు నేర్పిన గుణపాఠం యుద్ధం యొక్క విఫలత్వమే. ఏ ఆదర్శాల ప్రమేయంతో, ఏ హక్కుల సంరక్షణనిమిత్తం, ఏ ఆశయాలు సిద్ధించాలని, యుద్ధాలు చేయబడుచున్నవో, ఆ ఆదర్శాలను, ఆ ఆశయాలను మట్టికలిపేటటువంటి ఆత్మహత్యా పూర్వకమైనది సంగ్రామ విధానం. అయినా మూడవ ప్రపంచ సంగ్రామ భయం ప్రపంచ ప్రజల నావహించియేయున్నది. ఆయుధ బలంలోగాని, ఆర్థిక బలంలోగాని, మరియొక యుద్ధాన్ని ఓర్చుకోగల సమర్థత ఏదేశానికి లేదు. పోగా, ఈ యుద్ధాన్ని అరికట్టాలంటే, ఎవరి మటుకువారు సాధన బలాన్ని పెంచుకుని, ఎదిరిని దూరంగా ఉంచాలని ఆలోచిస్తున్నారు. ఒక దేశాన్ని జూచి మరియొక దేశం భయపడ్తూ, ఒక రాజ్యాన్ని జూచి మరియొక రాజ్యం ఏవగించుకుంటూ, ఒక జాతిని జూచి మరియొక జాతి యీర్ష్య చెందుతూ మానవ నిర్మితములైన మారణాయుధాలకు దాసులై, భయభ్రాంతులై, నిత్య సంగ్రామ రీతిలో మానవ విలువలను విస్మరించడం కేవలం అనాగరిక వ్యవస్థ. అడవిలోని జంతువులకు, యిట్టి వ్యవస్థలో జీవించే మానవులకు ఎంతమాత్రమూ భేదములేదు.

శాంతియుతమైన విప్లవముతో నిరాయుధులమై ఎదిరిని స్వాధీనము చేసికొన్న మన జాతి, సహనం, ప్రేమ, ఓర్పు, అనే నైతికమైన ఆయుధాల ప్రయోగంతో మానవ విలువలను తిరిగి రూపొందించి, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి పునాది వేయగల క్రొత్త విధానాన్ని సూచించగలమా అని ప్రపంచ ప్రజ మనలను ఆశతో ప్రశ్నించడం ఎంతో సహజం. శ్రేయాపూర్వకంగా యీ ప్రశ్నకు సమాధానమిచ్చే బాధ్యత మన కెంతైనా యున్నది.

యుద్ధాలు అరికట్టాలంటే

"స్వాతంత్ర్య సమరంలో భారత స్త్రీలమైన మనం ఏకైక ఆశయంతో నిలచి, వెనుకంజవేయకుండా కృషి సల్పి యున్నాం. ఈనాడు స్వతంత్ర భారతంలోని స్త్రీలమైన మనం మన రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వ హక్కులను దైనందిన క్రియా కలాపాల్లో అమలు జరుపుచూ, దేశాన్ని. జాతిని. భిన్నాభిన్నము చేయనున్న వైషమ్యాలను, విభేదాలను, ధిక్కరించవలసిన బాధ్యత మనపై నున్నది." అన్న శ్రీమతి విజయలక్ష్మిగారి హెచ్చరిక స్త్రీలందఱూ పాటించవలసినది. శాంతి ప్రచారానికి సారథ్యం వహించవలసినది స్త్రీలే. వైషమ్యాలకు కారణభూతమైన దారిద్ర్యం, అవిద్య. ఆర్థిక విభేదాలు తొలగించడంలో స్త్రీలు, తమ తమ ప్రాంతాల్లో తగు విధంగా కృషిచేస్తూ, సత్ప్రచారం చేయడంవల్ల, శాంతి స్థాపనకు పునాదులు వేసినవారౌతారు. నశించిపోయిన మానవ విలువలు యీ విధంగా తిరిగి రూపొందగలవు. అప్పుడు భయంతో, యుద్ధాలతో ప్రమేయం లేకుండా, ప్రేమతో, స్నేహంతో, శాంతితో ప్రజలు జీవిస్తారు.

దేశాభివృద్ధిని అరికట్టే

అధిక సంతానం — అధిక జనాభా.

భారతదేశపు జనాభా సంవత్సరానికి 50 లక్షల చొప్పున అధిక మౌతూవున్నది. ఈ రీతిని, పెంపొందే సంఖ్యను బట్టి చూస్తే, 1980 నాటికి మన జనాభా 52 కోట్లవుతుంది. ఈ తీరున వృద్ధి అయ్యే జనాభాకు ఆహార సమృద్ధి కలగాలంటే, ఒక్కొక్క సంవత్సరము, ఆ క్రితము సంవత్సరము కంటె 8 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు అధికంగా ఉత్పత్తి చేసుకోవాలి. ఇంత జనాభాకు తగిన వసతి, విద్య, ఆరోగ్యసౌకర్యాలు అధికం చేయాలి. ఏ దేశానికైనా, ఏ ప్రభుత్వానికైనా, యీవిధంగా వృద్ధి అయ్యే జనాభాకు, కనీస జీవితప్రమాణాల కనుగుణంగా ఆహారాది సౌకర్యాలు సమకూర్చాలంటే తీరని సమస్య.

మొన్న ప్రజాసభలో డాక్టరు గిద్వానిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని, ప్రభుత్వము క్షుణ్ణంగా పరిశీలించి, ప్లానింగ్ కమిషన్ వారి సూచనలననుసరించి, సంతాన నిరోధానికి ఒక ఉద్యమ రూపంగా ప్రజలలో చైతన్యం కలిగించడం అత్యవసరం.

గాలి, వెల్తురు చొరబడని ఇరుకుగుడిసెల్లో, దుర్గంధ భూయిష్టమైన మురికి పేటల్లో, ఎండకు, వానకు కాపులేని ఆరుబయట గట్లమీద, చెట్ల క్రింద నివాసం చేసే వేన వేల జనం, దిన దినం వృద్ధి అగుతూవున్న నిరుద్యోగ సమస్య, తిన తిండి, కట్ట గుడ్డ లేక, బిచ్చమెత్తుచున్న లక్షలాది ప్రజ—ఇవి అధిక జనాభాయొక్క ప్రత్యక్ష ఫలితాలు. ఏ సంఘ వ్యవస్థలోను, ఏ రాచకీయపక్ష సారథ్యములోనూ, ఎంతటి సుక్షేత్రములోనూకూడా, ఈ జనాభా వృద్ధితో సరిసమంగా పరుగులెత్తే ఉత్పత్తి అలవికానిది—

శ్రీమతి అనసూయాబాయి కాళేగారు వివరించినట్లు, ఏ నిర్మాణ కార్యక్రమమైనా ఈ అధిక సంతాన సమస్య మూలంగా క్రియా సూన్యంగా పరిణమిస్తుంది— సరియైన ప్రచారమూ, ప్రబోధమూ ఉన్నట్లయితే, ఎవరుగాని సంతాన నిరోధక ఆవశ్యకతను గుర్తింపని వారుండరు; ఉద్యమానికి అడ్డుతగిలే వారుండరు. విచక్షణ గల ప్రతీ వ్యక్తీ ఈ ఉద్యమంలో ప్రభుత్వానికి తోడ్పడాలి.

అయితే, ఆరోగ్యమంత్రి శ్రీమతి అమృతకౌర్‌గారు సెలవిచ్చినట్లు, అధిక వ్యయముతో కూడుకొనని, ఆరోగ్యమునకు భంగముకాని, అక్రమ శీలాన్ని ప్రోత్సహించని, సహజమైన నిగ్రహంతో పరిమిత సంతానాన్ని బడేయడం ప్రతివ్యక్తీ అనుసరించవలసిన ఉత్తమ విధానం. ఈ విధానాన్ని ప్రోత్సహించే సాంఘిక వ్యవస్థను, తగుమైన సంస్కారముతో నిర్మాణముచేసి, బాల బాలికల వివాహ యోగ్యత వయస్సును పెంచి, ఉద్యోగమువలన గాని, మరి యే కృషివలనగాని, స్వార్జన యోగ్యతలేని యువతీ యువకులు వివాహము చేసుకొనరాదని ప్రబోధిస్తూ, క్రమంగా, యీ ఉద్యమం ప్రజాసామాన్యంలో ప్రవేశ పెట్టడం వల్ల తృప్తికరమైన ఫలితాలు సాధించవచ్చును. ★


మనిషిలోని మంచిచెడ్డలను
మనోరంజకంగా చిత్రించే
మహత్తర సాంఘిక చిత్రము!
పెద్ద మనుష్యులు
వాహినీ చిత్రము
నిర్మాత-దర్శకుడు
కే.వి.రెడ్డి B.Sc (HONS)
ఆంధ్రదేశమంతటా
దిగ్విజయముగా ప్రదర్శింప బడుచున్నది.

ఆసియా యువతులకు

శ్రీమతి విజయలక్ష్మి సందేశం.

"ఈరోజుల్లో యువతులు స్కూలల్లోనున్నా, ఆట స్థలాల్లోనున్నా, మరి యేయితర ప్రదేశాల్లోనున్నా పూర్వం కంటే ఎక్కువ శ్రద్ధ, మెలకువలతో, ప్రవర్తించవలసియుంది. నేను నా జీవితమంతా రాజకీయాల్లోనే గడిపినప్పటికీ- ప్రజల జీవితాల్ని బాగుపరచాలంటే ఎన్ని అడ్డంకుల్ని ఎదుర్కోవాలో నాకు బాగా తెలుసు అందులోనూ వెనకబడియున్న దేశాల్లో ఇది మరీ క్లిష్ట సమస్యగా పరిగణించవలసియుంది అందుచేత మీరు మీ మీవిద్యాభ్యాసాల్ని ముగించినంత మాత్రాన్న మీబాధ్యత తీరిపోయిందని అనుకోకూడదు, ఆతర్వాత దేశాభ్యుదయ కార్యక్రమాల్లో మీరంతా పాల్గొని మీతోటి సోదర సోదరీమణుల కొరకు పాటుపడాలి ఆసియా ఖండం యొక్క భావి భాగ్యోదయం మీవంటి యువతీ యువకులమీదే ఆధారపడియుంది. మిగతా దేశాల్లోనున్న యువతీయువకులకంటె ఆసియాలో నున్నవారు ఎక్కువ బాధ్యత వహించి కృషి సల్పవలసియుంది

"అందుచేత మీరంతాకూడా ఎటువంటి క్లిష్ట సమస్యనైనా సరే ఎదుర్కోగల శక్తి సామర్థ్యాలను సంపాదించుకోవాలి. మన హిందూ ధర్మం ఏమి బోధిస్తుంది అంటే స్త్రీ పురుషులిద్దరూ ఏకత్వానికి చెందిన రెండు అంగాలు ఏ కార్యం సాధించాలన్నా ఈ రెండూ అవసరమే, ఏ ఒక్కర్ని విడదీసినా కార్యం పూర్తి కానేరదు ప్రపంచంలో సర్వజనులు సుఖించాలి అంటే స్త్రీ పురుషులిద్దరూ కూడా సరిసమానంగా కష్టసుఖాలను పంచుకుని, దేశ కల్యాణానికి పాటుపడిన్నాడే ప్రజలు సుఖపడతారు. కాబట్టి మీరంతా మీతండ్రులకు, సోదరులకు, ఆతర్వాత భర్తలకు పూర్తి సహకారాన్ని యివ్వాలని జ్ఞాపకముంచుకోండి

"చాలాకాలం వరకు మన స్త్రీలు ఈసంగతి గ్రహించక దేశస్వాతంత్ర్య పోరాటంలోకాని, దేశపునర్నిర్మాణ కార్యక్రమాల్లోకాని వారు తీసుకోవలసినంత బాధ్యత తీసుకోలేదు అలా పురుషులకు సర్వవిధాలా మనం తోడ్పడిన్నాడే మన కర్తవ్యాన్ని నెరవేర్చిన స్త్రీలము మనపూర్వపు ఔన్నత్యాన్ని, వారసత్వ గౌరవాన్ని నిలబెట్టిన వాళ్ళమౌతాం"



పంజాబీ స్త్రీలు, 'డోలక్' వాయిద్యముతో పాడుచున్న దృశ్యం. సోషల్ ఎడ్యుకేషన్ ఆర్గనైజర్లు, స్త్రీలను, తమ గృహములు, పరిసరములు, పరిశుభ్రముగా నుంచుకొనవలెనని కోరుతూ వ్రాసిన పాటను వీరు పాడుచున్నారు



రాజకీయాలు

శ్రీ గోళ్ళమూడి రామచంద్రరావు •

1954 ఫిబ్రవరి నాలుగో వారం మొదలుకొని మార్చి మూడో వారం వరకూ జాతీయ అంతర్జాతీయ రంగాల్లో నడిచిన ప్రధాన సంఘటనలు ఇవి— గుంటూరులో ఆంధ్ర హైకోర్టు స్థాపనకు శాసన సభ నిశ్చయించటం, తిరుకొచ్చిలో పి. ఎస్. పి. ప్రభుత్వ స్థాపన, తూర్పు పాకిస్థాన్‌లో ముస్లింలీగు ఓటమి, ఫ్రెంచి ఇండియా సోషలిస్టులకూ ఫ్రెంచి అధికారులకూ తగాదా రావటం, కాశ్మీర్‌లో అమెరికన్ ప్రతినిధులను తటస్థులుగా గుర్తించేది లేదని నెహ్రూ ప్రకటించటం, అఖిల అమెరికన్ రాజ్యాల సమాలోచనలు.

*　　　*　　　*

జూలై 5వ తేదీ నుంచి ఆంధ్ర హైకోర్టును గుంటూరులో నెలకొల్పాలని ఆంధ్ర శాసన సభ మార్చి 15వ తేదీన ఒక్క వోటు మెజారిటీతో (67–66) తీర్మానించింది. ఆంధ్ర ప్రభుత్వం దీనికి ఆమోదించి ఏర్పాట్లను జరుపుతున్నది. విశాఖపట్టణానికి హైకోర్టును తీసుకుని వెళ్లాలని ప్రభుత్వం తీర్మానం ప్రతిపాదించగా, వావిలాల గోపాలకృష్ణయ్య, నడింపల్లి నరసింహారావుగార్లు విశాఖపట్టణానికి బదులు 'గుంటూరు' అని మార్చాలని సవరణ ప్రతిపాదించగా సవరణ ఒక్క వోటుతో నెగ్గింది. కాంగ్రెసులో ముగ్గురు, కె.ఎం.పి. సభ్యుడు ప్రగడ కోటయ్యగారు, ఒక్కరు మినహా కె. ఎల్.పి. సభ్యులు, పి.ఎస్.పి, కమ్యూనిస్టులు సవరణను బలపరిచారు.

రాష్ట్రం అంతటిలోకీ కోర్టు వ్యవహారాలు ఎక్కువగా వున్న జిల్లాలో హైకోర్టు ఏర్పాటు జరుగుతున్నందుకు సంతోషమే కాని, దానితోపాటుగా సేల్స్‌టాక్స్ ట్రిబ్యునల్, పారిశ్రామిక వివాదాల ట్రిబ్యునల్, రోడ్ ట్రాన్స్‌పోర్టు బోర్డు మొదలైన వివాద పరిష్కార సంస్థల్నికూడా అక్కడే ఏర్పాటు చేసినప్పుడే దాని వల్ల పూర్తి సౌకర్యం అందరికీ లభిస్తుంది. హైకోర్టు ప్రధాన కార్యాలయం తాత్కాలికంగా గుంటూరులో నెలకొల్పాలని తీర్మానం చెప్పటం వల్ల రాజ్యాంగ రీత్యా ఆక్షేపణ చెప్పే వీలున్నదని కొందరు అభిప్రాయ పడుతున్నారు. కానీ ఆవిషయమై పేచీ వచ్చే సూచనలు కనిపించటం లేదు.

*　　　*　　　*

కిందటి నెలలో తిరువాన్కూరు-కొచ్చిన్, పెప్సూ రాష్ట్ర ఎసెంబ్లీలకు జరిగిన ఎన్నికల ఫలితంగా, తిరుకొచ్చిలో పి. ఎస్. పి. ప్రభుత్వము, పెప్సూలో కాంగ్రెస్ ప్రభుత్వము ఏర్పడ్డవి. తిరుకొచ్చి ఎసెంబ్లీలో 117 స్థానాలకూ కాంగ్రెస్ 45, కమ్యూనిస్టులు వారి సహచరులు కలిసి 40, పి.ఎస్.పి. 19, తిరువాన్కూరు తమిళ కాంగ్రెస్ 12, స్వతంత్రులు 1 స్థానాలను సంపాదించారు. వెనకటి ఎసెంబ్లీలో తమిళ కాంగ్రెసుతోసహా యావత్తు ప్రతిపక్షాల విశ్వాసాన్నీ పోగొట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోయి వున్నందు వల్లనూ, ఈతడవ ఎన్నికల్లోకూడా ప్రతిపక్షాలన్నీ కలిసికట్టుగా కాంగ్రెసును ప్రతిఘటించటంవల్లనూ కాంగ్రెస్ తానే ప్రభుత్వాన్ని నెలకొల్పటానికి సాహసించలేకపోయింది. పి.ఎస్.పి. నాయకుడు తాణుపిళ్లై యునైటెడ్ ఫ్రంటుతో కలిసి మిశ్రమ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయటానికి సిద్ధపడగా పి.ఎస్.పి. అఖిల భారత నాయకులు అడ్డపడి మిశ్రమ ప్రభుత్వం నెల కొనకుండా చేశారు.

ఇద్దరి గుద్దులాట మూడవ వాడికి లాభమనే ఉద్దేశ్యంతో పి.ఎస్.పి. ఒక్కటే ప్రభుత్వం నెలకొల్పాలనీ, లేదా యితర పార్టీలు ఏర్పాటు చేస్తే ఆయా అంశాలను పట్టి ఆ

ప్రభుత్వంతో పి.ఎస్.పి. సహకరించటమో, సహాయనిరాకరణం చేయటమో నిశ్చయించాలనీ అఖిల భారత నాయకులు ఆదేశించారు. కాంగ్రెస్ తర్వాత పెద్ద పార్టీ అయిన యునైటెడ్ ఫ్రంటు ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తానన్నప్పటికీ, కాంగ్రెస్ మంత్రుల సలహావల్లనో యేమో, రాజప్రముఖ్ తాణుపిళ్లై చేతనే మంత్రివర్గం ఏర్పాటు చేయించారు.

ఏపార్టీకీ కచ్చితమైన మెజారిటీ లేనప్పుడు, అందరికన్నా తక్కువ మంది వ్యతిరేకులనే కలిగి ఉన్న వ్యక్తి చేతనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయించటాన్ని ఎవ్వరూ ఆక్షేపించరు. కాని ముందు పెద్దపార్టీ నాయకులు అశక్తతను వెల్లడించినప్పుడే ఆచర్యను తీసుకోటం వుచితంగా వుండేది కాని, యునైటెడ్ ఫ్రంటును త్రోసివేసి ఈపని చేయటం మాత్రం వుచితంగా లేదు.

యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని ఏర్పడకుండా చేసి, ఆరోపంతుకన్నా తక్కువ వున్న పార్టీచేత ప్రభుత్వాన్ని స్థాపింపజేసినందువల్ల అఖిల భారత పి.ఎస్.పి. నాయకులు తిరుకొచ్చిలో తమ పార్టీకి వుపకారంకన్నా అపకారమే ఎక్కువ చేశారు. రాష్ట్రి పార్టీ మొదట ఎన్నికల్లో యునైటెడ్ ఫ్రంటుతో సహకరించటానికే వీళ్ళు చాలా పేచీలు పెట్టారు. తరవాత మిశ్రమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి రాష్ట్రి పార్టీ అడ్డుపడితే అడ్డగించారు. ఈ ప్రభుత్వానికి రోజులు బాగా ఉన్నంతవరకూ రాష్ట్రి పార్టీ సభ్యులు ఈ నియమాలను గౌరవిస్తారు కాని, ఏకాస్త వ్యవహారం ప్రతికూలించినా వీళ్ళ నాయకత్వానికే స్వస్తి చెపుతారని చెప్పవలసివుంటుంది. అదీకాక, కాంగ్రెసూ, యునైటెడ్ ఫ్రంటూ కూడా ఏదో విధంగా ఈ పార్టీని అప్రతిష్టపాలుచేసి నామరూపాలు లేకుండా చేయ ప్రయత్నిస్తారు. అసలు ఈ పార్టీ మనుగడకు అఖిల భారత నాయకులే ప్రమాదకారులన్న అభిప్రాయం దేశంలో ప్రబలినా ఆశ్చర్యం వుండనక్కరలేదు.

పి.ఎస్.పి. అఖిల భారత నాయకులు రాజనీతిజ్ఞులయితే ముందు యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని ఏర్పాటు కానిచ్చి, దానిసత్తువ ఏమిటో తెలుసుకునేవాళ్ళు. అందులో లోపాలు వుంటే దానిని కేరళ ప్రజలు కళ్ళకు కనబడేట్లు చేసి, అక్కడ యునైటెడ్ ఫ్రంట్‌కు నిలవ నీడలేకుండా చేయప్రయత్నించి వుండేవాళ్ళు. క్రిందటిసారి ప్రభుత్వాన్ని నెలకొల్పిన కాంగ్రెస్ ఈ వుద్దేశ్యంతోనే యీ తడవ వెనక్కు తగ్గింది. కాని పి.ఎస్.పి. నాయకులకు యీ యింగితం లేకపోయింది.

పి.ఎస్.పి. ప్రభుత్వం తాను అనుకున్న పనులు చేయటానికీ, ప్రజాభిమానం సంపాదించటానికీ యీ కింద చెప్పిన ఆటంకాలు ఉన్నవి— 1. పంచవర్ష ప్రణాళిక పూర్తి చేయటానికి డబ్బు చాలనందువల్ల కేంద్రం ద్రవ్యోల్బణను ప్రోత్సహించే చర్యలను తీసుకొన నిశ్చయించటం. 2. ప్రజాస్వామ్య దృష్టికన్నా ఎక్కువ సామ్రాజ్య వాదపు వైఖరిని ప్రదర్శిస్తున్న ఆంగ్లో-అమెరికన్ వర్గం దేశంలో అంతా నిరసిస్తుండగా, పి.ఎస్.పి. కేంద్ర నాయకులు అభిమానాన్ని ప్రదర్శిస్తూ (ముఖ్యంగా పాక్-అమెరికన్ సైనిక ఒప్పందం పట్ల పి. ఎస్. పి. కేంద్ర నాయకుల వైఖరి పార్టీలో అనేక రాజీనామాలకు కారణమయింది.)

* * *

తిరుకొచ్చిలో కాంగ్రెస్ వెనకటికన్నా ఒక్క స్థానాన్నీ, యునైటెడ్ ఫ్రంట్ వెనకటికన్నా 8 ఎక్కువ స్థానాలను సంపాదించుకున్నవి. కాంగ్రెస్‌కు వోటు చేసిన జనం దామాషా కూడా పెరిగింది. పెప్సూలో ముప్పాతిక వంతు స్థానాలు కాంగ్రెసుకు వచ్చినవి. పాకిస్తాన్‌తో సంబంధాలు చెడిపోవటం, అంతర్జాతీయంగా భారతదేశానికి యిటీవల పండిత నెహ్రూ సాధించిన పరువు ప్రతిష్టలు ఈ కాంగ్రెస్ విజయాలకు ముఖ్యకారణాలని చెప్పవచ్చు.

* * *

పంచవర్ష ప్రణాళిక పూర్తి కావటానికి ఇంకా 1200 కోట్ల రూపాయలు లోటుగా ఉన్నవి. అదీకాక యింకనుంచీ విదేశాలనుంచి వచ్చే సహాయం చాలా తగ్గిపోతుందని ప్రధాని నెహ్రూ హెచ్చరించి ఉన్నారు. సామ్రాజ్య వాదాన్ని ప్రపంచమంతటా ప్రతిఘటించటంలో ఇండియా అనుసరిస్తున్న వైఖరి అమెరికాలో నెమ్మదిగా బయలుదేరుతున్న ఆర్థిక మాంద్యము దీనికి కారణాలుగా కనిపిస్తున్నవి. ఇందుమూలంగా ప్రణాళికను పూర్తిచేయటంకోసం లోటు ఖజానా పద్ధతిలో పెట్టుబడి పెట్టటానికి ఆర్థిక మంత్రి

రాజకీయాలు

నిశ్చయించారు. అంటే ప్రాజెక్టుల నిర్మాణానికి కొత్త నోట్లను అచ్చువేయటం, ట్రెజరీ బిల్లులను ఎక్కువగా జారీ చేయటం మొదలైన పద్ధతులు అనుసరించబడతవి. మామూలుగా నోట్లకు హామీగా వెండి, బంగారాలు ఉంచుతారు. ఈ పద్ధతిని పెట్టుబడి జరిగినప్పుడు నిర్మాణం జరిగే ప్రాజక్టులనే హామీగా తీసుకోవలసివుంటుంది. ఇది తాత్కాలింగా నయినా ద్రవ్యోల్బణకు - డబ్బు విలువ పడిపోవటానికి కారణమవుతుంది. డబ్బు విలువ పడిపోతే ధరలను అదుపులో ఉంచటం ప్రభుత్వానికి అసాధ్యమవుతుంది.

ఇదివరకు ద్రవ్యోల్బణను తొలగించటానికీ, దొంగ మార్కెట్ దార్లు సంపాదించిన సొమ్మును బయట పెట్టించడానిగాను భారత ప్రభుత్వం వెయ్యి రూపాయలు మొదలైన పెద్ద నోట్లను రద్దు చేసింది. కాని ఏప్రిల్ 1 వ తేదీనుంచీ తిరిగి వెయ్యి, 5 వేలు, 10 వేల రూపాయల నోట్లను ప్రవేశపెట్ట నిశ్చయించింది.

భారత ప్రభుత్వ కొత్త బడ్జెట్ సబ్బులు, పక్కలు, కాలిజోళ్ళు, కళ్ళజోళ్ళ ఫ్రేములు, బట్టలు మొదలైన వాటిమీద పన్నులను హెచ్చించింది. కొత్త ఆంధ్ర బడ్జెట్ నీటి తీరువను పెంచింది. అభివృద్ధి పన్ను ప్రతిపాదించింది. ఆంధ్రలో నిర్మాణ కార్యక్రమాలకు డబ్బు రావాలంటే మద్యనిషేధాన్ని రద్దు చేయాలని వాదించబడుతున్నది కాని, ఇళ్ళదగ్గరా, చాటుమాటునా సారాయిని కాఫీ కాచుకున్నట్లు కాచుకుని తాగేందుకు అలవాటు పడ్డ జనానికి ప్రభుత్వ డిపోలలో తాగి ప్రభుత్వానికి డబ్బు ముట్టజెప్పాలన్న 'సద్బుద్ధి' ఎట్లాకలుగుతుందో మాత్రం ఎవ్వరూ చెప్పరు.

◆ ◆ ◆

పాకీస్థాన్‌లో వయోజన వోటింగు పద్ధతిమీద మొట్టమొదటి ఎన్నికలు తూర్పు పాకీస్థాన్‌లో జరిగినవి. ముస్లిం లీగ్ ఘోర పరాజయం పొందింది. యావన్మంది మంత్రులు ఓడిపోయినారు. ఫలితాలు తెలిసిన 200 పైచిల్లర స్థానాల్లో లీగుకు 7 మాత్రమే వచ్చినవి. యునైటెడ్ ఫ్రంట్ కచ్చితమయిన మెజారిటీని సాధించింది. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పాటవుతుందని పాక్ ప్రధాని ప్రకటించారు.

ఈ యునైటెడ్ ఫ్రంట్ వామ పక్షాలకు సంబంధించింది కాదు. కాంగ్రెసు విధానాలకు నిరసించి, చీలిపోయిన కె.ఎం.పి., పి.ఎస్.పి.ల వలె, లీగ్ విధానాలు నచ్చని మాజీ లీగర్లూ, అమెరికాతో పాకీస్థాన్ చేసుకున్న సైనిక ఒప్పందం పాక్ స్వాతంత్ర్యానికి హానికరమని గుర్తించిన మాజీ లీగర్లూ, తూర్పు బెంగాల్ అభివృద్ధికి ఇండియాతో వర్తక సంబంధాలు బాగా అభివృద్ధి కావాలని భావించే అభ్యుదయ వాదులూ యిందులో ఉన్నారు. బెంగాలీ భాష పట్ల పాక్ ప్రభుత్వం చూపుతున్న నిరసన, మొత్తం పాకీస్థాన్ జనసంఖ్యలో సగానికి పైగా ఉన్న ఈ రాష్ట్రానికి కేంద్రంలో తగిన ప్రాతినిధ్యం లేకపోవటం అనే, అంశాలు కూడా ఫ్రంట్ గెలుపుకు కారణాలయినవి.

లీగ్ పరాజయాన్ని పట్టి పాక్ రాజ్యాంగ సభకే తిరిగి ఎన్నికలు జరగాలని ఫ్రంట్ నాయకులు వాదిస్తున్నారు. కానీ ఆ అవసరం లేదని కేంద్రప్రధాని నిరాకరించారు. ఏ విషయం ఎట్లా ఉన్నా, తూర్పు పాకీస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం పాక్ - అమెరికన్ ఒప్పందానికి వ్యతిరేకత చూపుతున్నదని మాత్రం భావించ బడుతున్నది.

6 సం॥ల నుంచీ నిర్బంధంలో ఉన్న సరిహద్దు గాంధీ గఫార్ ఖాన్ ఈ నెల పాక్ రాజ్యాంగ పరిషత్ సమావేశానికి డిటెన్యు హోదాలోనే హాజరై ప్రత్యేక పఠానిస్థాన్ రాష్ట్రం ఏర్పడాలని కోరారు.

◆ ◆ ◆

ఇంతవరకూ ఫ్రెంచి ఇండియాలో ఫ్రెంచి పరిపాలనను సమర్థిస్తున్న సోషలిస్టులకు యిప్పుడు ఫ్రెంచి అధికారులతో వివాదాలు ఏర్పడ్డవి. ముఖ్యంగా సోషలిస్టు నాయకుడు గుబేర్‌కు గవర్నర్‌తో పడటంలేదు. దీనితో ఫ్రెంచి ఇండియా విడిగా ఉంటే దొంగ రవాణా వ్యాపారాల వల్ల బాగుపడుతున్న కొద్దిమంది ధనికులు మినహా యావన్మంది ప్రజలు ఫ్రెంచి పాలనకు విముఖులయినారు. ఫ్రెంచి ఇండియాలోని 8 బస్తీల పురపాలక సంఘాలు రెఫ్‌రెండం లేకుండానే ఫ్రెంచి ఇండియాను ఇండియాలో కలిపివేయాలని మార్చి 19 న తీర్మానించినవి. ఈ తీర్మానాన్ని మంత్రివర్గసభ్యులు ఆమోదించారు. ఎప్పుడయితే సోషలిస్టులు కూడా ఎదురు తిరిగారో, అప్పటి నుంచీ ఫ్రెంచి అధికారులు పోలీసులను ప్రయోగించి జనాన్ని హడలగొట్ట ప్రయత్నాలు సాగించారు. దీనికి భారత

రాజకీయాలు

ప్రభుత్వం నిరసన తెలియ జేసింది. ఏది ఎట్లా ఉన్నా, ప్రజలంతా పూర్తిగా ఎదురు తిరిగారు గనుక, ఫ్రాన్సు, చంద్రనగర్ నుంచి నిష్క్రమించినట్లే మిగిలిన ఫ్రెంచి ఇండియానుంచి కూడా త్వరలోనే వెళ్ళిపోక తప్పేట్లులేదు.

* * *

పాకిస్థాన్‌కు సైనిక సహాయం చేయటానికి అమెరికా బాహాటంగా సన్నాహాలు చేస్తూ యిందువల్ల, కాశ్మీర్‌లో పాకిస్థాన్ దురాక్రమణను ఎదుర్కొంటున్న భారత దేశం ఆ ప్రాంతంలోని సమితి పరిశీలకుల్లో వున్న అమెరికన్లను తటస్థులుగా గుర్తించ నిరాకరించింది. భారత ప్రధాని పార్లమెంటులో ఈ అంశం తెలియజేశారు. ఇండియా అభ్యంతరాన్ని సమితి కార్యదర్శి లక్ష్యపెడతాడో లేదో తెలియదు. నెహ్రూ ప్రకటనవార్త విన్న వెంటనే ఆయన అన్న ముక్క ఇది "అక్కడి అమెరికన్లు సమితి ప్రతినిధులుగానే వ్యవహరిస్తున్నారు కాని అమెరికా ప్రతినిధులుగా కాదు."

కాశ్మీర్ ప్రభుత్వం ఏనాడో సమితి పరిశీలకులు యావన్మంది పట్లనూ అనుమానం వెల్లడించి ఉన్నది. నేపాల్ ప్రధాని కోయిరాలా ప్రభృతులు అంతర్జాతీయ సంస్థల ప్రతినిధుల మన్న పేరుతో విదేశీయులు కుట్రలు పన్నుతున్నట్లు ఆరోపించి ఉన్నారు. కాశ్మీర్ ప్రభుత్వం ఏనాడో నిరాకరించి వున్న కాశ్మీర్ మధ్యవర్తి నిమిట్స్ యింకా ఆ పదవిలో ఉన్నట్లే సమితి కార్యాలయం పరిగణిస్తున్నది.

* * *

కెనడా మినహా, ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాల లోని రాజ్యాలన్నీ మార్చినెలలో కరాకస్ అనేచోట సమావేశం జరుపుతున్నవి. ఈ దేశాల్లో కమ్యూనిస్టులు వ్యాపిస్తున్నారన్న భయంతో వాళ్ళ మీద ఆయాప్రభుత్వాలచేత కత్తి కట్టిద్దామన్న ఉద్దేశ్యంతో అమెరికా ఈ సభను ఏర్పాటు చేసింది. కమ్యూనిస్టు కార్యకలాపాలను నిరోధించాలన్న తీర్మానాన్ని అమెరికా ప్రతిపాదించగా దక్షిణ అమెరికా దేశాలన్నీ అసలు తమ దేశాల్లో అన్ని విదేశాల జోక్యాన్నీ నిరసించినవి. యూరప్ దేశాల వలస విధానాన్నీ, అమెరికా వ్యాపార విధానాన్నీ తీవ్రంగా నిరసించినవి - ముఖ్యంగా అర్జెంటీనా, బ్రెజిల్ దేశాలు అమెరికా వైఖరిని నిరసించినవి.

కమ్యూనిజం వ్యాప్తిని నిరోధించాలంటే తమ దేశాలు ఆర్థికంగా బలపడి, ప్రజల జీవిత పరిస్థితులు అభివృద్ధి చెందాలనీ, దానికి అమెరికా వైఖరి అనుకూలంగా లేదనీ అవి నిరసించినట్లు ఫ్రాన్స్ ప్రెస్ ఏజన్సీ విలేఖరి తెలియజేశాడు. తాము సప్లయి చేసే ముడి పదార్థాలకు అమెరికా అతి నికృష్ట మయిన ధరను యిచ్చి, తను పంపే సరుకులకు అత్యధిక ధరలను వసూలు చేస్తున్నదని ఆ దేశాల ప్రతినిధులు ఆరోపించారట.

గ్వాటిమాలా మినహా మిగిలిన దేశాలన్నీ కమ్యూనిస్టుల పై చర్య జరపాలన్న తీర్మానాన్ని ఆమోదించినవి. అప్పుడే గ్వాటిమాలా కమ్యూనిస్టు దేశమని బ్రిటన్ ప్రచారం ప్రారంభించింది. అయితే బ్రిటన్ ప్రచారానికి కారణం వేరే ఉన్నది. గ్వాటిమాలా తన సరిహద్దునే వున్న బ్రిటిష్ వలస హాండ్యురాస్ తనకు రావాలని వాదిస్తున్నది. అందువల్ల ఈ ప్రచారంతో దానిని పడగొట్టాలని బ్రిటన్ ప్రయత్నిస్తున్నది.

బ్రిటిష్ హాండ్యురాస్‌లో ఎన్నికలు జరగ బోతున్నవి. అక్కడ పీపుల్స్ పార్టీకి - గెలుపు తథ్యమని అంతా అనుకుంటున్నారు - ఈ పీపుల్స్ పార్టీకి గ్వాటిమాలా ప్రభుత్వంతో సంబంధం ఉన్నదని హాండ్యురాస్ బ్రిటిష్ గవర్నర్ బ్రిటిష్ ప్రభుత్వానికి ఫిర్యాదు చేయగా వాళ్ళొక 'విచారణ' జరపటానికి ఏర్పాట్లు చేశారు. గయానాలో ఏర్పడ్డ పీపుల్స్ పార్టీ ప్రభుత్వాన్ని కమ్యూనిస్టులని చెప్పి బ్రిటన్ సైనిక బలంతో కూలదీసిన సంగతి అంతా ఎరిగిన సంగతే.

ఈ విధంగా కమ్యూనిస్టుల సాకుతో బ్రిటన్ తన వలస విధానాన్నీ, అమెరికా తన వ్యాపారపు దోపిడినీ దక్షిణ అమెరికాలో సాగిస్తున్నది.

దక్షిణ అమెరికాలో పరోక్ష మార్గాల జరుపుతున్న దోపిడిని పోర్టోరికోలో బహిరంగంగానే అమెరికా జరుపు తున్నది. దీనికి నిరసన చెందిన పోర్టోరికన్ అతివాద దేశభక్తులు కొందరు మార్చినెలలో అమెరికన్ కాంగ్రెస్ భవనంలో ప్రవేశించి నలుగురు సభ్యులను తుపాకులతో కాల్చిగాయపరిచారు. లోగడ ట్రూమన్ అమెరికా ప్రెసిడెంటుగా ఉన్నప్పుడు పోర్టోరికన్ జాతీయ వాదు ఆయన్ను హత్య చేయ ప్రయత్నించటం జరిగింది.



'రాగ్ వసంత్'

వసంతాగమ నృత్యం - ఇటీవల భారత ప్రభుత్వ విద్యా శాఖవారిచే, నేషనల్ మ్యూజియమ్‌లో ఉంచుటకై సేకరింప బడిన 'రాగ మాలా' చిత్రములలో నిదియొకటి. రసపుత్ర కాలమందలి ఋతు వర్ణన చిత్రములు, అప్పటి ఋతు వర్ణనకు సంబంధించిన జానపద గేయాల ననుకరించబడినవి.

గండిపడే మొండి జీవనం

*** శ్రీ కవికొండల వేంకటరావు ***

ఊరుపేరు చెప్పినా, మనిషిపేరు చెప్పినా అంతా ఎగబడతారు తెలుసుకోడానికి. పేరులో అంత చమత్కారం వుంది. అయితే కథలో చమత్కారం వున్నప్పుడు పేరుతో నిమిత్తం లేదు. చదివేవానికి స్ఫురిస్తేచాలు. ఎక్కడ వుంది ఆవూరు, ఎవరా మనిషి అని!

కొన్ని కొన్ని చూపులు వరద వచ్చాక ఒకలాగుండేవి. వరద రానప్పుడొకలాగుండేవి. రెండింటికీ పోలిక లేక పోవచ్చు. కాని, వరద వస్తూవుంటే ఆ ఒడుదుడుకు సమయంలో సాక్షాత్కరించే దృశ్యమున్న దే, అది, మనం ఆకట్టుకోగలిగితే, తత్పూర్వమెలావున్నదో, తదనంతర మేలావున్నదో, నష్టమయిందిఏదో, పుష్టిగన్న దేదో అంతో ఇంతో గోచరింపునకు రాకమానదు— పూర్వజన్మసుకృత ముకుమల్లే.

ఏమో అని ఆలోచిస్తే, అయోమయంగా, అంధ కారంలో, ప్రకాశ మిసుమంతా లేని బాటను, పరమావధి కాసంతా కానబోని నిరాశతో నీరవంగా ఒక రమణీమణి తన చిటికెనవేలు పట్టుకొని, కూడా కూడా నడుస్తూవున్న, ఒక అయిదారేళ్ళ ఆడపిల్లతో, తల్లీ పిల్లా ఇరువురైనా ఒంటరితనమే అన్నట్టు, అడుగులు వేసుకుంటూ కోన సీమలో నడుస్తూ వున్నారు. సర్వసాధారణంగా, పగలెవ రైనా వారిద్దరూ అరికట్టేరేమోగాని, రాత్రిపూట ఎవరీ ఆపబోరనే అనుకోవాలి. అంత తొందర తొందరగా తల్లి అడుగులు వేస్తూ వుంది. తల్లితోబాటు పిల్లా నడుస్తూంది. చిటికెనవేలు విజ్జోడు చేసినప్పుడల్లా చీర చెంగు పట్టు కుంటూ, చీర చెంగు ముందుకు పైచుకొన్నప్పుడల్లా చిటికెనవ్రేలందుకుంటూ, అయోమయమైన బ్రతుకుతో, అంధకారబంధుర మైన బాటని వారు నడుస్తూ వున్నా, వారి అడుగు క్రింద నేలపరపుగా గట్టిగా, నిబ్బరంగా, నీటుగా వున్నట్టుంది. తిన్నగా యేదో కడకు గొంపోయే టట్టు. ఎవరో వేసినట్టు వుంది. నేల కోతట్టు ప్రవహిస్తున్న కాలువ నీరు, ఓతట్టు మళ్ళీ గట్లంట బిలబిల మంటూ రొదగా వినవస్తూన్న నీరు. కాలవ దాటి ఆవలగట్టెక్కి చూదాం అంటే దాటించే పడవలేదు. ఈవల మళ్ళీ గట్లడ్డ మడి పోదాం అంటే అంతా ఊడ్చిన పొలం. కాబట్టి కాలికి తగిలే నేల ఏదారికి తీస్తే ఆదారికే వెళ్లాలి ఆ తల్లీ పిల్లా యిరువురూకూడా!

వర్షాకాలం ఇంకా గడచిపోని గడ్డురోజులవి. ఏమైనా ప్రతిధ్వనిస్తే, కూలీలు పగలు పాడిన ఊడుపు పాటలకు చెందియుండాలిగాని కోయిల పాటలవి కానేరవు. ఏమైనా అంధకారాన్ని పోగొట్టే వెలుతురు కాపడితే, అది మేఘం మెరిసే మెరపుది కావాలికాని, కొఱవి దయ్యపు మంట కూడా కానేరదు. ఇహ లోకం అంతా నిదిరిస్తూవుందా అని అనిపించే వేళఅది. ఒక్క ప్రకృతి తప్పిస్తే—ప్రకృతి లోకూడా కొన్ని కొన్ని చెట్లయొక్క ఆకులు కనుమూసి నట్టు మూతలు పడి ఒండొంటిని హత్తుకుపోయి అదే నిదరలో పడ్డట్టున్నాయి. పంచ భూతాల్లోను నాడొక్క జలదేవత తప్ప తతిమ్మా దేవతలన్నీ ఏమైనాయా అనే మీమాంసలో పడితీరవలసించే!

జలదేవత! ఆమె ఆపొద్దు ఎవరూ చూడకుండా, ఎవరూ వినకుండా చల్లగా సాక్షాత్కరింప సాగింది. తనపేరు తనకే తెలియదు అన్నదీమతల్లికి. మనమనుకునేం "గోదావరి" అని దానిని గూర్చి. కాని దానికదొఒళ్ళు తెలియని ఉత్తి జల ప్రవాహమే. నాసికాత్ర్యంబకమునుండి మహాసముద్రం దాకా ఒకటే జీవనంగలదై నిత్యచేతనంగల దవడంచేతను, అది జలదేవతగా మనముందు సాక్షాత్కరింప గలుగు తూవుంది. "గోదావరి"అన్నా అదే, "దక్షిణగంగ" అన్నా అదే, "అఖండగౌతమి" అన్నా అదే, "వృద్ధగౌతమి" అన్నా అదే, "వసిష్ట" అన్నా అదే, "వైనతేయము" అన్నా అదే, కోనసీమ పంటకాలవన్నా అదే, కొబ్బరి తోటను చుట్టివచ్చే అబ్బురపు టివల్ అన్నా అదే! వెళ్ళిన కొద్దీ అంతా ఆ జలదేవత మయమై యొప్పె!! అయితే, ఆదేవత, గట్లమధ్య నున్నంతసేపూ, ఎంతఎత్తు లేచినా, ఎంత ఉద్రుతం చూపించినా, ఎవరికీ ఏమీ ఫరవాలే. కట్టు బాటులోవున్న మనిషి జీవనంలాంటిది! ఏర్పాటుగా నేర్పుగా కాబడేని! గట్లు తెగి విడివడిందా, అప్పుడు చూడాలి దాని వైఖరి, విలాసం, స్వేచ్ఛ, ఇచ్ఛ! ఈ గట్లు తెగి గండి పడడం అనేది, రాత్రే జరిగేనో, పగలే జరిగేనో, పట్నానికే గొప్పతగ్గేనో, పల్లెటూరికే ముప్పు వాటిల్లేనో తెలుపనంతటి పరమరహస్యం!

ఒక్కనిమేషంలో ఏటిగట్టు తెగింది, నీరు ఈవల కాలవలోకి పడింది. అంతా తెప్పానాం తేలానాం అయి ఊరుకుంది. కనిపెట్టిన వాళ్ళులేరు. విని పించుకున్న

వాళ్ళులేరు. ఎక్కడి పడవలక్కడ కట్టబడి పోయినాయి. ఒకమైలు ఎటుచూచినా నీటివేగమూ నీటిపలుపూ తప్ప మరొకటికానం. వేలకొద్ది సుడిగుండాలు, ఎక్కడ నుంచి వచ్చేను ఈ నీరంతా అని అనుకొనేలో మళ్లో అంతనీరు ప్రత్యక్షం. కాలవకీతట్టు తల్లీ పిల్లా నడుస్తూవున్న బాటే పారమన్నా తీరమన్నా! ఆతీరాన్నే వో కొంత దూరం తియ్యమామిడి చెట్లవరుసలు, ఓకొంతదూరం మీద కొబ్బరి మోకలు, ఓ కొంతదూరం ఊడలు దిగిన మఱ్ఱిచెట్లు, ఓ కొంతదూరం ముళ్ళతో బలిసిన తుమ్మచెట్లు. ఇలా రకరకాలు. కంచెగాకుండా, అంచుగాకుండా మించి వున్నాయి. మంచు తడిసున్నాయి. చీకట్లో అయినా అన్నీ మెఱుస్తూ వున్నాయి. మెఱుగుడు పురుపుల్తో అన్నీ కీచు మంటున్నాయి. ఎదో పురుగు సంచారంతో, అన్నీ తిన్నందనం తప్పితే, తగిలేవీ తాకేవీ!

మఱి పిల్లా తల్లీ వేర్పాటు అయ్యే రోజులొచ్చాయా అని అనిపించింది అని అనుకోండి. అఘడియ ఆలాంటిది. కాని భగవంతుడు అలా వేర్పాటుగానిస్తాడా? పేగుమమత పోనిస్తాడా?

మఱి తల్లి తలపోసింది! కాలవ కాలవలా నిలవదని, తాము నడిచేదారి దారిలా వుండబోదని? – దాన్ని కూడా తెగ్గొట్టి పెద్ద కనీ వినని గండి ఆ ప్రాంతమందు పడి తీరు తుంది అని, తామెటు పోయినా తప్పేసూత్రం ఇఖలేదని.

ఆ నిరాశాలోచనలో ఆమె కాలి కింది కప్పుడే గౌతమీ జలం వచ్చేసినట్టు అయింది. పిల్లనట్టే బుజానికెక్కించు కుంది. బుజం మీద కెక్కిన పిల్ల ఊరుకోవచ్చునా? "అమ్మా! అమ్మా! ఎంతనీరో! అంతానీరేనేవ్!" అని అరుస్తూ, ఇంకా పై జూపు చూఱ గొందామని, తనకందే ఒక లేలేత మామిడి కొమ్మనందు కుంది. తల్లి కాళ్ళ క్రింద నీరులో గుండె ఝల్లుమనేలా వెల్లువై విడగొట్టింది బాటను రెండు ముక్కలుగా. హద్దులేని దానిగా జేసింది అధ్యమంతాను. అటో మూడు ఫర్లాంగులు, ఇటో మూడు ఫర్లాంగులు బాటా ఆ నీటి చేతను దిగమ్రింగబడి చెట్ల వ్రేళ్ల మాత్రంగా, కొమ్మల మాత్రంగా నిలిపి తన చాయను చూపిస్తూవుంది.

అరెరే! తల్లి వెల్లువనే తారుమారు రూపం దాల్చింది. పిల్లమాత్రం పోలిక చెడకుండా, కొమ్మలో కోకిం పిట్టలా నీళ్ళమీద హంసకూనలా మీద మీద గపిస్తూవుంది. నీటమునిగే చెట్టుమీద! తల్లి పిల్లను మరచిపోయిందో లేదోగాని, పిల్ల మాత్రం తల్లిని మరచి అరవసాగింది. "వారా వీరా" అని. ఉదయించే సూర్యకిరణ మొక్కడే ఆపిల్లకు మరి తోడన్నట్టు తెల్లారింది!

తెల్లారి చూస్తే లోకం అంతా మరో రూపం! ఎక్కి చూచే ఏటిగట్టూలేదు. పడవలు నడాడే కాలవా లేదు. పంటా లేదు, వంటా లేదు. సస్యశాలిని సమస్తం సైకత సాంద్రంగా అయిపోయింది. రాజమార్గం, వస్తూపోతూ వుండే రాజమార్గంకు, బండ్ల రాయిడి తప్పి, గండ్లరాయిడి తగిలింది. పెద్ద గండి ఆచోట పడింది. అక్కడే పడింది. ఆ తల్లీ పిల్లా నడచేచోటనే పడింది. అంధకారాన్ని పడింది. అయోమయంగా పడింది.

అవితే గండిదా మొండి జీవనం, ఆమెదా మొండి జీవనం అన్నట్టు, తల్లి ఈతాలాడుతూ, పిల్ల ఎక్కి అరుస్తూ వున్న చెట్టు మొదటను కౌగలించుకుని కొస ప్రాణంతో వుంది!

పిల్ల "అమ్మా!" అంది లోకాన్ని ఆనవాలు పట్టినట్టు. తల్లి "బాగున్నావా? నా తల్లీ!" అంటూ ప్రాణం విడిచింది.

విజయనగరం. చిత్రకళాశాల విద్యార్థుల చిత్ర రచన.



' మధురానగరిలో '

చిత్రకారుడు ద్వివేదుల సోమనాథ శాస్త్రి.



' గాలిదెబ్బ '

చిత్రకారుడు టి సింహాచలం.



' తల్లీ బిడ్డా '

చిత్రకారుడు కాకినీడి భాస్కరరావు

కాలవాహినిలో కలసిపోయిన

కజిన్సు సతి

శ్రీమతి కె. లక్ష్మి రఘురామ్

ఏమి చిత్రము! ఎంతటి విచిత్ర జీవితము! అది స్వదేశము, ఇది మాతృదేశము. అది ఇంగ్లాండుకు సమీపమున నున్న చిన్న ద్వీపము, ఇది ఆసియాఖండము లోని ద్వీపకల్పము. నడుమనున్నవి మూడు ఖండములు, నాల్గు మహా సముద్రములు మాత్రమే! అచ్చట బుట్టిన ఒక దంపతులను ఇచ్చటి దేశము మాతృదేవియై లాలించినది. వారు మాతృదేవికి ప్రేమాంజలి ఘటించుచూ భారతీ



యులలో లీనమైరి. ధన్యము వారి జీవితము. కృతజ్ఞులు భారతీయులు.

భర్త సుప్రసిద్ధ కవి. లోకమునకు ఆయన పేరు జేమ్సు హెచ్. కజిన్సు. ఆమెకు ఆయన 'జిమ్'. ఆమెకు నామకరణము చేసిన పేరు 'మార్గరెట్', 'గ్రెట్టా' భర్త పెట్టుకొనిన ముద్దు పేరు.

కజిన్స్ సతి ఐర్లండులో బాయిల్ (Boyle) అను చిన్న పట్టణములో 7 నవంబరు, 1878 న జన్మించినది. వాక్చాతుర్యము, సంగీతము, ధైర్యము ఉగ్గుపాలతో గుడిచినది. సంగీత విద్య నభ్యసించి అందు పట్టము పొందినది. ఇరువది రెండవ ఏట యీమెకు వివాహమైనది.

ఉన్నతాదర్శముల మాంగల్యమును డాక్టరు కజిన్సు సతి కంఠమున అలంకరించెను. బహు పవిత్రము వారి దాంపత్య జీవితము. భర్త శాకాహారి. వివాహమునాటి నుండియు ఆమెయు శాకాహారియయ్యెను. పతి నిర్బంధము చేయలేదు. ఉన్నతాదర్శముల అవరోహణలో దంపతులు దాటిన మొదటి మెట్టది. భర్త కవిత, భార్య గానము వారి ప్రేమకలాపములు. సతీపతులలో హెచ్చు తగ్గులు లేవు. ఇద్దరూ సమానులే. ఇద్దరూ ఏక మనస్కులే. ఆదర్శ ప్రాయము వారి దాంపత్యము.

వివాహానంతరము పది పదిహేను సంవత్సరములు ఆమె వారి స్వదేశములోనే వుండెను. అప్పుడు ఆమె భర్తతోపాటు సాహిత్య సభలయందు, శాసన సభలయందు, శాకాహార సంఘముల యందు, స్త్రీల హక్కుల పోరాటము లందు ప్రత్యేక శ్రద్ధ తీసికొనుచుండెను. రెండు పర్యాయ ములీమె ఐర్లండు స్త్రీల హక్కుల పోరాటమున కారాగార మునకు వెళ్ళవలసి వచ్చెను.

ప్రపంచమంతటా అప్పుడు సంచలనము. ఒక చోట ప్రపంచ సంగ్రామపు గుసగుసలు. మరియొక చోట స్వరాజ్య పోరాటము. ఇంకొక యెడ స్త్రీల హక్కుల హాహాకారములు. అచ్చటచ్చట మత సంఘ సంస్కర్తల తీవ్ర ప్రచారములు. అప్పుడే భారతదేశము దీర్ఘ నిద్రనుండి మేల్కొను చున్నది. గాంధీ మహాత్ముడు స్వాతంత్ర్య దుంధుభినింకా మ్రోగించ లేదు. భారతీయులప్పుడే కళ్ళు నులుపుకొనుచున్నారు. ఇంతలోకే అనిబెసంటు సతి శంఖా రావము హోమ్ రూలు ఉద్యమము ఆరంభించి విజృ ంభించుచున్న తరుణము.

'ఎప్పుడు భారతదేశమేగు అదృష్టమున్నదో' యని ఆకశమున చుక్కలను పరిశీలించుచూ యున్న సమయ

ములో (1915) అనిబెసంటు సతి భారత దేశమునకు కజిన్సు దంపతులను రమ్మని ఆహ్వానము (ఆదేశమో!) బంపెను. తమ యదృష్టమే మహాదృష్టమను కొనుచూ వారు స్వదేశమును విడచి నూతన జీవితారంభమునకై వువ్విళ్ళూరుచూ పయనమై, సముద్రములు ఖండములు దాటి నవంబరు 1, 1915 న మద్రాసు చేరిరి.

అడయారులోని దివ్య జ్ఞాన సమాజము వారి నివాసము. అనిబెసెంటు సతి అప్పుడు దిగ్విజయముగా హోమ్‌రూలు ఉద్యమమును ఒక వంక, దివ్యజ్ఞాన మత ప్రచారము మరియొక వంక జరుపుచూ భారతీయుల స్వదేశాభి మానమును రెచ్చగొట్టి ద్విగుణీకృతము చేసెను. ఆమె యాజమాన్యమున భారతీయ దేశాభ్యుదయమునకు అనేక విధముల సభలు, సమావేశములు, విద్య, మత, కళ, రాజకీయ ప్రచారములు జరుగుచుండెను. ఆమెకు పలు దేశములలో శిష్యులుండిరి. భారత దేశమునను ఆమెకు శిష్య పరంపర లభించెను. ఆమె సేవాసహకారులలో కజిన్సు దంపతులు అగ్రగణ్యులు — నమ్మిన బంట్లు — చూచి రమ్మనిన కాల్చివచ్చు బంటు మన సోదరి కజిన్సు సతి.

కజిన్సు సతికి భారత దేశము మాతృదేశము. ఈ దేశమునే నిష్కళంక హృదయముతో ప్రేమించుచుండెను. భారతీయులను తన సోదరులవలెనే ఆదరించుచుండెను. వారికొరకు ఆమె చేసిన సేవ అపారము. నలుబది సంవత్సరముల స్వార్థరహిత నిష్కళంక సేవను వివరించిన పెక్కు గ్రంథములే కాగలవు.

కజిన్సు సతి మన దేశములో విద్యావ్యాపకములో, స్త్రీల హక్కుల పోరాటములో, స్వరాజ్య సమరములోని అద్వితీయమైన పాత్ర సాటిలేనిది.

మదనపల్లిలో దివ్యజ్ఞాన కళాశాలను కజిన్సు దంపతులు ఒక అద్భుతమైన విద్యా కేంద్రముగా తయారు చేసిరి. విద్యతో పాటు ఉత్తమ ఆదర్శములు గరపిరి ముఖ్యముగా కజిన్సు సతి అచ్చటి విద్యార్థినుల యందు ప్రత్యేక శ్రద్ధ తీసికొనుచుండెను. వారికి దేశాభిమానము, మతాభిమానము, చిత్ర కళ, గాన గళ, ప్రకృతి సౌందర్యోపాసనల యందు ఉద్బోధముగావించెను. గృహాలంకరణము యందు, ఆరోగ్యవిధులయందు, పౌరధర్మములయందు ఉత్సాహము కలిగించునట్లు ప్రోత్సాహించు చుండెను. మన స్వదేశములోని వస్త్రములు, వస్త్రధారణ, ముగ్గులు, వంటలు, పండుగలు, ఉత్సవములు, పాటలు, ఆటల యందు మనము సగర్వముగా ఆనందించుటకు అనేక పరిస్థితులు అనుకూలపరచెను. ఆమెను విద్యార్థులెల్లరు ఎంతో ప్రేమతో, ఆదరముతో 'మమ్మి' (అంటే అమ్మా) యని పిలుచుచుండిరి. మన మతము, మన ఆచారములు, మన స్థితిగతులు చూచి విదేశీయులు హేళన, స్వదేశీయులు నిరసన చేయు రోజులలో ఈయమ మన మతమందు, మన దేవతలయందు, గుళ్ళయందు, తీర్థ క్షేత్రములయందు, వేదములయందు, మన సంస్కృతియందు, వేయేల, మన యందుండు ఉత్కృష్ఠ మెల్లను బహిర్గతము చేసి విద్యార్థులయందు స్వదేశాభిమానమును రెచ్చగొట్టెను. అంతట స్వదేశాభిమానము పడగలెత్తి నాట్యము చేయ నారంభించెను. ఏమి ఆశ్చర్యము! ఒక విదేశ నారి అపూర్వసేవ మన భరతమాత బడయ కలిగెను.

పూనా విశ్వవిద్యాలయమునకు 1916 లో కజిన్సు సతిని ఎన్నుకొనిరి. ఢిల్లీలోని స్త్రీల ఇర్విన్ కళాశాల ఈమె ప్రోత్సాహము వలననే స్థాపింపబడెను. ప్రస్తుతము మద్రాసున శ్రీ లేడీ వెంకట సుబ్బారావు సతి గారిచే నడిపింపబడుచున్న సేవాసదనము ముప్పది ఏండ్ల నాడు కజిన్సు సతియే స్థాపింప చేసెను. మంగుళూరు స్త్రీల పాఠశాలకు ఒక ఏడాది ప్రిన్సుపాలుగా కూడా నుండెను. మదనపల్లిలోని దివ్యజ్ఞాన కళాశాల ఆవరణములోనే 'కృష్ణా కాలేజి'లో కజిన్సు దంపతులు నివసించు చుండెడి వారు. వారి నిత్య జీవితము భారతీయ సాంప్రదాయములకు అనుగుణముగా నుండెడిది గాని, విదేశీయుల టక్కుటిక్కు లెచ్చటా గానరావయ్యెను.

విద్యార్థులతోపాటు విద్యార్థినులు కళాశాలయందలి వివిధ కార్యక్రమములయందు పాల్గొననియెడల ఆమె ఎంతయో అసంతృప్తి పడియెడిది. పురుషులతో పాటు స్త్రీలు అన్ని విషయములయందును పురోభివృద్ధి పొంద వలయునని వాంఛించెడిది. అందుచేతనే ఆమె 1917 లో శ్రీ ఇ. ఎస్, మంటేగోకు స్త్రీలకు వోటింగు హక్కు కావలెనని కోరుచూ ఒక స్త్రీల "డెప్యుటేషను"కు నాయకత్వము వహించి, భారత స్త్రీలు అసెంబ్లీలలో పురుషులతో పాటు కూర్చొనుటకు హక్కులు సంపాదించి పెట్ట కలిగెను. 1920 లో అఖిల భారత మహిళా సభను నిర్మించి దానికి కార్యదర్శినిగా వుండి వూరూరు శ్రమయ

నక తిరిగి త్రిప్పలుబడి భారత మహిళలయందు నూత్న చైతన్యము కలిగింప దొడంగెను. అప్పటికి ఆరంభించిన శ్రీ గాంధీ మహాత్ముని ప్రచారములవలనను మహిళాభ్యుదయము వేవేగ ముందంజ వేయ జొచ్చెను. 1923 లో మొట్టమొదట భారత దేశములోని స్త్రీ మేజస్ట్రేటు పదవి నలంకరించిన సోదరి కజిన్సు సతియే!

ఈమె ఎల్లప్పుడూ ఖద్దరునే ధరించుచుండెడిది. అప్పుడప్పుడు మన వలె చీరను కట్టుకొని ఆమెను చూచిన వారి నందరినీ ఆనందింప చేయుచుండెడిది. నిత్యము నిరాడంబర జీవిత విధానమే ఆమెకు సంతృప్తికరముగా నుండెను. 1932–33 లలో సహాయ నిరాకరణోద్యమములో పాల్గొని వెల్లూరు కారాగారములో ఒక సంవత్సరము గడిపెను. వొడుదుడుకులకు అలవడిన ఆమె జీవితమునకు జైలులోని ప్రశాంతత భరించరానిదిగా యుండెను. కావున అచ్చట ఒక చిన్న విప్లవము ఆరంభించెను!

ఈమె 'ఆసియాలో స్త్రీల మేలుకొలుపు','నేటి భారతీయ స్త్రీలు', 'స్త్రీల పట్ల పురుషుల ధర్మములు','తూర్పు పశ్చిమ దేశములలో సంగీతము', 'స్వీయ చరిత్ర' మొదలగు పుస్తకములు రచించెను.

కజిన్సు సతి అరవింద రవీంద్రులను త[...] గురువులు గను, గాంధీ మహాత్ముని రాజకీయ[...] సరోజిని కమలా దేవులను తన అనుంగు [...] శతసహస్ర విద్యార్థులను తన బిడ్డలగను, [...] గౌరవము తన గౌరవముగను, భారతీయుల క[...] తన కష్టసుఖములగను తలంచుచుండెడిది. ఆ[...] సంవత్సరముల నుండి పక్షవాతముచేత [...] 11-3-54 న ప్రాణమును విడచి పరలోక గత[...] తిరిగి ఏ దేశమున ఏ కార్య సాధనకు ఏ [...] బుట్టునో!

ఆమె ఆత్మకు శాంతి తథ్యము. ఆమె నిత్య[...] కోల్పోయిన డాక్టరు కజిన్సును ఎవరు ఓ[...] కాలమే ఆయన హృదయమునకు తగిలిన [...] మాన్ప కలదేమో!

తమకు ధ్రువ తారయై వెలసిన సాధ్వి [...] భారత మహిళల కృతాంజలే ఈమెయొక్క[...] నిష్కళంక సేవా ఫలము.

కాల వాహినిలో కలసిపోయినది కజిన్సు[...]

ఆంధ్ర మహిళా సభ

సంగీతపు తరగతులు

కర్ణాటక సంగీతము వీణ, గాత్రములలో లోయర్ గ్రేడ్ పరీక్షలకు శిక్షణ, ఆంధ్ర మహిళా సభ లజ్ చర్చి రోడ్డు భవనములలో, ప్రారంభింప బడినది.

శిక్షణ మాసరుసుము రూ. 5-0-0.

ప్రవేశ రుసుము రూ. 2-0-0.

ఖాదీ విక్రయము

మద్రాసు గౌర్నమెంటు రూరల్ [...] శాఖలో తయారయిన ఖద్దరు [...] ఆంధ్ర మహిళా సభ లజ్ చర్చి రో[...] లయంలో విక్రయింప బడుతున్నవి.

చీరలు, ధోవతులు, దుప్పట్లు, రవికె గుడ్డలు, ఇంకా అనేక [...] యిక్కడ దొరకును. రూపాయ అణాలు తగించి విక్రయించవలసినదిగ



ఐక్యరాజ్య సమితి అధ్యక్షురాలు, శ్రీమతి విజయలక్ష్మి

అమరజీవి

శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంత్యుత్సవము

మదరాసు నగరములో బహిరంగ సభ.

—:o:—



మదరాసు నగరము, త్యాగరాయ నగరులోని హిందీ ప్రచారసభ ఆవరణలో, శ్రీ అమరజీవి పొట్టి శ్రీరాములు గారి జయంత్యుత్సవ సందర్భములో, మంగళవారము ది- 16-3-1954, సాయంకాలము 4 గంటలకు ఒక బ్రహ్మాండమైన బహిరంగ సభ జరిగినది. ఆంధ్ర కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు సభకు అధ్యక్షత వహించిరి.

సభకు పూర్వము, అలంకరించిన చిన్న రథముపై, శ్రీ పొట్టి శ్రీరాములుగారి చిత్రపటము ఊరేగింపబడినది.

ఈ బహిరంగ సభను ఏర్పాటుచేసిన శ్రీ పొట్టి శ్రీరాములు మిషనుకు అధ్యక్షులైన శ్రీ భాగవతుల లక్ష్మీనారాయణగారు, శ్రీ శ్రీరాములుగారి స్మారక నిధి నొక దానిని నెలకొల్పవలెనని సభికులకు విన్నవించిరి.

శ్రీ శ్రీరాములుగారు చేసిన త్యాగము అమోఘమైనదని, ఆయన చేసిన ప్రాయోపవేశము ఒక ధర్మబద్ధమైన లక్ష్యముగలదనియు, అవతరించిన ఆంధ్ర రాష్ట్రము అన్నివిధములా అభివృద్ధి జెందుటకు తోడ్పడుట వలననే, ఆంధ్రులు ఆ అమరజీవిపట్ల తమకు గల ఋణమును తీర్చుకొనగలరనియు, శ్రీ గోపాలరెడ్డిగారు, శ్రీ కళా వెంకట్రావుగారు, ఇంకా పలువురు ప్రముఖులు సభలో నొక్కి చెప్పిరి.

శ్రీ ప్రయాగ నరసింహశాస్త్రిగారిచే 'పొట్టి శ్రీరాములు' బుఱ్ఱకథ వినిపింపబడినది.

ఉదయబాల

* శ్రీ చక్రవర్తి రంగస్వామి *

తలనిండ పూలతో కనుల పండువుగ
పట్టు పరికిణి కట్టి పూలచొక్కా తొడిగి
నుదుట తిలకము దిద్ది సింగారములు చేసి
చిట్టితల్లీ నీవు విచ్చేసినావా?

ఇన్నిరంగుల గులాబీలు నీకెక్కడివె
ఇన్ని చేమంతులీ సంపెంగ లెక్కడివె
ఏది పాడుమమ్మా మరల కలకలారవగీతి
అందమనగా నీది ఆనందమననీది

తలిరు మెత్తని చిన్ని పాదాలతో నడిచి
నిశ్శబ్దముగ నీవు సిగ్గు త్రోవల గుండ
చిరునవ్వు నవ్వుచూ ఈలాగె నిత్యమూ
ఆనందమయి బాల అరుదెంచవమ్మ.

హిమబిందు స్నానం చేశావా
ఒడలంత సుగంధం పూశావా
తియ్యని తేనెలు త్రాగావా
చిరుచేతులు తట్టుచు వచ్చావా.

తియ్యని పలుకుల చిలుకా రావే
కమ్మని పాటల కోకిల రావే
చక్కగ ఆడే నెమలీ రావే
పువ్వుల బంతులు ధువ్వుతు రావే

సంక్షేమ కార్యక్రమము

మాతా శిశు సంక్షేమము - కేంద్ర ప్రభుత్వ కృషి

—:o:—

దేశమంతటా మాతా శిశు సంక్షేమ శాఖల అభివృద్ధికని, కేంద్ర ప్రభుత్వమువారు తయారు చేసిన ప్రణాళికను, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతణికీకి పంపించినట్లు శ్రీమతి రాజకుమారి అమృతకౌరుగారు ప్రజా సభలో సెలవిచ్చారు. వచ్చే రెండు సంవత్సరాలలో, యీ ప్రణాళిక అమలు నిమిత్తము, కేంద్ర ప్రభుత్వము రమారమి 50 లక్షల రూపాయలు వెచ్చించడానికి సిద్ధముగా వున్నారని కూడా ఆమె తెలియబఱచినారు.

ఈ ప్రణాళికను బట్టి, కొన్ని సంక్షేమ కేంద్రాలు నెలకొల్పబడును. ఒక్కొక్క కేంద్రములో ఒక హెల్త్ విజిటర్, నల్గురు మంత్రసానులు నియమింపబడతారు - 60000 జనాభాగల ప్రదేశము ఒక కేంద్రముగా ఏర్పరుప బడుతుంది.

ఈ కేంద్రాలలో సూలింతలకు, బాలింతలకు, తగిన సలహా, వైద్య సహాయము లభించడమే కాకుండా, యిందలి మంత్రసానులు, ఇంటింటా పరిశీలించి, వారి వారి ఇండ్లలో ప్రసవ సమయములో తగిన సహాయము చేయుచుందురు.

ఒక్కొక్క కేంద్రము ప్రారంభించడానికి, అందుకు తగిన పరికరములు సిద్ధము చేయడానికి, కావలసిన ప్రారంభ ఖర్చు, సుమారు రూ. 2000/- కేంద్ర ప్రభుత్వము భరిస్తుందని, సిబ్బంధి కనుపగు వసతి, కేంద్రము నడపుటకు ఒక స్థలము, మున్నగు వానికగు ఖర్చంతా రాష్ట్ర ప్రభుత్వాలు భరించవలెనని ప్రణాళిక సూచిస్తుంది.

పైగా, ఒక్కొక్క కేంద్రము నడపుటకు, సంవత్సరమునకు రమారమి ఖర్చు 17 వేల రూపాయలనీ, వచ్చే రెండు సంవత్సరాలలో, మొదటి ఆరు మాసములు అయ్యే పూర్తి ఖర్చు, తరువాత పండ్రెండు మాసముల కగు వ్యయములో రెండు వంతులు, తరువాత ఆరు మాసముల కగు వ్యయములో సగము, కేంద్ర ప్రభుత్వము భరించ గలదని కూడా యీ ప్రణాళికలో సూచించబడినది.

అటు పైన యీ సంక్షేమ కేంద్రముల నిర్వహణ పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలే వహించవలసియుంటుందని కూడా, యీ ప్రణాళికలో సూచించబడినది.

ఆంధ్ర మహిళా సభ

మాతా శిశు సంరక్షణ శాఖ

ఈ శాఖకు సంబంధించిన ఆంధ్ర మహిళా సభ నర్సింగ్ హోమ్‌లోను, ఉచిత వైద్యశాల లోను, చికిత్స పొందుచున్నవారి సంఖ్య దినదినము, అధికమగుచున్నది. చాలా మంది బీదయువతులు ఇక్కడకు వచ్చి, ప్రసవమునకు పూర్వము, అటు తరువాత అవసరమైన చికిత్స పొందుచున్నారు.

ఇందు ప్రస్తుతము 12 మంది యువతులు, నర్సు - మంత్రసాని విద్యలో శిక్షితు లగుచున్నారు. త్వరలోనే మరి 12 గురిని యిందు శిక్షణకై జేర్చుకొను ఏర్పాట్లు జరుగుచున్నవి.

అ. చన్నఘంటమ్మ.

గూడూరు స్త్రీల గృహ పరిశ్రమల సహకార సంఘ 13-వ వార్షికోత్సవము.

పై సంఘం వారి 1 వార్షికోత్సవాన్ని శ్రీ మహాత్మాజీ ఆదివాసి హాస్టల్ ఆవరణంలో శ్రీమతి సి. వి. లక్ష్మిరెడ్డి (అఖిల భారత మహిళాసభ ఆంధ్రశాఖ, నెల్లూరు కార్యదర్శిని) అధ్యక్షతన జయప్రదంగా జరిగింది. శ్రీమతి సుశీలాదేవి గారు (లేబరు వెల్‌ఫేర్ ఆఫీసరు) పతాకారోహణము గావించిరి. సభాధ్యక్షులు శ్రీమతి సి. వి. లక్ష్మిరెడ్డిగారు స్త్రీల కుటీరపరిశ్రమలను గూర్చి మాట్లాడుతూ వీటి కొనుగోలుకు ప్రభుత్వం ఒక సంఘాన్ని నియమించాలని సూచించారు. స్త్రీల పొదుపు వుద్యమము, కుటీరపరిశ్రమలు భారతదేశము యొక్క ఆర్థిక స్థోమతకు ముఖ్యమని తెల్పారు. శ్రీమతి జి. విమలా ఎమ్. ఎ. గారు మాట్లాడుతూ మిల్లులు రాక పూర్వం దేశంలో అందరూ చేనేత బట్ట వాడుతూ వున్నారని మిల్లులు వచ్చాక చేనేత పరిశ్రమలు కుటీర పరిశ్రమలు పడిపోయాయని అందువల్ల నిరుద్యోగ సమస్య ఎక్కువైనదని, ప్రతి ఒక్కరు చేనేత బట్ట వాడి వారిని ప్రోత్సహించాలని కుటీర పరిశ్రమలను ప్రతి స్త్రీ ప్రవేశపెట్టాలని కోరారు. తరువాత రాట్నపోటీలు, మిషన్ కుట్టు, క్యారం బోర్డు, పోటీలలో గెలుపొందిన వార్కి బహుమతులను, రాష్ట్రభాష హింది పరీక్షలలో వుత్తీర్ణులైన వారికి ప్రమాణ పత్రములను పంచిపెట్టారు. కుమారి తలుపూరి రాజ్యలక్ష్మి పాటకచ్చేరి కాగానే సంఘ ప్రెసిడెంటు శ్రీమతి నక్కా రంగనాయకమ్మగారి వందన సమర్పణతో సభ ముగిసింది. సబ్ కలెక్టరుగారు, సబ్ మేజస్ట్రీటుగార్లు, వారి సతీమణులతో విచ్చేశారు. వస్తు ప్రదర్శనాన్ని చూచి సంతోషించిరి. తరచుగా యిటువంటి కుటీర వస్తు ప్రదర్శనాలను జరుపుతూ కుటీర పరిశ్రమలను అభివృద్ధిలోకి తెచ్చెదరని పుర ప్రజలు ఆశి

నక్కా

కృతజ్ఞత

శ్రీమతి యరబాక రాజేశ్వరమ్మగారు ఆంధ్ర మహిళా సభకు 100 - రూపాయలు విరాళమిచ్చి యావజ్జీవ సభ్యురాలుగా చేరిరి. వీరికి మా కృతజ్ఞత.

ఆంధ్ర మహిళా సభ.

స్త్రీ శక్తి స్వరూపిణి.

మహిళలు పూజనీయులు

* శ్రీమతి శ్రీధర జయలక్ష్మి *

పూర్వపు పద్ధతులలోను, ఇప్పటి పద్ధతులలోను, ప్రతి సామాన్యకుటుంబమునందు మామూలు నడవడికలలో అజగజాంతరం భేదములున్నవి. కావునదేశ సౌభాగ్యం పెంపొందాలంటే ప్రతి గృహములోను, ఆడపిల్లల విషయములో తలిదండ్రులు తమ శక్తికొలదీ సమస్త విద్యల యందు సంసార నిర్వహణకు కావలసిన కళలయందు ప్రవేశము కలిగించడం ముఖ్య కర్తవ్యం.

ఇప్పటికీ కొందరు పూర్వీకులు ఆడపిల్ల వీధిలోకి పోతే ముప్పు వాటిల్లునని నాలుగు గోడలమధ్య కూపస్థ మండూకము వలె అణగద్రొక్కి వుంచి, వారి భావి జీవితం నాశనం చేయడం చాలా శోచనీయం. అంతే, ప్రతి స్త్రీ గొప్ప డిగ్రీలు సంపాదించి పెద్ద ఉద్యోగములే చేయాలనికాదు.

స్త్రీ సంసారి నౌక సారవంతముగా నడపగలందులకు ... పిల్లల పోషణ చక్కగా నిర్వర్తించుటకు, తన గృహమునందు ఆరోగ్య భాగ్యము పెంపొందింప చేయుటకు, మరియూ మన దేశమునందు అన్న వస్త్రములకు గల దురవస్థను గమనించి కొద్దో గొప్పో ప్రజా సేవకురాలుగా కాగలందులకు తప్పక ప్రతి స్త్రీకి కొంత వరకు విద్య నేర్వ వలసిన ఆవశ్యకత వుంది.

స్త్రీ అంటే అర్థము చేసుకోజాలని పామరులు సామాన్యంగా 'ఆడదాని చేత ఏమవుతుందిలే' అని స్త్రీలను తృణప్రాయంగా చూస్తున్నారు. స్త్రీ శక్తి స్వరూపిణి. దేవతల దగ్గరనుండి సామాన్య ప్రజల దాకా స్త్రీలకే అగ్రస్థానం వున్నట్లు నిరూపణ చూపగలము.

సాక్షాత్తు సాంబశివుడు అర్ధనారీశ్వరుడై, మరియు గంగను శిరమునందు ధరించి వుండుటలో అర్ధమేమిటి? శ్రీరామచంద్రుడు సీతాదేవి చెంతలేని సమయమున చివరకు స్త్రీరూపముగల విగ్రహమును ప్రక్కన వుంచుకొని కూర్చోవలసిన పరిస్థితి యెందుకు కలిగినది? శ్రీకృష్ణుడు తన ఇద్దరు భార్యలను తృప్తిపరచుట కొరకై త్రాసునందు కూర్చొని తూగవలసిన గత్యంతర మేమిటి? దేవదానవుల యుద్ధమునందు అప్పుడు మోహినియే లేకపోయిన యేమై యుండవలసింది?

మరియు, ఆ కాలములోని పతివ్రతామతల్లుల ప్రభావం వ్రాయుట మొదలుపెట్టిన చాలా యున్నది. సుమతి శాపమున యేడు రాత్రులు ప్రొద్దు పొడవక గాఢాంధకారం ముంచుకొనిపోతే, పై లోకం నుండి దేవతలు దిగి వచ్చి ఆ సతిని పరీక్షించవలసి వచ్చినది! అనసూయ త్రిమూర్తులను అడ్డాలలో బిడ్డలుగా చేసి బుజ్జగించింది.

ఆ యుగముల మాట అటుండగా, ఈ కలియుగములో యెంతమంది వీరమాతలు చిరస్థాయిగా కీర్తి నిలుపుకోగలిగారో, మనము రోజూ పాఠశాలలలో పిల్లలకు కూడా పాఠముల మూలంగా విశదపరుస్తున్నాము. ఝాన్సీలక్ష్మీబాయి, మల్లమాంబ, రాణీపద్మిని, ఇటు వంటివారు భారత దేశమున వేల కొలది స్త్రీలు వెలిగించిన జ్యోతి ఇప్పటి వరకు నిత్య జ్యోతిగా వెలుగుచునే యున్నది.

మరియూ ఆదినుండీ, మహారుషులు, రాజులు, సామాన్య గృహస్థులు ప్రక్కన భార్య లేనిదే యెలాటి శుభ కార్యములను చేయుటకు శాస్త్రరీత్యా అనర్హులని యెరుగుదుము. పురుషులే సర్వస్వతంత్రులైనప్పుడు ప్రతి విషయమునందు స్త్రీ తోడ్పాటు యెందుకొరకు నియమించిరి?

సర్వ సాధారణముగా తల్లి పోయిన బిడ్డలను చూస్తే ప్రతివారున్నూ పాపం తల్లి లేని బిడ్డలంటూ జాలి జూపుదురు, తండ్రి ఎంత ధనికుడు, పెద్దవాడైనా సరే.

'సంసారమే స్వర్గసీమ' అనునట్లు యే మనుష్యుడు అయినా సుశీల యగు భార్య లేనిదే సంపూర్ణమైన యిహ సుఖము పొందజాలడు. గృహమునకు శోభ గృహలక్ష్మియే. తల్లి ప్రేమకున్న మహిమ తండ్రి ప్రేమనందు ఎటు వంటి సందర్భములోనూ సరితూగుటలేదు.

వెయ్యి చెప్పనేల, భారతమాతకు జై అనిన్నీ వందే మాతరం అనిన్నీ ప్రతినోట జయజయా ధ్వానములు సల్పినట్లు, పొరబాటునైనా పితృ భూమికి జై అని గాని వందే పితరం అనిగాని పలుకులు యెక్కడా వినిపించవు. గనుకనే తప్పక స్త్రీలు పూజనీయులని, శక్తి సంపన్నులని, మనము విశ్వసిస్తూ, వారి బాధ్యతలు నిర్వహించుటకు అన్ని విధములా అవకాశమీయడం అత్యంతావశ్యకము.

సంస్కృత భాషా కవయిత్రులు—

గంగాదేవి

—శ్రీమతి కాంచనపల్లి కనకాంబ.

పూర్వకాలమున మన తెలుగు కవయిత్రుల కంటె సంస్కృత కవయిత్రులె చాలమంది యున్నట్లు తెలియుచున్నది. అన్ని శాస్త్రములు ఆభాషలో నుండుట చేతను, అన్ని దేశములవారు అన్ని భాషలవారు కూడ సంస్కృతము విధిగా నేర్చియుండుట చేతను, దాని కట్టి పూజ్యత అవసరము కలిగియుండెడిది. "తల్లి సంస్కృతం బదెల్ల భాషలకు" అన్నాడుగదా కేతన. ఆంధ్రమునందనర్గళముగ కవిత్వము చెప్పనేర్చినను సంస్కృతమురానిదే యాంధ్రమునకు విలువ యుండెడిదికాదు. పండితులన్నను, కవులన్నను ఉభయభాషలలోనైననే గణన. ప్రాచీన కాలమునుండి ఉపనిషత్తులందు సైతము గొప్ప విద్యావతులు గార్గి, మైత్రేయి, మొదలగువారు ప్రసిద్ధిగన్నారు. ఇక పురాణయుగము, కావ్యయుగము సంగతి వేరే చెప్పవలెనా? కావ్యయుగములోనిదే మన గంగాదేవి. 10వ శతాబ్దములో రాజశేఖరకవి తన రచనలలో ఇందులేఖ, కుంతీదేవి, గౌరిక, ప్రకాశదత్త, మౌరిక ప్రభుదేవి మొదలగు కవయిత్రీమణుల నెందఱనో యుదహరించినాడు.

తరువాత కొన్నివందల సంవత్సరములకు గంగాదేవి సంస్కృతభాషా కవయిత్రులలో ప్రసిద్ధిగన్న రాజరమణీమణి. క్రీ. శ 1367 లో కాంచీపురము నేలిన వీరకంపరాయని భార్య. ఈ విదుషి తనభర్తయైన వీరకంపరాయల పరాక్రమము జాటు జైత్రయాత్ర రచించి తన కావ్యమునకు 'మధురావిజయ' మనుపేరిడెను. విజయనగరరాజుల చరిత్ర అంధకారబంధురముగనున్న సమయమున కొన్నివిషయములు తెలిసికొనుటకీగ్రంథము తోడ్పడు చున్నది. ఈ కృతినాయకుడు హరిహరరాయల సోదరుడైన బుక్కరాయని జ్యేష్ఠ కుమారుడు వీరకంపన. మధురపై వీరకంపనుడు దండెత్తి విజయము నొందుటయే మధురావిజయ కావ్యము నందలి యితివృత్తము. శైలి సరళము. మృదుమధురము. మహాకావ్యలక్షణము లన్నింటిని పాటించినది. ఇందలి యుపమానములు ఋతు వర్ణాదికములు మనోహరములు. ఇష్టదేవతా ప్రార్థనము క్రమముగా గణపతి, పార్వతీపరమేశ్వరులు, సరస్వతి, క్రియాశక్తి. గురువులకు నమస్కారము. పూర్వ కవి స్మరణమున కాళిదాసు నిట్లు చక్కగ వర్ణించినది.

శ్లో॥ దాసతాం కాళిదాసస్య కవయః కే నబిభ్రతి
ఇదానీ మపిత స్యార్థా ముపజీవం త్యమీయతః॥

వాల్మీకి, వ్యాస, కాళిదాస, బాణ, భారవి, దండి, భవభూతి, కర్ణామృతకవి, తిక్కయ్య, అగస్త్య, గంగాధర, విశ్వనాధులను వర్ణించెను. ఈ తుదికవి విశ్వనాధకవియే యీమెకు విద్యాగురువై యుండును.

శ్లో॥ చిరం సవిజయీ భూయాత్ విశ్వనాధకవీశ్వరః
యస్య ప్రసాదాత్ సార్వజ్ఞం సముద్వేమాదృశీష్వపి॥
1 వ సర్గ 16 వ శ్లో.

తనవంటివారికి సర్వజ్ఞత్వము అతని యనుగ్రహమున గలిగెనని పేర్కొన్నది. కథారంభమున బుక్కభూపాలుని అతని దేవేరి తేపాయిని వర్ణించినది. రాజు మూర్తీభవించిన ధర్మదేవత యని యతని ధీరోదాత్త లక్షణములు ప్రశంసించి విద్యానగరపరిపాలనా విధానమును వర్ణించినది. ద్వితీయ సర్గయందు దేపాయి గర్భము దాల్చుట దౌహృదీ లక్షణములు వర్ణింప బడినవి. తేపాయి తుంగభద్రా తీరమున నున్నను తామ్రపర్ణియందు స్నానమాడ గోరినదట. గర్భస్థశిశువు తురుష్కులను జయింప మధురకేగు సూచనలు కాబోలును.

"సుదతి సవిధగతయు సులభావగాహయౌ
తుంగభద్రమెచ్చుత్రోవబోక
తలచెనాత్మ సైన్య దంతురితమౌ
తామ్ర పర్ణిలోన తానమాడ॥

తేపాయి కంపనుడను కుమారుని గనెనట. సంగ్రామ రంగంబున శత్రువులను గంపింప జేయువాడని. తండ్రి కుమారునికి వీరకంపరాయడను నామకరణ మొనర్చెను.

తృతీయ సర్గమున కంపనుని విద్యాభ్యాసము, యౌవనము వర్ణింపబడినది. బుక్కరాజు కంపనునకు నంద్యరాజు కన్యయగు గంగాదేవి నిచ్చి వివాహము గావించెను. ఆ నూత్నదంపతులు లక్ష్మీనారాయణులవలె, పార్వతీపర

మేశ్వరులవలె, శచీపురందరులవలె నలరారు చుండిరి. బుక్కభూపాలుడు కుమారునొకమారు బిలిచి యైశ్వర్య యౌవనమదముల గూర్చి చక్కగ నుపదేశించెను. ఈ గురూపదేశము బాణభట్టు శుకనాసోపదేశమునకు సంగ్రహ ప్రతిబింబమువలె నున్నది. ఇందులకుదాహరణము-

శ్లో॥ గురూపదేశః కిల కథ్యతే బుధైః
అకర్కశం కించ నరత్నకుండలమ్
అమేచకం నూతన మంజనం సతా
మజాతగాత్ర క్షయ మద్భుతం తపః॥

గీ॥ గురుని యుపదేశమును జెప్పుదురు విబుధులు
రత్నకుండలమొండు కర్కశ మటంచు
నైల్యమెఱుగని నూత్నాంజనం బటంచు
తాప మొడలికి నిడని సత్తప మటంచు॥

తరువాత తుండీర మండలాధిపతి చంపరాయని మదమడచి కాంచీమండలము నాక్రమించి, క్రమముగా వన్య భూపాలురనడచి, మధురాప్రాంతముల తురుష్కులను జయింప వలెనని శ్రీరాముడు రాక్షస సంహార మ్మొనర్చినట్లు దుష్టులను శిక్షింప దక్షిణదేశముపై దండయాత్ర నడుపుమని యుపదేశించెను. కంపనుడు జైత్ర యాత్రకు కృతనిశ్చయుడయ్యెను.

చతుర్థ సర్గమున కంపనుని జైత్రయాత్రా ప్రస్థానము వర్ణింపబడినది. చోళ, కేరళ, పాండ్య భూపతులు, వేత్ర త్వమూని ముందునడువ కంపనుడు క్రమముగా కర్ణాటము నతిక్రమించి కంటక కాననము దాటి పోయి చంపరాయనితోకి ఘోరయుద్ధమొనర్చెను. కోటను ముట్టడించుట ద్వంద్వ యుద్ధము మొదలగువాని నీమె కన్నుల గట్టినట్లు వర్ణించెను. చంపరాయని యమపురి కంపి తుండీర మండలము స్వాధీనము చేసికొనెను.

పంచమ సర్గమున కంపనుడు దుష్ట నిగ్రహమునకై జన్మించిన మహా విష్ణువని భావించి మగధ, మాళవ, సింహళ, ద్రవిడ కేరళ రాజులాతని కొలిచిరి. రాజు రాజపత్నులతో వన విహారము, జలక్రీడ గావించెను. ఋతు వర్ణనము లిందు గలవు.

ఆరవ సర్గమున గూడ ఉత్సవాలతో రాజు వినోదించును. సప్తమ సర్గమున రాజు కోరికపై గంగాదేవి చంద్రోదయమును వర్ణించును. ఆమె వర్ణనలు చాల మనోహరములు. చంద్రుడు రక్తుడై పద్మినిని స్పృశించె గాని పద్మిని యతనియెడ విముఖురాలాయెను.

ఆ భావమిది.

"కరముల మాటి మాటికటుగా నిటుగా నొగిజొచ్చుచున్సుధా
కరుడతిరాగియై నళినికై వెడసేతలు చేసెగాని య
ప్పరమ పతివ్రతామణియు వానికి లోబడదయ్యె నద్దిరా!
తరుణుల సత్యమిట్టిదియ తప్పొనరించిన మంచి చేసినన్"

ఆమె కవిత్వముదాత్తమై భావములు కలది. తరువాత మధురా విజయమున కొంత గ్రంథపాత మున్నది. ఇట్టి చారిత్రాత్మకమైన కావ్యములు బహు స్వల్పములు. శ్రీకృష్ణ రాయలు రాజై కవి యగుట రాజ ధర్మములు, జైత్ర యాత్రలు, సమయాను సారముగ వర్ణించినట్లు ఈ కవిరాజ్ఞి తన కావ్యమును రచించినది.

అష్టమ సర్గమున శ్రీరంగ మధురాది క్షేత్రములెట్లు నాశన మొనరింపబడినవో కన్నుల గట్టినట్లు రసవంతముగ వర్ణించినది. ఒకానొక దివ్య యువతి కంప రాయనికి స్వప్నమున గోచరించి దివ్య ఖడ్గము నొకదానిని గూర్చి నుడువుచు, దానిని పూర్వము విశ్వకర్మ పినాకపాణికి రాక్షస సంహారార్థ మిచ్చెననియు, పాండ్యరాజు తపః ప్రభావమున నద్దానిని శివుని వలన బడసెననియు, ప్రకృతము పాండ్యులు నిర్వీర్యులగుటచే అగస్త్య మహర్షి యామె ద్వారమున కంపనుని కనిపె ననియు, కృష్ణుడు కంసవధ గావించినట్లు, ఆ ఖడ్గమును బూని యవనాధిపతిని మధురలో సంహరింపుమని హెచ్చరించినట్లు వర్ణింపబడినది. తరువాత కంపనుని మధురా విజయమును గూర్చి కొన్ని శ్లోకములు గలవు. కంపరాయ తురుష్కుల యుద్ధ వర్ణనము విశేషముగా గలదు. కంపనుడు తురుష్కుల నోడించి మధురను జయించును. గంగాదేవి యిట్టి సరస కవిత నల్లి కవి రంజకముగా నీ గ్రంథమును సాగించి కవి లోకమందు కీర్తి గాంచినది. ఈమెకు సద్గుణములందు వలెనే సౌందర్యమునందును మిక్కిలి మక్కువకలదు.

శ్లో॥ నిర్దోషాప్యగుణావాణీ నవిద్వజ్జనరంజనీ
పతివ్రతాప్య రూపాస్త్రీ పరిణేత్రే నరోచతే॥

దోష రహితమైనను గుణములు లేని కావ్యము పండితులకు సంతోషము కలుగ జేయదు. పతివ్రత యైనను రూపసంపద లేని స్త్రీ భర్తకు రుచింపదు కదా! అన్నది యొక చోట. విజయనగర మందలి కథ యగుటచే గంగాదేవి యాంధ్రమునందు గూడ పాండిత్యము, కవిత్వ శక్తి కలిగియుండి యుండవలెను—

—విజయవాడ రేడియోవారి సౌజన్యముతో

రాష్ట్ర పునర్నిర్మాణ కమిషన్

———: ౦ :———

భారత రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సమస్యపై, సంపూర్ణమైన విచారణ జరగడానికి ఫజల్ ఆలీ అధ్యక్షతన ఒక సంఘం నియామకమైంది. ప్రభుత్వము తమకు అప్పగించిన కార్యమును త్వరితగతిని నిర్వర్తించుటకు ఈ సంఘ సభ్యులు తగుమైన విధమునుగూర్చి బాగుగా ఆలోచించిరి. అందు మొదట వారు ప్రశ్నలను ప్రకటించి వాటికి ప్రజల ప్రత్యుత్తరములను సేకరించుట అనవసరమనితలచి ఆపద్ధతిని విరమించుకొనుటకు నిశ్చయించికొనిరి. రాష్ట్రపునర్నిర్మాణ సమస్యయందు ఆసక్తిగల ప్రజలు, ప్రజాసంస్థలు కమిషన్ వారికి ఉపయుక్తమని భావించిన విషయాలముపై తమ అభిప్రాయములను, సలహాలను లిఖితపూర్వకమైన విజ్ఞప్తుల ద్వారా సమర్పింపవలసినదిగా కమిషన్ వారు కోరుచున్నారు. నిర్మాణాత్మకమైన సూచనలు ఏమైనా చేసే విషయంలో వాటిని రూఢిపరచుటకు చరిత్రనుండిన్ని లెక్కల రూపంగాను అవసరమైన వివరములను తెలియజేయవలెను, క్రొత్తగా ఒక రాష్ట్రమునుగాని రాష్ట్రములనుగాని ఏర్పరచవలసినదిగా కోరుసందర్భములో ఆయాసందర్భమును బట్టి వీలైనయెడల మ్యాపులను ఒకటో అంతకుమించో పంపవలెను.

ఇండియా ప్రభుత్వమువారి 1953 వ సం॥ డిసెంబరు 29 వ తేదిగల తీర్మానముచుబట్టి రాష్ట్ర పునర్నిర్మాణ కమీషన్ నియమింపబడిన విషయము తెలిసియేయున్నది. రాష్ట్ర పునర్నిర్మాణ విషయములో కమీషన్ వారు దిగువ చెప్పియుండు విషయములను గమనికలో ఉంచుకొనవలసినదిగా ఆ తీర్మానములో పొందుపరచబడి యున్నది.

"ఒక ప్రదేశముయొక్క భాష, సంస్కృతి ఆ ప్రదేశమందలి ప్రజల సర్వసాధారణ జీవన విధానమును తెలియజేయును. అందుచే అవి ప్ర[illegible]నుటకు సందేహము లేదు. అయితే రాష్ట్రమును పునర్నిర్మాణము చేయుటలో ముఖ్యమైన ఇతర విషయముల్ని కూడ గమనించవలసియున్నది. వీటిలో ఇండియాకు ఐక్యత రక్షణ, బలముచేకూర్చు ఇండియాయొక్క భద్రతను కాపాడుట ప్రప్రథమమైనవి. ఇది ఎంత ముఖ్యమో ఆర్థికసంబంధమైన, పరిపాలనాసంబంధమైన విషయములు కూడ కేవలము ఒకొక్క రాజ్యము సందర్భములో కాకుండా దేశమంతటి విషయములోను అంత ముఖ్యమైనది. ఆర్థిక, సాంస్కృతిక [illegible]భివృద్ధి కొరకై ఇండియా దేశము సక్రమమైన పథకమును ప్రవేశపెట్టినది. అట్టి జాతీయ పథకమును జయప్రదముగా నిర్వహించుటలో అడ్డుతగులు మార్పులు దేశ క్షేమమునకు [illegible]"

ఈ విషయములను దృష్టియందుంచుకొని ప్రజలు విజ్ఞప్తులను తయారు చేయవలసినదిగా కమిషన్ వారి మనవి.

కమిషన్ వారు నిర్వహించవలసిన బాధ్యత గురుతరమైనది. దీనిని నిర్వహించుటలో ప్రజలువారితో హృదయపూర్వకముగా సహకరించవలసినదని కోరుచున్నారు. [illegible] అంతే కాకుండా పత్రికాముఖమున పంపు, ఈ విన్నపమును ఆదరించి తమకు తోడ్పడవలసినదిగా కోరుచున్నారు.

విజ్ఞప్తులు పంపదలచినవారు ఆరేసిప్రతులు [illegible]యారు చేసి ఈక్రింద చెప్పిన చిరునామాకు, 1954 వ [illegible] ఏప్రిలు 24 వ తేది లోగా అందునట్లు పంపవలెను.

రాష్ట్ర పునర్ని[illegible]షన్
కార్యదర్శి, న్యూఢి[illegible]

ఉత్ప్రేక్ష

"శ్రీరామ – శ్రీనాథ"

" .... — ఒక్కమాట — ....

శిశు పోషణ కూడా ఒక కళ. మనవాళ్ళు అందులో ముఖ్యంగా గృహిణులు ఈ కళా నిర్వహణలో తమ బాధ్యత గుర్తించకపోవుట చాల విషాదకరమైన విషయం. ఈ పరిస్థితులలో గృహ యజమానులుకూడ తగిన శ్రద్ధ, సహకారము చూపక పోవుట శోచనీయం. శాస్త్రజ్ఞానం లేని మాతృప్రేమ విషతుల్యమని, వ్యక్తుల మానసిక వికాసానికి సంరక్షణే కాకుండా వాతావరణం కూడా ప్రధాన పాత్ర వహిస్తుందని గుర్తించాలి. నేను ఆవుద్దేశంతోనే........" పేజీ తిరగేసేడు శ్రీపతి.

"ఏమండీ! ... మిమ్మల్ని కానట్టు వినిపించు కోరేమిటండీ .... ఎంతసేపూ చిన్నపిల్లాగ కథలు చదువుతూ కూర్చోక పోతే చంటివాణ్ణి తియ్యకూడదూ ...." వంటింట్లోంచి వచ్చిన కేకకి త్రుళ్ళిపడ్డాడు శ్రీపతి. చదువు నాపి సంసారంలో కొచ్చాడు.

"ఎవరి పిల్లల్ని చూసినా ముచ్చటేస్తుంది .... నేనెంత తెస్తే యేం లాభం? .... ఇంట్లో సుఖంలేని తర్వాత" యథా ప్రకారం చీదరించుకున్నాడు.

"…. పోనీలెండి. మీకు ఈ ముగ్గురు పిల్లలూ, నేనే కదా బరువై పోయాం" అంటూ చంటి పిల్లణ్ణి చరిచి కంట తడి పెట్టింది విమల. మరి తిరుగులేదు ఆ ప్రయోగానికి—

"ఏమైనా అంటేసరి - పిల్లల్ని బాదడం చేతనవును. మనిషికి స్వతహాగా నైనా పుట్టాలి, చూసైనా నేర్చుకోవాలి. నేనెంత చెప్పినా యేం ప్రయోజనం? .... డాక్టరుగారి పిల్లల్నిచూడు. అన్నింటిలోనూ ఫస్టుమార్కులే. గంటకు నూరు పేజీలకి తక్కువ చదవరు. సంరక్షణంటే—"

"చాల్లెండి డాక్టరుగారి బడాయి మీరే చెప్పాలి .... ఎంతసేపూ మన పిల్లల్ని దుయ్యబట్టక పోతే చేతనైన సంరక్షణ చెయ్య కూడదూ ...." అని దెప్పి పొడిచింది విమల. తమాయించు కోలేక పోయేడు శ్రీపతి. ఆఫీసు గదిలోకి నిష్క్రమించేడు.

విమల డాక్టరుగారింటి కెళ్ళింది. నిజం తెలుసుకుంది. వాళ్ళ పిల్లల్ని చూస్తున్నంతసేపూ శ్రీపతి చెప్పిన మాటలే ప్రతిధ్వనించేయ్. 'తన పిల్లలు కూడా ఆలా ఎప్పుడుంటారు?' .... అనుకుంది.

"…. మీ అన్నయ్య ఎప్పుడూ మీ పిల్లల గురించే చెపుతారండీ" అంది. అదో మాదిరిగా విమల.

"మీ పిల్లలకి కూడా తగిన సంరక్షణ వుంటే దొరల పిల్లల్లాగుంటారు .... వీణ్ణిచూసేరా? శేతివాడు" అంటూ పిల్లణ్ణి అందించింది కాంతమ్మ.

'వాళ్ళ చేతిలో మందులుంటాయి కాబట్టి చంటి పిల్లడైనా చక్కగా వుంటాడు' అని మనసులో అనుకుంది విమల. "మా పిల్లల్ని కూడా మీ యింటికే పంపించేస్తా వదిన గారూ—"

"ఈ మాత్రానికి పిల్లల్ని పంపడం దేనికి? సరియైన మందులూ అవీ యిప్పిస్తే మీ పిల్లలూ పనస పండులా వుంటారు...." అని సమాధాన పరచింది కాంతమ్మ.

"ఆ మందులేవో నాకేం తెలుస్తుంది? ... మగాళ్ళకుండాలిగాని ఆబుద్ధి .... మీ అన్నయ్య బొత్తిగా చూడ్డం మానేసారు"

"ఈ భాగ్యానికి మగాళ్ళుకూడా దేనికి? మనమే సరిపుచ్చుకోవాలి" అని ఒక మందుసీసా నందిస్తూ "ఇది మీపెద్దవాడికి రోజూ వుదయం ఒక చెమ్చాడు యిస్తూ వుండండి బలం చేస్తుంది. మీ చంటివాడికి ఏపాలు పడతాయి...."

"ఏదో ఆవుపాలు వాడిక పెట్టేం లెండి" అంటూ సీసా నందుకుంది విమల.

"మీ తెలివికాని. - యిప్పుడు నిజమైన ఆవుపాలు ఎవరిస్తున్నారు? గేదెపాలో, పిండిపాలో తప్ప ... మావాడికి మాత్రం యీపాలు పడుతున్నా" అని ఒక మెరుస్తున్న డబ్బా చూపించింది కాంతమ్మ.

"మీ అన్నయ్య గార్కి ఏం చెప్పినా మందమతే.... వీధిలో వస్తువ యింట్లోకి రాదు" అంది విమల. డబ్బా వైపు చూస్తూ.

"ఇప్పటి మగాళ్ళందరూ యింతే లెద్దూరూ .... నే తెప్పిస్తాలెండి రేపు రెండు డబ్బాలు"

"ఏదో మీరుండబట్టి సరిపెట్టేరు. ఈ సీసాకి డబ్బాలకి రేపు సొమ్ము పంపిస్తా"

"నాకాభయంలేదండోయ్"అని అందుకుంది కాంతమ్మ.

* * *

"ప్రతినెలా సరిపోతున్న జీతం రెండు నెలల్నుంచీ ఎందుకు చాలడంలేదు" అంటూ ఆఫీసు రూమ్ విడిచేడు శ్రీపతి.

"నేనేం దాచుకోవడం లేదు! అప్పులవాళ్ళ చేత మాట నాకు సరదా అనుకున్నారేంటి?" ఏమూల నుంచో ఎదురు జవాబు.

"'మీలో,' 'ఓవల్టీన్,' 'కూటికూరా'—ఏమిటీ వేషం? ఎక్కడవివన్నీ??...." వంటగది పరిసరాల్లో శ్రీపతి కేక. నాలుగు డబ్బాలు తిరగ్గబడ్డ చప్పుడు.

".... అవన్నీ మీరెందుకు తీస్తారు?...." బిరుసైన పశ్న.

"అడిగే దానికి మొదట జవాబు చెప్పు .... ఇవన్నీ ఎక్కణ్ణుంచి వచ్చేయ్?...."

"బాగుంది వరుస .... మీరు తేకపోవడం సరికదా, నమ్మకస్థుల చేత తెప్పించుకోడం కూడా పొరపాటే నన్న మాట .... వాళ్ళ కాంతాన్ని ఈలాగే చూస్తున్నారా?"

"ఏదైనా మాటంటే ఏడవడం తెలుసు .... కొంపతీసి ఆ కాంతం అంటకడుతూందేమిటివన్నీ........"

"ఇంకానయం!.... ఆవిడ కాబట్టి వెనకా ముందూ సర్దు కుంటూంది"

"ఏడిశావ్!.... వాళ్ళ తమ్ముడి కొట్లో పాతసరుకు మరో పావలా యిచ్చి మనింట్లో చేరేస్తున్నావ్"


"మీ రెప్పుడూ కాంతమ్మని చూసి నేర్చుకోమని చెప్తూండేవారు........"

"బాగా నేర్చుకున్నావులే యింకచాలు"

"కాంతమ్మగోరు సబ్బులు, మందులు తెప్పించేరట రమ్మంటున్నారు...." అని బంట్రోతు ప్రవేశించేడు.

"తెప్పించేరా!.... అవి ఏశతాబ్దానివో అడగరా వూ! వేగం నడిపించు...." చెయ్యి విసిరేడు శ్రీపతి.

★







నీలి తిమింగిలం ప్రపంచంలో మిక్కిలి పెద్ద జంతువు. దీని పొడుగు 100 అడుగులకు పైగా వుండును. ఇది ఒక సస్తనజాతి జంతువు. చేప మాత్రం కాదు. ఈ పెద్ద జంతువు తరుచుగా ఉత్తర అట్లాంటిక్‌లో ఉండును.

1953 సం॥రానికి 49 దేశాలు 93,000,000 డాలర్ల వరకు 'యునైటెడ్ నేషన్సు హ్యూమానిటేరియన్ ప్రోగ్రామ్సు'కు ఖర్చు పెట్టడానికి నిశ్చయించేరు. కాని సోవియట్ బ్లాకు మాత్రము ఈ వినతిని లక్ష్య పెట్టలేదు.

ఐరోపా అడివి పందిని దాని దంతంతోనే చంపవచ్చు. దీని పైదంతం క్రిందదంతంతో రాసుకోవడంవల్ల ఎప్పుడూ అరిగిపోయి వుంటుంది. అడుగు దంతం ఒకవేళ విరిగిపోయినట్లయితే పైదంతం పుర్రిలోనుండి పైకి వచ్చేటంతగా వంకర తిరిగి పెరిగిపోతుంది!

శాశ్వత క్యాలెండరు

[ఏ తేదీకైనా వారము దెలుసు కొనుట]

• శ్రీ పోలాకి శ్రీనివాసరావు. •

గణింప వలసిన సంవత్సర సంఖ్య, ఆ సంవత్సరము నాటికి గడచిన లీపు సంవత్సరముల సంఖ్య, ఆ సంవత్సరములో గడచిన దినముల సంఖ్య మొత్తమును జేసి ఏడుచే భాగింపగా మిగిలిన సంఖ్యను 1 ఆదివారము, 2 సోమవారము, 3 మంగళవారము, 4 బుధవారము, 5 గురువారము, 6 శుక్రవారము, 7 శనివారము అని లెక్కింప వలెను.

ఉ దా హ ర ణ

1952 సం॥రం మేనెల 23 తేదీ ఏవారము?

గణింప వలసిన సం॥ర సంఖ్య 1952

గడచిన లీపు సం॥రముల సంఖ్య 487

గడచిన దినముల సంఖ్య.

జనవరి – ఫిబ్రవరి – మార్చి – ఏప్రిల్ – మే. } 143

31 + 29 + 31 + 30 + 22

మొత్తము 7) 2582 (368

7చే భాగింపుము. 21

482

42

62

56

శేషము. 6

శేషము 6 గనుక ఆదివారము నుండి లెక్కింపగా శుక్రవార మగుచున్నది.

1954 సం॥రం ఏప్రిల్ నెల 4 తేదీ ఏవారము?

గణింప వలసిన సం॥ర సంఖ్య 1954

గడచిన లీపు సం॥రముల సంఖ్య 488

గడచిన దినముల సంఖ్య.

జనవరి – ఫిబ్రవరి – మార్చి – ఏప్రిల్ }

31 + 28 + 31 + 3

మొత్తము 7) 2535 (362

7చే భాగింపుము. 21

435

42


15

14

శేషము. 1

శేషము 1 గనుక ఆదివార మగుచున్నది.

ఇట్లే ఏ సం॥రము, ఏ నెల, ఏ తారీఖునైన లెక్కింప వచ్చును.



మూలం: ద్విజేంద్రలాల్ రాయి.   అనువాదం: శ్రీమతి మాణిక్యవల్లి.

(గత సంచిక తరువాయి)

నాలుగవ రంగం

స్థలం: మేవాడ్ మహబత్ ఖా డేరా. సమయం: సాయంత్రం.

(డేరా వెలుపలి ప్రదేశం. పర్వతాలకు బంగారు పోత పోస్తున్న అస్తమయ సూర్యుని తిలకిస్తున్న మహబత్ ఖా)

మహ: సూర్యాస్తమయింది. ఇంక పోదాం.

(గజసింహుడు వస్తాడు)

గజ: ఖా సాహెబ్!

మ: రండి! రండి!

గ: జయించారుకదా, ఉదయపుర ప్రవేశం చెయ్యలేదేం?

మ: అది నేరమా?

గ: అబ్బే! పూరికే అడుగుతున్నాను. ఖా సాహెబ్, యీమాటు మేవాడ్ స్త్రీలు కూడ అస్త్రాలు పట్టేరట!— స్త్రీలు!

మ: ఆఁ! నిజమే?

గ: మీతో అబద్ధమాడతానా? ఈ సారి రణరంగం రమణీయంగా వుంటుంది!

మ: సాటి రసపుత్ర స్త్రీలను గురించి ఆవిధంగా మాట్లాడడానికి నోరెలా వచ్చింది? మీరు స్వచ్ఛమైన రసపుత్రులే! కాదు—

గ: ఖా సాహెబ్!—

మ: చాలు చాలు! వెళ్ళండి! మీ శౌర్యం దాచి అట్టే పెట్టుకోండి యెప్పటికైనా అవసరమొస్తుంది.

(గజసింహుడు వెడతాడు)

మ: హుఁ! ఇలాంటి అయోగ్యుల చేతిలో వుంది హిందూ ధర్మ పతాక! ఈ హిందువులు తమ దేశాన్ని వీడి పోవడమే కాదు; మనుష్యత్వాన్ని సైతం విడిచేశారు!

(ఒక సిపాయి వస్తాడు)

మ: ఏమిటి వార్తలు?

సై: షాహజాదా సైనికులతో వచ్చారు ప్రభూ!

మ: వచ్చేశారా? సరే వెళ్ళు. (సిపాయి వెడతాడు)

మ: క్రొత్త సేన అవసరమేముంది? మొగలు సైన్యంతో ఉదయపురంలో చొరబడ్డం యిష్టంలేక మానేశాను కాని సైన్యం లేకకాదు! సరే యిప్పుడాపని షాహజాదా... మొగలుండు... స్వయంగా చేసుకుంటాడు.

(గోవింద సింహుడు వస్తాడు)

మ: తమ రెవరు?

గో: మేవాడ్ సర్దారును!

మ: తమరొచ్చిన పని?

మేవాడ్ పతనం

గో: చెబుతా, కాస్త వూపిరి తీసుకుని !

మ: మీరాణా సంధిరాయబార మంపారా?

గో: సంధి కంటె చావు మేలు !

మ: మరి తమరొచ్చిన పని?

గో: ఈ లోకంతో నా కేం పని? నే పోవాలి. వీరస్వర్గం చేరగోవాలి. కయ్యానికీ, వియ్యానికీ సమానులు కావాలి. అందుకోసం నిన్ను వెతుక్కుంటూ వచ్చాను.

మ: (ఆశ్చర్యంతో తనలో తాను) మతి భ్రమణం కాదు కదా !

గో: కాదు ! మహబత్, మతిభ్రమణం కాదు! (తీవ్ర స్వరంతో) ద్వంద యుద్ధంలో నిన్ను కడతేర్చడాని కొచ్చాను. తెలుసా... హా! ఈశ్వరా! నన్ను నే మరచిపోతున్నాను! ఈ పండు టాకుకి జవసత్వా లెక్కడివి? పరవా లేదు, రా, మహాబత్. నిన్ను చంప లేను. కాని నే చనిపోగల్ను. నీ చేతిమీదుగా పోవాలి రా !

మ: ఏమి, వింత కోరిక !

గో: వింతేముంది? నా జీవితమే సమరం. స్వర్గీయ ప్రతాప సింహుని కొలువులో వుండి అనేక యుద్ధాలు చేశాను. నా కాయంపైగల గాయపు మచ్చలకు అంతులేదు. అంతిమ గాయం నీ కత్తి చెయ్యాలి !

మ: అందువల్ల మీకు కలిగే ప్రయోజనం?

గో: ఏముంది ! నువ్వు జన్మచే హిందువుడవు; విశేషించి రాణా ప్రతాపుని సోదర పుత్రుడవు. నీ చేతుల్లో చావడం కాస్త గౌరవ ప్రదం !

మ: తమరు సాలుంబర్ ఠాకూర్ గోవిందసింహజీయా !

గో: ఆఁ! ఆఁ! ఆఁ! గుర్తించావా, మహాబత్ ఖా? ఇప్పుడు తెలిసిందా నా కోరికకి కారణం? ఇదుగో, నువ్వు మేవాడ్‌ను జయించావు; అంతేకాదు ధ్వంసం చేశావు. కాని నిన్ను ఉదయపుర దుర్గంలో అడుగిడనివ్వను. నేను మేవాడ్ చివరి యోధుణ్ణి! నా గొంతులో ఊపిరున్నంత వరకూ రాజధానిని తేరి చూడలేవు, ఆత్మరక్షణ చేసుకో ! (కత్తి ఝుళిపిస్తాడు)

మ: కాని, వీరవర్యా ! నేనా రాజధానిని ప్రవేశించ దలచలేదు !

గో: నీ యిచ్ఛానిచ్ఛలతో నాకు పనిలేదు ! తియ్ అస్త్రం, తియ్ !

మ: తొందర—

గో: ఆహాఁ! ఇంకేం చెప్పొద్దు. నా గుండెలు మండిపో తున్నాయి. నా కొడుకూ, కూతురూ, లేని ప్రపంచం నాకక్కర్లేదు. అదీగాక మేవాడ్ భూమి మొగలుల పాదదళితం కావడం చూసి సహించలేను. నువ్వు జయించి యిచ్చిన నా జన్మభూమిని వాళ్లు మెట్టక ముందే కన్ను మూయ్యాలి. మహాబత్ ఖా! అల్లుడవయ్యా నా కడుపున చిచ్చు పెట్టావు; నా దేశీయుడవయ్యా పరులకు దాసుడ వయ్యావు; మా మతస్థుడవయి పుట్టి ముసల్మాను వయ్యావు; మా రాణాకు సోదరుడవయ్యా వారి శత్రుపక్షం చేరావు. అందుకే నీ చేతిలో చావాల నుంది ! రా !

మ: (కత్తి దూసి) శాంతించండి. నేను తమ నెన్నటికీ చంపను.

గో: ఇంక రెండో మాట వినిపించుకోను. ఆత్మరక్షణ చేసుకో.

మ: గోవిందసింహాజీ—

గో: ఊఁ! చంపు, నన్ను చంపెయ్—

మ: అబ్బే ! నే నస్త్ర విసర్జన చేశాను.

గో: నే నూరుకోవద్దూ ! నే నొచ్చిన పని అయి తీరాలి. తియ్ ! అస్త్రం తియ్ !

(మహాబత్ ఖా పైకి పోవడానికి ప్రయత్నిస్తాడు. ఇంతలో గజసింహుడు వెనకగా వచ్చి తుపాకీ ఫేలుస్తాడు; గోవిందసింహుడు క్రిందపడిపోతాడు).

మ: అయ్యయ్యో ! ఎంతపని చేశారు !

గ: చంపేశాను !

మ: వారెవరో తెలుసా?

గ: ఏమో? ఎవరో దొంగ కాబోలు !

గో: నేనేం దొంగను కాదు— మీరే దొంగలు. నేను మీలా ఒకరి దేశం దోచుకోడానికి రాలేదు. మహా బత్‌ఖా! ఇంక నువ్వు స్వేచ్ఛగా ఉదయపురం ప్రవేశించవచ్చు. వెళ్ళు! నీతల్లిని మొగలుల బానిసగా అప్పగించు! దానితో నీ కర్తవ్యం పూర్తవుతుంది. అజయా!— కల్యాణీ!—

(తెర)

ఐదవ రంగం

స్థలం: ఉదయపుర దుర్గసమీపపు వీధి. సమయం: రాత్రి. (దుర్గ రక్షకునితో కొందరు నగరవాసులు మాట్లాడుతూ వుంటారు)

మొ. పౌ: ఏమోయ్! యివాళ మహారాజు దుర్గం విడిచి వెళ్ళారేం?

దుర్గ. ర: తెలీదు. కాని మహాబత్‌ఖా యింక ముందు మేవాడ్‌కు విరుద్ధంగా కత్తి బట్టనని పాదుషాకు తెలియ జేశాట్ట. అంచేత యుద్ధానికి యువరాజు ఖుర్రమొచ్చాడు. ఆయన నిన్న మహారాజుకేదో కాయితం పంపాడు. పొద్దున్నే రాణాజీ గుర్రమెక్కి ఖుర్రం డేరావైపు వెళ్ళారు.

రెం పౌ: తరవాతేమయింది.

దు. ర: అది నాకు తెలియదు.

మూ పౌ: ఇంతవరకూ రాణాజీ రానేలేదా?

దు. ర: లేదు.

నాలు పౌ: వారితో యింకెవరెళ్ళారు?

దు. ర: ఎవరూ వెళ్ళలేదు; రాణాజీ ఒక్కరే వెళ్ళారు.

మొ పౌ: చూడు, ఎవరో వస్తున్నారు.

రెం పౌ: మన రాణాజీ యేమో?

మూ పౌ: అబ్బే! మన రాణాజీలా కనుపించదు.

నాలు పౌ: వేషం రాజ వేషమే. (దుర్గ రక్షకునితో) వారెవరో నీకు తెలుసా?

దు. ర: జోధపుర మహారాజు గజసింహుడు.

మొ పౌ: మహాబత్‌ఖాతో యుద్ధాని కొచ్చినాయనా?

దు. ర: మరే!

రెం పౌ: ఆయన రాజపుత్రుడే కదూ?

మూ పౌ: అంతేకాదు; రాజపుత్రుల శత్రువు కూడాను.

(గజసింహుడు సమీపిస్తాడు)

గజ: కోట ద్వారం మూసి వుందా?

దు.ర: చిత్తం.

గజ: ఈ కోట మా వశమయింది; తలుపు తెరువు.

దు.ర: మా ప్రభువాజ్ఞ లేనిదే తెరవలేను.

గజ: ఇప్పుడు మీ ప్రభువు అమరసింహుడు కాదోయ్, మేము!

దు.ర: అలాగా? నాకు తెలియదు లెండి! ఏమైనా రాణా అమరసింహజీ ఆజ్ఞ లేనిదే కోట తలుపులు తియ్యలేను.

గజ: (తన సైనికులతో) కోట తాళాలు లాక్కోండి.

దు.ర: నే బతికుండగా ఆపని చెయ్యలేరు (ఒర నుండి కత్తి తీస్తాడు)

గజ: సరే! వీణ్ణి చంపండి.

మొ. పౌ. (రెండవ పౌరునితో) ఊరికే చూస్తావేం? ఊఁ! (పౌరులంతా గజసింహుని చుట్టుముడతారు. గజసింహుడు తన సైనికుల్ని పిలుస్తాడు. వాళ్ళు వచ్చి పౌరుల్ని చుట్టుముడుతుండగా పెక్కురు మొగలు సైనికులతో అమరసింహుడు వస్తాడు.)

రాణా: (సైనికులతో) ఆగండి! (మొగలు సైనికుల్ని చూసి రాజపుత్ర సైనికులు ఆగిపోతారు)

రా: (గజసింహునితో) తమ కిక్కడేం పని?

గ: మేమూ కోటలో ప్రవేశించాలి.

రా: ఓహో! రాజ అతిథియా! మంచిది యథోచితంగా సత్కరిస్తాను! మొగలాయీల జాగిలమా! ఇదే నీకు తగిన సత్కారం!

(ఒక్క దెబ్బతో గజసింహుణ్ణి నేలపై పడగొడతాడు)

రా: కూరా, దుర్గ ద్వారం తెరువు. (ద్వారం తెరిచిన మీదట మొగలు సైనికులతో) యింక మీరు వెళ్ళవచ్చు. (రాణా దుర్గంలో ప్రవేశించగా దుర్గ ద్వారం మూసుకొంటుంది)

(సశేషం)

తెలుగువారి తొలి ఉగాది

శ్రీ కాశీభొట్ల సూర్యనారాయణశాస్త్రి

మేలుకో ఓ ఆంధ్రనారీ!
ఆలకింపుము ఆంధ్రభేరీ!!

దేవలోకములోని దేవులందఱు గూడి
దీవెనలు పలికిరీ కోటిగొంతులతోడ
కప్పురపు వీధిలో గుప్పించె పువ్వాన
రప్పించె రాష్ట్రిమ్ము రామరాజ్యమువోలె ॥మేలు॥

తలచుకొమ్మా పూర్వశౌర్యం।
నిలుపవమ్మా ఆంధ్ర ధైర్యం॥

ఝాన్సిలక్ష్మీభాయి, మల్లమ్మ, రుద్రమ్మ
కన్నెఱుపు జాడల్లొ కదులుమోయమ్మ
చూపుమాధీశక్తి - తెల్పుమానిజభక్తి
తెప్పించు ఘనకీర్తి దేశమంతటలోన ॥మేలు॥

సమరమన్నది చాలతప్పు
అమరజీవుల నాత్మనిల్పు

సాటియా శ్రీరాముల్లోపై పోవుచే
గీటురాయిగ యెంచి దీటుగా పనిచేయి
యేటికాకన్నీరు - చాటు నీతెలివెల్ల
మేటియనిపించుకో మాతృభూమిలోన ॥మేలు॥

భావిసాధన లెంచిచూడూ!
సేవలందును చిత్తముంచూ!!

కంటికి రెప్పవై కాదు నీ దేశాన్ని
యింటిలో సోదరని యెంచు పరకాంతనీ
సఖ్యమందఱుగూడి - ముఖ్యమౌ పరసేవ
సౌఖ్యమొనగూర్పు మా సాటి మహిళలతోడ ॥మేలు॥

విజయ మొందెను ఆంధ్రరాజ్యం!
ఈ జయవర్షమే తొలి ఉగాది!!

ఉగాది మారుతం ఉల్లాసముగ వీచె
మేఘాల నిర్మలం త్యాగమై కన్పించె
చూడుమా గగనము - పాడుమాగీతికా
తోడుగారానిమ్ము తోటివనితలగూడ ॥మేలు॥

తెలుగుతల్లి

శ్రీ కన్నెకంటి వీరభద్రాచార్యులు

అనుఁగు చెల్లెల!– పసిఁడి గద్దియ
నలరు చున్నది – అమ్మ యదిగో!
వినయమొప్పఁగఁ జేరజని దీ
వెనల - నందుమురా!

పిలుచు చున్నది చెల్లెలా! నీ
లలిత విజ్ఞానంబు గొప్పది
విలువఁ జేరిచి తెలుగు తల్లిని
నిలుపు కొనుమమ్మా!

తెలుఁగు శీలము నేడు నీలో
నిలచియున్నది నిక్కవమ్ముగ
తెలుగు లక్ష్మిని చక్కదనములఁ
దీర్చి దిద్దుమురా!

నీవు లేనిది తెలుగు తల్లికి
జీవమే లేదంచు చాటిరి
పావనాత్ములు – సోదరీ! నీ
భాగ్యమయ్యెదిరా!

తెలుఁగు వెలుఁగుల నెల్లకాలము
నిలుపఁజాలిన తెలివి తేటల
గలవు నీలో – ఆంధ్ర లక్ష్మికి
బలముఁ గూర్చుమురా!

హారతుల నిడుమమ్మ మన బం
గారు తల్లికి సుగుణ వల్లికి
కోరికలు నెరవేరు కాలము
కూడి వచ్చినది!

బాలానందం

పేరాశ

• శ్రీ పిశ్కా సుబ్బారావ్‌శాస్త్రి •

కాపవరంలో కామయ్య అనే ఒక కాపు వుండేవాడు. కామయ్య పెద్దమ్మ ముద్దు బిడ్డలలో ఒకడు. ఎన్ని వూళ్లు తిరిగినా, ఎందరికాళ్లు పట్టుకున్నా వుద్యోగం దొరకలేదు కామయ్యకు పాపం!

కామయ్య చివరికి విసిగి దేశాటనం చేయాలనుకున్నాడు. సరే బయలుదేరాడు. పెళ్లామా, పిల్లలా! ఎవరూ లేరు. తనపొట్ట పోషించుకుందికే కష్టంగా వున్నప్పుడు పెళ్లెలా చేసుకుంటాడు!

కొన్నాళ్లలా తిరిగి తిరిగి ఒక అడవి చేరుకున్నాడు. అది మండు వేసంగి కాబట్టి ఎక్కడా నీళ్ళు కనపడలేదు. నీళ్ళకోసం వెతుకుతూ వుండగా, ఒక సిద్ధుడు కనపడ్డాడు. కామయ్య సిద్ధుణ్ని చూసి, గబగబా పోయి అతనికి ఎంతో భక్తితో నమస్కరించేడు.

ఆ సిద్ధుడు కామయ్యను దీవించి "నాయనా! నీకేమిటి కావాలి?" అని అడిగాడు.

"మహాత్మా! నేను గర్భదరిద్రుణ్ని. నాకు ధనం కలిగే మార్గం చూపించండి!" అని అన్నాడు వినయంగా కామయ్య.

"నాయనా! ఇదిగో యీ దండాన్ని తీసుకో! ఇది పట్టుకొని యిలాపో! ఇది ఎక్కడపడితే అక్కడ త్రవ్వి చూడు!" అంటూ దీవించి పంపేడు సిద్ధుడు.

కామయ్య దండాన్ని తీసుకు బయలుదేరాడు. అలా పోగా ఆదండం ఒకచోట చేయిజారి కిందపడింది. కామయ్య అక్కడ తవ్వి చూశాడు. రాగి కనిపించింది. ఇంకాముందుకుపోతే యేముంటుందో అని కామయ్య అనుకున్నాడు. తిరిగి బయలుదేరాడు. కొంతదూరం పోయిన తర్వాత మళ్లీ దండం చేయిజారి క్రిందపడింది. కామయ్య ఆత్రుతగా అక్కడ తవ్వి చూశాడు. కళ్ళు జిగేలుమన్నాయి. వెండి మయం!! కామయ్య యింకా ముందుకు పోవాలనుకున్నాడు.

కామయ్య దండం తిరిగి మరొకచోట పడింది. ఏమిట్రా అనుకుంటూ తవ్వి చూశాడు. యింకేముంది? బంగారం!!! కామయ్యకు యీసారయినా సంతృప్తి కలుగలేదు. "మొదట రాగి, తర్వాత యేమో వెండి, యిప్పుడు బంగారం, యింకా ముందుకు పోతే మణులూ, రత్నాలు" అంటూ లొట్టలు వేయసాగాడు.

కామయ్య పేరాశతో బయలుదేరాడు ముందుకు.

కామయ్య అనుకున్నట్లు ఒక చోట తిరిగి చేతికర్ర జారి పడింది. అక్కడ తవ్వడం ప్రారంభించేడు. ఎంత తవ్వినా యేదీ కనిపించలేదు!! కాకపోగా, ఆ స్థలం అంతా కంపించ సాగింది!!!— కొంతసేపటికి భూమి బ్రద్దలయిపోయింది! అంతే కామయ్య పాతాళంలోకి పోయాడు!— పెద్ద పెద్ద కొండలకే లేదు దిక్కు— కామయ్య ఒకలెఖ్ఖా! తిరిగి అంతా సమానమయి పోయింది. మట్టిలో కలిసిపొయ్యాడు కామయ్య.

చూశారా! బాలలూ! పేరాశపరుడయిన కామయ్య గతి ఏమయిందో! అందుకే మన పెద్దలు 'పేరాశ' కూడదంటారు!

తొంభై తొమ్మిది చేసిన పని

• శ్రీ తెంజర్ల శివరామశాస్త్రి •

రామశాస్త్రిగారు మా ఊళ్ళోకల్లా ఇంగ్లీషులో గొప్ప పాండిత్యము సంపాదించిన వారు. ఊళ్ళో అందరూ ఆయనను "ఇంగ్లీషు పండిట్" అని పిలుస్తూ ఉంటారు. ఆయన మా స్కూలులో నాలుగేళ్ళనుంచి ఇంగ్లీషు మాష్టరుగ పని చేస్తున్నారు. రామారావు, ఆయన గారి ఏకైక పుత్రుడు. 5వ. ఫారం చదువుతున్నాడు. "పండిత పుత్రః శుంఠః;" అన్నట్లు రామారావు చదువులో ఉత్త శుంఠ. ఇతర విషయములలో ఉన్న తెలివి తేటలు చదువులో లేవు. అంతెందుకూ, ప్రతి తరగతిలోనూ మూడు, నాలుగుమార్లు దండయాత్ర కొట్టనిదే పైతరగతి లోకి వచ్చే వాడుకాడు. తల్లి తండ్రులంటే ఆసలు భయమే లేదు. అందులో రామశాస్త్రిగారు కొద్దిగ ముద్దు చేస్తూ ఉంటారేమో, నెత్తిమీదెక్కి కూర్చునేవాడు. అప్పుడప్పుడు ఇంట్లో చిన్న చిన్న దొంగతనాలు చేసి స్నేహితులను సినీమాలకూ, టీపార్టీలకూ తీసుకువెళ్ళేవాడు. "ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలే"డన్నట్లు రామారావు దొంగ తనాలు తల్లి తండ్రులు కనుక్కొనలేక పాపము ఇంట్లో దాసీమనిషినే కేకలువేసేవారు. ఇంక బళ్ళో మాష్టర్లను ఏడిపించడం రామారావుకు ఉగ్గుతో పెట్టిన విద్యయే. వంకాయనీ, బీరకాయనీ, కొమ్ముచెంబనీ వాళ్ళకు పేర్లు పెట్టేవాడు.

రామశాస్త్రిగారికిష్టము లేకపోయినప్పటికీ పాపము వీళ్ళనీ, వాళ్ళనీ ఆశ్రయించి, మార్కులు వేయించి కొడుకును 5 వ. ఫారం ప్యాసు చేయించారు. 5 వ. ఫారం మొదటిసారిలోనే ప్యాసు అయినందు వల్ల తాను ప్రధాన మంత్రి నెహ్రూగారికంటే గొప్పవాడయినట్లు గర్వించుతూ ఉండేవాడు. రామశాస్త్రిగారికి ఆ ఊళ్ళో మంచిపలుకు బడి వుండుట వల్ల కొడుకును 5 వ ఫారం వరకు ప్యాసు చేయించారు. ఇంక ఆపైన ఎవరు ప్యాసు చేయించ గలరు ? అవి గవర్నమెంటు పరీక్షలాయె. అందుకని రామశాస్త్రిగారు రామారావుకు ఇంగ్లీషులో తాను ప్రైవేటు చెబుతూ, ఇంకా రెండు మూడు సబ్జక్టులలో ప్రైవేటు చెప్పించారు. కాని రామారావు ఏనాడూ ప్రైవేటుకు సరిగ్గా వెళ్ళేవాడుకాడు. చెట్లక్రింద, పార్కులోను, కూర్చుని ఇంటికి వెళ్ళేవాడు. స్కూలుఫైనలు పరీక్షలు దగ్గరకు వచ్చాయి రామశాస్త్రిగారు కొడుకును చదివించి పరీక్షకు పంపినారు. శెలవులలో జల్సాగా తిరిగాడు రామారావు. మరునాడు పరీక్ష ఫలితాలు ప్రకటించేరోజు. రామారావు పేపరు దొరక్కపోతుందేమోనని, ఆనాటి రాత్రే వెళ్ళి ప్లాటుఫారం మీద పడుకొన్నాడు. తెల్లవారింది. మైలు పెద్దచప్పుడు చేసుకొంటూ ప్లాటుఫారంమీదకువచ్చిఆగింది. విద్యార్థులు రైలు పెట్టెలన్నిటినీ చుట్టుముట్టేసారు. రామారావు జనంలోకి త్రోసుకొంటూ వెళ్ళి, పెద్ద ఘన కార్యము చేసినవాడిలాగ 0-2-0 పెట్టి పేపరు కొన్నాడు. ఆత్రంతో, ముఖము చాటంత చేసుకొని తన నంబరు కొరకు వెతికాడు. పాపము ఎంత వెతికినా అతని నంబరు కనపడలేదు. నంబరు కనపడకపోతే దాని అర్థము తెలుసుగా ! కోపముతో పళ్ళు పటపట కొరుక్కుతూ పేపరు చించి చించి ముక్కలు చేశాడు, ప్రక్కవారు అడుగుతా రేమోనని. రామశాస్త్రిగారికి కొడుకు ఫలితము ఎప్పుడో తెలిసిపోయింది. రామారావు 20 లంఖణాలు చేసినవాడికి మల్లే అడుగులో అడుగు వేసుకొంటూ ఇంట్లో ప్రవేశిం చాడు. రామశాస్త్రిగారు అవమానము భరించలేక కొడుకును చావకొట్టారు. ఆయనకు నలుగురిలో తిరిగే ఆస్కారము లేకపోయింది. కొడుక్కు చదువు మాన్పించి ఎక్కడన్నా ఉద్యోగములో చేర్పిద్దామను కొన్నారు రామశాస్త్రిగారు. కాని ఆయన భార్య ఊరుకొంటేగా ! ఇంక ఒకటే పోరు మొదలుపెట్టింది. "ఈ రోజుల్లో బి.ఎ., ఎమ్.ఎ., డిగ్రీలు పొందినవాళ్ళే ఉద్యోగము దొరక్క ఛస్తుంటే, యింక వీడి సంగతేమి"టని.. అందుకని రామారావును మళ్ళీ అక్టోబరు పరీక్షలో కూర్చునేందుకు దరఖాస్తు పెట్టించారు. ఇంగ్లీషు రామశాస్త్రిగారు చెపుతూ వచ్చారు. తెలుగు, సైన్సు, లెక్కలు, సోషల్ స్టడీస్ మొదలగు వాటన్నిటిలో పెద్ద పెద్ద డిగ్రీలు సంపాదించిన వారి వద్ద ప్రైవేటు చెప్పించారు. రామారావు ప్రైవేట్లకు సరిగ్గా వెళుతూనేవచ్చాడు. కాని మనస్సు చదువుమీద వుంటేగా ! గోడమీద అంటించిన సినిమా స్టార్లమీద, ఇంట్లో చేసే వంటమీద మనసు వెళుతూం డేంది. రెండు నెలలలో అతని నంబరు పంపించారు గవర్నమెంటువారు. అతని నంబరు తొంభై తొమ్మిది

తొంభై తొమ్మిది చేసిన పని

(99). పరీక్షలు దగ్గరకు వచ్చాయి. రామశాస్త్రిగారు సామ, దాన, భేద, దండోపాయములనుపయోగించి రామారావును పరీక్షకు పంపారు. అన్ని సబ్జక్టులలో ప్రైవేటు చెప్పించినా ఇంగ్లీషు, సైన్సు పరీక్షలు బాగా వ్రాయలేదు. రామశాస్త్రిగారు "బాగా వ్రాసేవురా?" అని ప్రశ్నించితే "బాగా వ్రాశా"నని బొంకాడు. తక్కిన పరీక్షలన్నీ సలక్షణముగ వ్రాసివచ్చాడు. శలవులలో అత్తయ్యగారింటికి వెళ్ళటానికి క్యాంపు వేసాడు. కాని రామశాస్త్రిగారు ఫలితములు వచ్చిన తరువాత వెళ్ళమన్నారు. చంద్రబింబమువలె ఉన్న మొహము కాస్తా మాడిపోయిన కాకరకాయకు మల్లే అయిపోయింది రామారావుకు. మళ్ళీ శనిభూతములాగ పరీక్షాఫలితాలు ప్రకటించే రోజువచ్చింది. ఎవరికెంత కోపమొస్తేమటుకు పరీక్షాఫలితాలు ప్రకటింపబడుట ఆగుతాయా? మరునాడే మైలులో పేపర్లు వచ్చాయి. రామారావు మళ్ళీ జనములోకి కుస్తీ పట్టుకుంటూ వెళ్ళి పేపరుకోసము ప్రయత్నించాడు. కాని పేపర్లు అప్పటికే అయిపోయినవి. ప్రక్కనే పరీక్ష తప్పిన ఒక విద్యార్థి తన పేపరును 0-4-0 లకు అమ్ముతానని అరుస్తున్నాడు. రామారావు బ్లాకుమార్కెటు పేపరు కొని తన నంబరు "తొంభై తొమ్మిది" కొరకు వెతికాడు. ఆనందము! ఆశ్చర్యము! అతని నంబరు సువర్ణాక్షరములవలె ప్రకటింపబడియున్నది. ఇంక చూసుకొండి! ఆ యింటిల్లిపాది ఆశ్చర్యము! ముఖ్యముగా రామారావు తనకు ప్రైవేట్లు చెప్పిన మాష్టర్లనే మర్చిపోయాడు ఆ ఆనందంలో. రామశాస్త్రిగారు మరునాడు ఊళ్ళో పెద్దలందరినీ టీపారీకి రమ్మని ఆహ్వానాలు పంపారు. రామారావుకు సరికొత్త "ట్వీడు-సూట్" కుట్టించారు.

మరునాడు టీ పార్టీ పెద్ద బ్రహ్మాండంగా జరిగింది. పిల్చిన పెద్దలే కాకుండా, పిలవని చిన్నలుకూడా వచ్చారు టీ పార్టీకి. రామశాస్త్రిగారికి టీ పార్టీ వల్ల దాదాపు 250 రూపాయలు వదిలాయి. వదిలితే ఏమిలెండి! ఆయన కొడుకు ఒకమారు తప్పి ప్యాసయినాడు! అతని జీవితములో రెండు మూడు మార్లు ఫైయిల్ కాకుండా ఎన్నడూ ప్యాసు కాలేదు. ఇపుడు పరమానందభరితము! తండ్రిగారికి. డబ్బు వదిలినా ఆయనేమీ అనుకోలేదు.

మరునాడు రామారావు క్రొత్త "లెనిన్ సూటు" తొడుక్కొని, అద్దం ముందు మేకప్ చేసుకుంటున్నాడు. అత్తయ్యగారింటికి ప్రయాణమయ్యాడు కూడాను! ఇంతలో వాకిట్లోంచి "టెలిగ్రాం సార్" అంటూ టెలిగ్రాం బంట్రోతు అరిచాడు. రామశాస్త్రిగారు ఆత్రంతో సంతకం పెట్టి టెలిగ్రాం తీసుకుని చదివారు. దాంట్లో ఇట్లా ఉంది. "నిన్నటి పరీక్షా ఫలితముల పత్రికలో 89 వ నంబరు (ఎనభై తొమ్మిది). ప్రకటించబోయి పొరబాటున 99 నంబరు (తొంభై తొమ్మిది) ప్రకటింపబడింది. తొంభై తొమ్మిదవ నంబరు విద్యార్థి ప్యాసు కాలేదు" మరునాడు అన్ని వార్తా పత్రికలలో గూడ పైవిధముగానే వ్రాయబడియున్నది. రామశాస్త్రిగారికి నోటంట మాటరాలేదు. కొడుకు రామారావును పిలిచి టెలిగ్రాం చదువుకోమన్నారు. రామారావు చదువుతూండగా అప్రయత్నంగా టెలిగ్రాం చేతిలోంచి జారి క్రింద పడిపోయింది. రెండు కన్నీటి బిందువులు బొట బొట దాని మీద పడ్డాయి రామశాస్త్రిగారి నోటినుంచి "ప్చ్....ప్చ్.... తొంభై తొమ్మిది ఎంత పని చేసింది! 250 రూపాయలు టీ పార్టీ క్రింద వదిలినాయే.... విధి దక్కినా ఫలం దక్కలేదు" అను మాటలు అప్రయత్నంగా వెలువడ్డాయి.

జీవితం

శ్రీ కోనకిశోర్

జీవితమే ఒక ఆనందం
జీవితమే ఒక వైభోగం
నాలో నున్న నైరాశ్యం
నాలో నున్న అమాయకం
నాలో నున్న అంధకారం
జీవిత జ్యోతిలో మసిచేస్తాం ॥జీ॥

ధనము ఆశ కోరికలన్నీ
హేయమంచును నీటగల్పి
నీతి నియమం శాంతహింసలు
మధురమైన జీవితజ్యోతితో
వెలుగు బాటల పయనం చేసి
దివ్య క్షేత్రములు దర్శిస్తూ

నవ్యభూమిని చేరేద్దాం
దివ్య జ్యోతిని వెలిగిద్దాం
జీవితమే ఒక ఆనందం
జీవితమే ఒక వైభోగం

* కుమారి కామేశ్వరి. *

పూర్వం 'అడింద సూరకవి' అనే గొప్ప పండితు డుండేవాడు. ఆయన మంచి బాగా కవిత్వం చెప్పేవాడు. ఒకనాడు ఆయన ఒక తాటాకు గ్రంథాన్ని చంకలో పెట్టుకొని ఎక్కడికో వెడుతున్నాడు. త్రోవలో ఒక రాజు సూరకవికి ఎదురై "శాస్త్రులుగారూ! ఈవేళ వారం, తిధి, నక్షత్రం మొదలైనవి చెప్పండి" అని అడిగేడు. అప్పుడు సూరకవి "రాజా! తిథి, నక్షత్రాలు చెప్పటాన్కి- యాయవారం బ్రాహ్మణ్ణి కాదు. పెద్ద పెద్ద పండితులు, కవులు నిర్ఘాంతపోయేటట్లు కవిత్వం చెప్పగల సూర కవిని" అని బదులు చెప్పేడు. అందుకారాజు నవ్వుతూ "కవిగారూ! మీరు పెద్ద కవినని చెప్పేరు. వారం, వర్జ్యం చెప్పడం చేతకాదుకదా. ఇంకెందుకు మీ పాండిత్యం" అంటూ హేళన చేసేడు. సూరకవి మన సులో యేదో తల్చుకొని మౌనంగా వెళ్ళిపోయేడు. ఒకరోజు సూరకవి యధాప్రకారం వెడుతుంటే ఇది వరకు హేళన చేసినరాజు ఒక పెద్ద కత్తి పట్టుకుని, గబ గబ నడిచి వెళ్ళిపోతూ సూరకవికి ఎదురయాడు. సూరకవి ఆరాజుని దగ్గరగా పిల్చి "రాజా! ఈవేళ మా మంగలి రాలేదు. అందుచేత నీ కత్తితో కాస్త క్షవరం చేసిపెడతావా?" అని అడిగేసరికి ఆ రాజు తాడిపొడుగున ఎగుర్తూ "ఏమయ్యా! నీకేమయినా బుద్ధి, జ్ఞానం వున్నాయా? నేను మంగలిననుకున్నావా నీకు క్షవరం చేయటాన్కి" అని కోపంతో మండిపడ్డాడు. అందుకు సూరకవి నవ్వుతూ "రాజా! చేతిలో అంత పెద్ద కత్తి వున్నదికదా! ఆమాత్రం క్షవరం చేయలేవా? అయితే అంత కత్తి ఎందుకు?" అని ఎగతాళి చేసేసరికి ఆ రాజు తేలు కుట్టిన దొంగలాగయి; కవిని క్షమాపణ కోరుకున్నాడు.

వీరబల్ వినోదాలు

శ్రీ ఎ. ఆర్. కె. బి. ఆనందరావు.

ఒకసారి అక్బరు చక్రవర్తి తన దర్బారులోని ఉద్యో గులతో ఇంతవరకు కనీ, వినీ, ఎరుగ నటువంటి ఒక వార్తను కల్పించిన వారికి ఒక బంగారు నాణాన్ని బహు మతిగా ఇస్తానని ప్రకటించాడు.

చక్రవర్తి నోటినుండి ఆమాటలు వెలువడ్డవో లేవో, వెంటనే, వీరబల్ లేచి "చక్రవర్తిగారు 'క్షమిస్తాను' అని అభయమిస్తే నేనే ఆ వార్తను కల్పించి చెప్తాను" అని చక్రవర్తిగారి హామీని కోరుకున్నాడు.

అక్బరు వెంటనే అభయమిస్తూ ఆ వార్తను తెల్పమనే సరికి, వీరబల్

"అయ్యా నేనొకసారి దేశ దేశాలు పర్యటన చేయు చున్నప్పుడు ఒక రాజ్యాన్ని చూచుట తటస్థించింది. ఆ రాజ్యాన్ని పాలించే రాజు వట్టి మూర్ఖుడు-ప్రజలపై అనేక పన్నులు విధించుచూ వారిని బాధించెడి వాడు. అందుచే ఆ దేశంలోని ప్రజలు ఇతరదేశాలకు వలస పోయారు. ఇప్పుడారాజ్యం జనసంచారం లేకుండా ఒక శ్మసాన వాటికగా మారిపోయింది. అయినప్పటికిని ఆ మూర్ఖపు రాజు తన పట్టు వదలలేదు" అంటూ వీరబల్ తన వార్తను అంతం చేశాడు.

వెంటనే అక్బరు ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ.

"ఇంతకీ ఎవరు ఆ మూర్ఖపురాజు ...... ! " అని ప్రశ్నించాడు.

వీరబల్ తడుము కోకుండా "మీరే" నంటూ నిశ్చ యంగా సమాధానం చెప్పేసరికి,

"ఆ .... నేనా ...." అని విభ్రాంతుడై అకర్బు చక్రవర్తి కోపంతో వీరబల్ పై ఖడ్గం ఎత్తేసరికి, వీరబల్ అదంతా కల్పనేనని, అభయం సంగతి గుర్తు చేసేసరికి, అక్బరు కోపం అంతా ఒక నిముషంలో మంచుగడ్డ వలె కరిగి పోయింది. వీరబల్ బంగారు నాణాన్ని బహుమతి పొందాడు.

కరుణ

"శ్రీ ఈరంకి"

సుబ్రహ్మణ్యంగారు సామాన్య కుటుంబీకుడు. దగ్గర దగ్గరగా పదెకరాల భూవసతి, నాలుగైదువేల రూపాయల రొఖ్ఖం ఉంది. ఇంక భార్య రెండు మూడు సంవత్సరాలకు పోతుందనగా కొత్త యిల్లు కట్టించేరు. ఇంట్లో ఒక్క బెడద తప్పితే మరేం లేదు. వద్దు వద్దంటే ఆయన భార్య పట్టుపట్టి తన తమ్ముడు ఉబ్బసపు వ్యాధితో బాధ పడేవానికి, అతని వాటాకు వచ్చే ఆరెకరాల భూమికోసం ఆశపడి 10 సంవత్సరాల తన కూతురునిచ్చి పెళ్ళిచేసింది. పెళ్ళయి ఆరు మాసాలేనా కాకుండా ఆపిల్ల వైధవ్యం అనుభవించ వలసివచ్చింది. సుబ్రహ్మణ్యంగారికి ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు. పెద్ద ఆడపిల్లలు ఇద్దరూ కాపరానికి వెళ్ళారు. మూడో పిల్ల కమలకి వైధవ్యం సంభవించింది. మిగతా కుర్రాళ్ళిద్దరూ చిన్న పిల్లలు. ఆ ఊళ్ళో ఉన్న బోర్డు స్కూల్లో చదువుకుంటున్నారు. ఇంట్లో పెద్దదిక్కు సుబ్రహ్మణ్యంగారి అక్కగారు వెంకమ్మగారు మాత్రమే.

వెంకమ్మగారు తమ్ముణ్ణి ఇంకో పెళ్ళి చేసుకోమని బలవంతం చేయడం మొదలు పెట్టింది. తనకి చేసుకుందామనే ఆశఉన్నా 'పిల్లనిచ్చే పెద్ద ఎవరా!' అనే సందేహం కొద్దీ అంతగా పట్టించుకునేవారు కారు సుబ్రహ్మణ్యంగారు. ఈ పరిస్థితిలో తికమక లాడుతున్న సుబ్రహ్మణ్యంగారికి కూతురు కమలయొక్క భావిజీవితపు సమస్య బోధపడక బాధపడుతున్నారు. హిందూ ధర్మశాస్త్రరీత్యా ఆలోచిస్తే కమలకి సంఘం బోధచేసేది, చప్పిడిపిండి, వీభూదిబుట్ట, దూది పింజి, గోవిందనామాలు. కమల యుక్తవయస్కురాలు. మానవులకు ఉండవలసిన కోర్కెలు ఆమెకుకూడ ఉంటాయనిగాని, ఆమెకూడ సర్వసౌఖ్యముల ననుభవించే టందుకు హక్కు కలదనిగాని ఏ సంఘం కూడ అంగీకరించనప్పుడు, కరుడు కట్టుకుపోయిన మూర్ఖుల సంఘంలో ఒకరయిన సుబ్రహ్మణ్యంగారికి మాత్రం ఏం ఆలోచన తట్టుతుంది!

ఈ విధంగా ఉండగా ఆ వూరి కరణంగారు ఒకసారి ఎవరో పెళ్ళి పెద్దని తీసుకువచ్చి సుబ్రహ్మణ్యంగారికి చూపించి, వారి వారి సాంప్రదాయాల్ని విమర్శించి, బహు బీద కుటుంబీకుడగుటచేత, సంసార భారం ఎక్కువగుట వల్ల పిల్లలికి పెండ్లిండ్లు చేయలేకుండా ఉన్నాడనే భావం వెలిబుచ్చేటట్లు చిన్న ఉపోద్ఘాతం ఒకటి చెప్పి, పిల్లని మన యింటికి తీసుకొనివచ్చి, మనమే ఖర్చులు భరించి పెళ్ళి చేసుకోవాలని సుబ్రహ్మణ్యంగారికి నచ్చచెప్పి, మొత్తానికేదో విధంగా పెండ్లి ఖాయపరచేడు. భార్యా వియోగం వల్ల చాలా రోజుల నుంచి బాధపడుతున్న సుబ్రహ్మణ్యంగారికి కాస్త పెళ్ళి, పిల్ల కబుర్లు చెప్పడంతోనే ఒళ్ళు పులకరించింది. మళ్ళీ నూతన వధూ సంగమం గుర్తుకొచ్చింది. ఆ మర్నాటినుంచి కాస్త తలకి రంగు రాయడం, మీసాలకి రంగేయడం, సిల్కు లాల్చీలు, జరీ ఖండువాలలోకి దిగింది ఆయన వ్యవహారం. మొత్తానికి వివాహం ఖాయపరచి వివాహం చేసేరు, సుబ్రహ్మణ్యంగారి రెండవ భార్య కాపరానికొచ్చింది. రోజులు గడుస్తున్నాయి. సుబ్రహ్మణ్యంగారి యింట్లో నెమ్మదిగా అగ్గి రగులుతోంది. కారణాలు మరేం లేవు. పిల్లలు సావిత్రమ్మగార్ని, (సుబ్రహ్మణ్యంగారిభార్యని)'పిన్నీ' అని నోటారాపిలవటం లేదని, ముసలి వెంకమ్మగారు మడి కుదరక ఏ సరుకులు ముట్టుకోనివ్వటం లేదని, బాల వితంతువైన కమల వాళ్ళ మేనత్త వెంకమ్మగారి మాటలు చెవిని పెడుతుందికాని తనమాటలు ఈషన్మాత్రం వినిపించుకోటం లేదనీను. ఇంటి గుట్టుమాత్రం బయటికి రావడంలేదు. ఈవిధంగా గడుస్తున్నాయి రోజులు.

ఒకనాడు సుబ్రహ్మణ్యంగారి ఓవేలు విడిచిన చెల్లెలిగారి అబ్బాయి మాధవరావు వాళ్ళ మామయ్యని, పిల్లల్ని చూచేటందుకు, చిన్నతనంలో ఆరోపేట చూచిన కమల ఏం చేస్తూందో ఊహించుకొంటూ దారిలో కనిపించిన రకరకాల పువ్వులు, దవనం, మరువం మొదలయిన వన్నీ పట్టుకొని ప్రొద్దుట తొమ్మిది గంటల బండిలో దిగేడు. మాధరావుకు తండ్రి చిన్నతనంలోనే పోవడంచేత వాళ్ళ తల్లి చిన్నమ్మగారు అన్నగారిఊళ్ళో హైస్కూలు ఉందనే కాపరం పెట్టి చదువు చెప్పించింది, కొడుక్కి. ఏదో

ఆస్తి దగ్గరదగ్గరగా పాతిక 30 ఎకరాలవరకూ ఉండడం వల్ల చిన్నమ్మగారు కొడుక్కి మద్రాసులో చదువు చెప్పిస్తోంది. సుబ్రహ్మణ్యంగారు రెండవ వివాహం చేసుకున్నారని చిన్నమ్మగార్కి కూడ తెలుసు. కాని పెళ్ళికి హాజరు కాలేదు. కమలకు తల్లి వల్ల జరిగిన మోసం కూడ వారికితెలుసు. ఇప్పుడు మాధవరావుకు ఇరవైమూడు సంవత్సరాల వయస్సు బి.ఏ. రెండో సంవత్సరం పరీక్షలు అయాక సెలవలకి వాళ్ళ మామయ్యని, కమలని, పిల్లల్ని చూచేటందుకు సుబ్రహ్మణ్యంగారింటికివచ్చేడు. మాధవరావు వచ్చేసరికి సుబ్రహ్మణ్యంగారు ఇంట్లో లేరు. పొరుగూరు ఏదో వ్యాపకంమీద వెళ్ళారు. మాధవరావును చూచి సుబ్రహ్మణ్యంగారి భార్య ఈక్రొత్త కుర్రాడు ఎవరా అనుకొంది. వెంకమ్మగారి మాటలధోరణి, "బావ ! బావ !" అనుకుంటూ పిల్లలు మీదపడడం, అక్కడే ఓరగా నిల్చుని వారు చెప్పుకుంటూన్న మాటలు వింటూన్న కమలని, చూస్తే వాళ్ళచుట్టమే అని భావించింది. కాస్సేపు పిచ్చాపాటి అయిన తరువాత వెంకమ్మగారు వంటహడావిడిలో లోపలికి వెళ్ళింది. పిల్లలు మాధవరావు తీసుకువచ్చిన బిస్కట్లు, పిప్పరమెంట్లు తీసుకొని వీధులో ఆడుకుందుకు పోయారు. మాధవరావు నడవలో కుర్చీలో కూర్చుని "కమలా !" అని కేకవేసేడు. ఆగోడ ప్రక్కనున్న కమల గుమ్మంలోకి వచ్చి బావకేసి చూసి బుర్రవంచింది. "నాన్నేడీ?" అని అడిగేడు. "ప్రక్కఊరికి వెళ్ళేడు" అని సమాధానం చెప్పింది. ఇప్పుడు ఇదివరకటి కమల కాదు. తను చిన్నతనంలో చూసినప్పుడు బావతో ఎక్కువ పరిచయంగా ఉండేది. ఇప్పుడు ఏమోగాని క్రొత్తమనిషిని చూసినట్లు చూస్తోంది. "మీ పిన్నిగారేరీ?" అని మళ్ళీ ప్రశ్నించేడు. "దొడ్లో నీళ్ళోసుకొంటోంది" అని సమాధానమిచ్చింది. కాస్త ధైర్యం వచ్చి కుర్చీలోంచి లేచి బుర్ర వంచుకున్న కమలకు దగ్గరగా వచ్చి గెడ్డం క్రింద చెయ్యి పెట్టి బుర్రపైకెత్తి కమల కళ్ళలోకి చూసి "అలా ఉన్నావెందుకు?" అన్నాడు. అలాచూస్తుండగానే కమల కళ్ళల్లోంచి నీళ్ళు బొటబొట చెంపలమీదనుంచి జారి క్రింద పడ్డాయి. మాధవరావుకు కూడ తెలియకుండా కళ్ళలోనీళ్ళు తిరిగాయి. "ఏమిటిబావా ! అది !" అని అడిగింది కమల. కళ్ళనీళ్ళు తుడుచుకొని వెనకకు తిరిగి నెమ్మదిగా అడుగు లేసుకుంటూ వెళ్ళి కుర్చీలో కూలబడ్డాడు. తల తిరిగిపోతోంది. మనస్సు బాగులేదు. ఏమేమో ఆలోచనలు రైళ్ళమాదిరి మెదడులో పరుగెడుతున్నాయి. మాధవరావు చిన్నవాడయినా కమల కన్నీళ్ళ భావాన్ని గుర్తించగలిగేడు. కమల సంఘానికి, సంఘపు చేతిలో కీలుబొమ్మ అయిన తండ్రికి ఏం అపరాధం చేసిందో బోధపడలేదు. సంఘానికి తోడి మానవులు కష్టపడుతున్నారంటే సహాయంచేసే స్థోమతగాని, ఒకవేళ అట్టి స్థోమత ఉన్నప్పటికీ చేతకానివారనీ, నిర్భాగ్యులనీ, దురదృష్ట వంతులనీ, వాళ్ళు నించున్నచోట నిప్పు, నీళ్ళు పుట్టవని గేలిచేసే స్వభావమే కాని, తోడిమానవులకు సహాయంచేసే ఊహ సంఘానికి లేదని గ్రహించేడు. పోనీ కమల తన చేతులో నైనా ఉంటే ఈపాటికి మరోపెళ్ళిచేసి 'హాయిగా కాపురం చేసుకోమని అత్తవారింటికి పంపించే వాడేమో ! ఏ ఆలోచనా తోచక ప్రయాణపు బడలికచే చిన్నకునుకు తీశాడు. ఇంతలో పిల్లలిద్దరూ వీధిలోంచి పరుగెత్తుకొని వచ్చి మాధవరావు మీదపడ్డారు. కమల వచ్చి "అత్తయ్య ఆన్నానికి రమ్మంటోంది. నీళ్ళోసుకో బావా !" అంది. "బావ" అని తను ఎరగని పరాయి మగవాడిని సంబోధించడంతోనే ఆప్రక్కనే మసలుతూన్న సావిత్రమ్మగారి చెవిన్ని పడిందామాట. ఆమెకు ఏదో చెప్పజాలని అసూయ ఒక్కసారిగా ఆవహించింది మనస్సులో.

భోజనాలయ్యాయి. మాధవరావు ప్రయాణపు బడలిక చేత వాకిట్లో మంచం వాల్చుకు నిద్రపోయాడు. మధ్యాహ్నం మూడు గంటలయింది. ఇంట్లో వెంకమ్మగారు, సావిత్రమ్మగారు దెబ్బలాడుకున్నంత హంగామా చేస్తున్నారు. మధ్యలో కుర్రాళ్ళు కూడ ఏవేవో సావిత్రమ్మను కేకలేస్తున్నారు. మాధవరావుకు మెళకువవచ్చి [illegible]గతేమో తెలుసుకుందామని లోపలికి వెళ్ళాడు. ఎంత నిశ్శబ్దని విన్నా సంగతి బోధపడలేదు. ఆఖరికి ఈరభసలో "పువ్వులేనా పెట్టుకోనివ్వండి. ఇంకేమైనా చేయనీయండి" అంది సావిత్రమ్మ. సావిత్రమ్మ కమలకన్నా ఐదారు సంవత్సరాలు పెద్దదైనా పెళ్లి మాత్రం మొన్న మొన్ననే అయింది కాబట్టి, తన పునిస్త్రీ తనమంతా వెళ్ళగక్కి మాట్లాడుతోంది. సావిత్రమ్మ పదమూడో ఏట పెద్దమనిషయి ఇంట్లో ఇరవై నాలుగేళ్లొచ్చేవరకూ కూర్చున్నా ఈ మధ్య పదకొండు సంవత్సరాల్లోజరిగిన సావిత్రమ్మపురాణ జీవితాన్ని ఏసంఘం వేలుపెట్టి చూపించలేకపోయినా, భర్త అంటే ఏమిటో తెలియని అవస్థలో సంఘం కమలని నిరోధించగలిగిరిది. నిజం కూడ అంతే. నానాటినుంచీ వస్తూన్న సంఘ ఆచారాన్నా వదులుకోలేరు. పోనీ సరి అయిన మార్గాలలోనా నడిపించలేరు. చేతకాకో చేతనయ్యో చేసిన వివాహం

చెడిపోతే వితంతువని హేళన, విరసన చూపడం పరిపాటు. పోనీ సంఘంలోని ప్రతి మానవుడిని దేవుని సాక్షిగా ప్రమాణం జేసి తన కుటుంబంలో ఏ దోషం లేదని చెప్పమంటే ఒక్కడికీ నోరాడదు. పోనీ ఏ వేద శాస్త్రంలో నయినా వితంతు విమర్శ కలదా? అలా ఉన్న ఎడల ఏ పరిస్థితులలో స్త్రీని వితంతువని లెక్కలోకి తీసుకురావచ్చును? అని విమర్శించిన పెద్ద మనిషి ఉన్నాడా అంటే ఒక్కడూ సంఘంలోంచి బయటికి రాడు. అందరూ చేస్తున్నారు మేమూ చేస్తున్నాము అనే భావమే ప్రతి సంఘస్థుడికి. ఇందుకే వేమన్నగారు "తలలు బోడివైన తలపులు బోడివా?" అని అన్నారు.

మాధవరావు ఈసంగతంతా గ్రహించి, ఇదంతా మర్రేంకాదు పువ్వుల తగాయిదా అనుకున్నాడు. సాయంకాలమైంది, సుబ్రహ్మణ్యంగారు ఊరి నుండి వచ్చేరు. వచ్చీ రావడంతోనే మాధవరావు మామయ్యకు ఎదురు వెళ్ళాడు. సుబ్రహ్మణ్యంగారు మాధవరావుని చూచి "ఏరా! అబ్బాయి ఎప్పుడొచ్చావు?" అన్నారు. "ప్రొద్దుటే వచ్చేను-మామయ్యా!" అని జవాబు చెప్పేడు మాధవరావు. "అమ్మ కుశలంగా వుందా?" అని ప్రశ్నించేరు సుబ్రహ్మణ్యంగారు. "ఆఁ" అని సమాధానం చెప్పేడు. ఇలా అనుకుంటూనే దొడ్లోకి కాళ్ళు కడుక్కునేందుకి వెళ్ళారు సుబ్రహ్మణ్యంగారు. ఇక మాధవరావు ఆలోచిస్తున్నాడు ఏదేకధ్యానంతో. ఇంతలో ఆయన మళ్ళీ వచ్చి "ఏరా! అబ్బాయి! ఏమిటి విశేషాలు?" అన్నాడు. "ఆ! ఏమున్నాయి మామయ్యా! ఈమధ్య అమ్మకి వంట్లో బాగుండటంలేదు. ఆమధ్య పదిహేనులంఖణాలు చేసింది. ఇంకా ఒంట్లో నీరసం తగ్గలేదు ఏపనీ చేసుకో లేకుండా ఉంది. అందుచేత నాలుగురోజులుంచుకొని పంపించేస్తానని చెప్పి కమలని వెంటబెట్టుకు రమ్మంది" అని నెమ్మదిగా వేసేడు ప్లేటు. అసలు ఈడొచ్చిన పిల్ల ఇంట్లో ఉండడం వల్ల సుబ్రహ్మణ్యంగారికి ముళ్ళకంప ప్రక్కలో పెట్టుకు పడుకున్నట్లుంది. నాలుగురోజులు పీడేనా వదులుతుందనుకున్నారు ఆ అమాయకులు. "సరే! తీసుకెళ్ళరా! దానికేముంది!" అన్నారు. మరొకళ్ళింటికంటే ఆయన పంపేకపోను. అక్కగారిమీద అభిమానం కొద్దీ సరే అన్నారు. కమలని పిలిచి వాళ్ళత్తయ్యకి ఒంట్లో సుస్తీగా ఉన్నట్లు తెలియజేసి, కాస్త నాలుగురోజులు చేతోడుగా ఉండిరమ్మని చెప్పేరు.

నాలుగురోజులు పోయిన తరువాత ఒకనాటి తెల్లవారుఝామున నాలుగుగంటలకి కమలని, మాధవుని రైలు దాకా దిగవిడిచి వచ్చారు సుబ్రహ్మణ్యంగారు. రైలు చెన్నపట్నం వెళ్ళిపోతోంది. కొంతసేపయ్యాక మాధవరావు కమలతో "ఈమధ్య నేను పెళ్ళి చేసుకోబోతున్నాను కమలా!" అన్నాడు. "ఎవరిని?" అంది. "నిన్నే" అనేశాడు అదురూబెదురూ లేకుండా. ఇంత చులకనగా మాధవరావు మాట వదిలేసేడంటే పెద్దగా ఆశ్చర్య పడవలసిన అవసరం యేమీలేదు. కమలకి ఏమనాలో తెలియక ఒకసారి బుర్ర క్రిందకి దించి మళ్ళీ బావ కళ్ళల్లోకి చిరునవ్వు ముఖంతో చూచింది. మాధవరావు కమల కళ్ళల్లోకి చూసి "నన్ను చేసుకోవా?" అన్నాడు జాలిగా. "నాన్న చెయ్యడు బావా" అంది కమల. పాపం కమలకి నాన్నమీద అభిమానం చావలేదు. తన జీవితాన్ని నడిపేవాడు నాన్నే అనుకుంటోంది. "అయితే నీకు నన్ను చేసుకోవాలని ఉందా?" అన్నాడు మాధవరావు. "ఊఁ" అని బుర్రవంచుకుని సమాధానం చెప్పింది కమల. ఇంతలో మరో స్టేషనేదో వస్తూంటే ఇద్దరూ రైలుపెట్టెలోంచి బయటకు చూడ్డం మొదలెట్టారు. మధ్యాహ్నం పన్నెండు గంటలవేళకి రైలు మద్రాసు చేరింది. మాధవరావు టాక్సీని పిలిచి అందులోఎక్కి యిద్దరూ యిల్లు చేరేరు. అప్పటికి ఒంటిగంట కావస్తూంది. మాధవరావు తల్లి చిన్నమ్మగారు వీధి అరుగుమీద కూర్చుని, వీభూది చేతికిరాసుకుని దూదిపింజతీసి ఒత్తులు చేస్తోంది. వాళ్ళగుమ్మంలో కారు ఆగగానే ఎవరో అనుకొంది. మాధవరావుని, కమలని చూడగానే సంతోషం, ఆశ్చర్యం పట్టలేక పుప్పొంగిపోయింది. ఎంతో ఆదరంతో వారిని లోనికి తీసుకుపోయింది.

చిన్నమ్మగారు వంటకుపక్రమింపగా కమలే కలుగజేసుకుని వంట పూర్తి చేసింది. ఆమె కలుపుగోల్టు తనమునకు చిన్నమ్మగారు చాలసంతోషించింది. కమలామాధవులు కలిసి మెలిసి తిరుగుతూ ఎంతో ఆనందంగా వుండేవారు. ఇదంతా చూస్తూంటే చిన్నమ్మగారి మనస్సు పరిపరి విధాల పోయింది. వీళ్ళిద్దరినీ ఈవిధంగా ముదరబెడితే కొంప ముంచి నలుగురిలో నగుబాట్లు తెస్తారనుకొంది. చిన్నమ్మగారు పురాణ కాలపు మనిషి కావడం వల్ల ఏదో కొంత మనోవ్యధ పట్టింది. ఇదంతా ఏదో ఎబ్బెట్టుగా తోచింది. ఒకనాడు మాధరావుని దగ్గిరకు పిల్చి, తన నడవడిక బాగు లేదని, భర్త పోయిన పిల్లతో అంతలా

కలిసీ మెలసీ తిరుగుతే సంఘం హర్షించదనీ కొడుకుని అదమాయిస్తుంది. పాపం మాధవరావు తల్లికి ఏ జవాబు చెప్పకుండా చొక్కా తొడుక్కుని వీధిలోకి వెళ్లిపోయాడు. వీధిలోకి వెళ్లినవాడు మళ్ళీ సాయంకాలం వరకూ తిరిగి రాలేదు. ఇంటికివచ్చి చొక్కా విప్పి కాళ్ళు చేతులు కడుక్కొని లుంగీ కట్టుకుని వాకిట్లో మంచం వాల్చుకుని చల్లగాలికి పడుకున్నాడు. కమల అక్కడే గుమ్మం మెట్ల మీద వేళ్ళు నులుముకుంటూ కూచ్చుంది చిన్నమ్మగారు వచ్చి "మధ్యాహ్నం నుంచీ ఎక్కడికి వెళ్ళావురా అబ్బాయి!" అంది మాధవరావు గోళ్ళు కొరుక్కుంటూ తన్ను కాదన్నట్లు మాట్లాడకుండా ఊరుకున్నాడు. చిన్నమ్మగారు వంటింట్లోకి వెళ్ళి అన్నానికి రమ్మని కమలని, మాధవరావుని పిలిచింది.

"నాకు ఆకలిలేదమ్మా" అన్నాడు మాధవరావు. ఆ మర్నాటి నుంచి సత్యాగ్రహం చేయడం మొదలెట్టాడు. తిండిలేకపోవటాన్ని ఒళ్ళు తెలియని జ్వరం వచ్చింది. లేవలేనంత అశక్తత సంభవించింది మాధవరావుకి. చిన్నమ్మగారు కొడుకు దుస్థితి చూచి దిగులు పడింది మాధవరావు దగ్గరకు వచ్చి అతని మంచంమీద కూర్చుని "అబ్బాయి!" అని లేపింది "ఆ!" అన్నాడు నీరసంగా చూస్తూ. అక్కడే గోడ దగ్గర కమల నిలబడి ఉంది. "నాయనా! ఎన్నాళ్ళు ఈ విధంగా నన్నేడిపిస్తావురా?" అంది. "ఇంక ఒక్క రోజు" అన్నాడు. చిన్నమ్మగారి గుండెలమీద బండరాయి పడ్డట్టయింది. అతనన్న మాటలో ఎంత అర్థముందో గ్రహించింది. ఆవిడ మనస్సు కలత పడిపోయింది. ఇంక కొడుకు దక్కేఎత్తు లేదనుకొంది. "నన్నేం చెయ్యమన్నావురా నాయనా! నువ్వు ఏం చెయ్యమంటే అది చేస్తాను. చెప్పు బాబూ!" అంది. "అమ్మా" అన్నాడు జాలిగా చూస్తూ. "ఏం నాయనా!" అంది. "కమలని పెళ్లి చేసుకుంటానమ్మా!" అన్నాడు. చిన్నమ్మగార్కి ఏమనాలో బోధ పడలేదు. తమ కళ్ళలోని దూలాలను వెతుక్కోలేక ఎదుటవారి కళ్ళలోని నలుసులను వెతికే కాకిమూక సంఘం, తన సనాతనధర్మం, మొదలైన పూర్వాచారాలన్నీ కళ్ళకి కట్టి నట్లయ్యాయి. "అమ్మా" అన్నాడు మాధవరావు. "అలాగే చేసుకో నాయనా!" అంది ఆమాతృదేవికి ఏమనాలో బోధపడక. సంతోషాన్ని పట్టలేక, ముఖమేనా కడుక్కోకుండా కమల చేతి కాఫీని త్రాగేడు. కొడుకు కాస్త కాఫీ త్రాగిన తరువాత చిన్నమ్మగార్కి ప్రాణమొచ్చింది.

మళ్ళీ మాధవరావు దేహారోగ్యం సరైన మార్గం లోకి వచ్చేటందుకు వారంరోజులు పట్టింది. ఒకనాడు ప్రొద్దుటే మాధవరావు, కమల తలంటి నీళ్ళుపోసు కున్నారు. తరువాత మాధవరావు టాక్సీ తీసుకొచ్చాడు. తల్లి, కమల, తను టాక్సీలో రిజిష్ట్రారు ఆఫీసుకి వెళ్ళారు.

చిన్నమ్మగారు ఎక్కడికో అనుకొంది. కమలకి మాత్రం బావ చేసే పనంతా తెలుసు. సర్కారువారి సమక్షంలో కమల, మాధవరావుల వివాహం రిజిష్ట్రారు పౌరోహితుడుగారు చేసేసి, తమ రిజిష్టర్ల సాక్షిగా ఒక రసీదు తీసి మాధవరావు చేతులో పెట్టాడు. ఆ కాగితం తల్లికి చూపించి "పెళ్ళయి పోయిందమ్మా!" అన్నాడు. "ఇదేం పెళ్ళిరా? నాయనా!" అంది చిన్నమ్మగారు. "డబ్బు ఖర్చులేనటువంటి, ఎవరూ చెడగొట్టలేనటు వంటి పెళ్ళి ఇదేనమ్మా!" అన్నాడు. అందరూ ఇల్లు చేరుకున్నారు. ఆనాటినుంచి చిన్నమ్మగారు కమల, మాధవ రావులను విచ్చల విడిగా ఒదిలేసింది. కమల జీవితంలో నూతన శకారంభం మొదలిడింది. రోజులు, నెలలు గడిచి పోతున్నాయి. పిల్ల క్షేమ సమాచారాలు తెలియటం లేదని ఒకనాడు సుబ్రహ్మణ్యంగారు వాళ్ళ చెల్లెలయిన చిన్నమ్మ గారింటికి మద్రాసుకు ఉత్తరమేనా వ్రాయకుండా వచ్చేశారు. గుమ్మంలో కమల పూర్ణగర్భంతో కనుపించింది. ఇంకే ముంది! కళ్ళొదిలి చూడ్డం మొదలెట్టా డాయన. "రానాన్నా!" అంది కమల. "నాపరువు తీసేసేవే! దుర్మార్గురాలా!" అని మళ్ళీ అక్కడ నిలబడకుండా వెను దిరిగి వెళ్ళిపోయాడు. ఇంతలో మాధవరావు ఇంట్లోంచి వచ్చేడు. వాళ్ళ నాన్న వెళ్ళిపోతూంటే చూస్తున్న కమలని చూసి "ఏమిటి కమలా! అలా చూస్తున్నావు?" అన్నాడు. "మానాన్న ఇక్కడికి వచ్చి నన్నుచూసి వెళ్ళిపోతున్నా డండీ!" అంది. "ఏడీ!" అని అటు చూసేడు మాధవరావు. అప్పటికే సుబ్రహ్మణ్యంగారు చాలా దూరం నడిచి వెళ్ళిపోయారు. "హు! స్వార్థపరుడు. సంఘాన్ని వదిలిపెట్టలేక కన్న కూతుర్ని ఒదిలేడు" అన్నాడు. సుబ్రహ్మణ్యంగారు కనుచూపుమేర దాటి పోయేవరకూ వాళ్ళిద్దరూ అలాగే చూస్తూ నిలబడి తరువాత ఇంట్లోకి వచ్చేశారు. అటువెళ్ళిన సుబ్రహ్మణ్యంగారు ఇటు రానేలేదు. సంవత్సరాలు గడిచి పోతున్నాయి. ఇక ముందు కూడ రాడేమో!

లఘువేదాంతము - లోకసంగ్రహము

• శ్రీమతి ఎమ్. వేదవల్లి తాయారమ్మ

(శ్రీ సీతారామాంజనేయ సంవాదముననుసరించి)

వేదాంతం పేరు చెప్పగానే మన దేశంలో అంతటా కనబడే దొంగ సన్యాసులు, బైరాగులు కొన్ని మఠాలు కొందరు స్వాములవార్లూ జ్ఞాపకానికి వస్తారు. వేదాంతం లోకాంతంగా పరిణమింపజేసే వేదాంతులున్నారు. "అనిత్యాని శరీరాణి అందరి సొమ్ము మా కేరానీ" అన్నట్లు బోధ చేసే గురువులు విశేషంగా నున్న యీ కాలంలో వేదాంతానికి విలువ కనుగొనడం చాలా కష్టం.

అసలు వేదాంతం అంటే ధర్మార్థకామములను మూడు పురుషార్థములను దెలుపు వేదముల కతీతమైనది. అనగా మోక్ష మార్గము నుపదేశించునది. వేదశిఖలు అనబడు ఉపనిషత్తులలో నీ విషయమంతా నిండియున్నది. ఆ యుపనిషత్సారమే శ్రీ కృష్ణ భగవానులు భారత యుద్ధారంభమున అర్జునునకుపదేశించిన భగవద్గీతలు. గీతలో శ్రీ భగవానుడుపదేశించిన 18 యోగములు కర్మ జ్ఞాన భక్తి యోగములను ప్రతిపాదించునవై యున్నవి.

జ్ఞాని యగువాడు తన్నుదా దెలుసుకొని పై మూడు యోగములలోనే యోగ మభ్యసించినను లోక సంగ్రహమునకే వినియోగించ వలెననియు, దాననే మోక్షప్రాప్తి కలుగుననియు గీతార్థసారము. ఇతర వేదాంత గ్రంథములలో కర్మ సన్యాసము చేయుమనియే చెప్పబడినది. కర్మను వీడుమని యే యోగమునందు చెప్పలేదు.

"నమే పార్థాస్తి కర్తవ్యం। త్రిషులోకేషు కించన
నానవాప్తమ వాప్తవ్యం। వర్త యేవ చకర్మణి"

అనియు "ఉత్సీదేయురిమేలోకాఃనకుర్యాంకర్మచేదహమ్" అనియు భగవంతుడు తానెల్లప్పుడు కర్మ చేయుచుండు ననియు తాను కర్మాచరణ చేయనిచో నీలోకములన్నియు నుత్సన్నములగును, అనగా నశించు ననియు చెప్పి యున్నారు. కాన తురీయమార్గమునందున్న వారైనను, తుర్యాతీతులైనను లోక సంగ్రహము కొరకు ఫలాపేక్ష రహితమగు కర్మ నాచరించియే తీరవలెను. జ్ఞానయోగము వలన ముముక్షువునకు పూర్వ సంచితములగు శుభా శుభ కర్మలన్నియు నశించును. "జ్ఞానాగ్ని స్సర్వ కర్మాణి భస్మసాత్కురుతే తథా" అని గీతా వాక్యము.

"ప్రారబ్ధం భోగతోనశ్యేత్ తత్వజ్ఞానేన సంచితమ్। ఆగామిద్వి విధం కర్మ। తద్వేష్య ప్రియవాదినోః" అని వాసుదేవ మననము. సంచిత ప్రారబ్ధ ఆగామి కర్మలలో కూడబెట్టిన సంచిత కర్మ తత్వజ్ఞానము వలన నశించును. ఆగామి యగు శుభాశుభ కర్మలు రెండును భక్తులగువారిని భూషించువారు శుభకర్మ ఫలితమును, వారిని నిందించిన వారు పాప కర్మ ఫలితమును పంచుకొందురని భావము. అందువల్ల జన్మరాహిత్యమునకై ప్రయత్నించుము, ముముక్షువున కేవిధమగు కర్మయు మిగులదని సిద్ధాంతము. కర్మ జ్ఞాన యోగములచే పరిశుద్ధమైన మనస్సు కలిగి, కర్మ బంధములు నశించిన యోగి భక్తి యోగమును అవిచ్ఛిన్నముగా నభ్యసించును. అవ్యభిచారమగు పరా భక్తి యోగము సిద్ధించిన వారికి పరమాత్మ సాక్షాత్కారమగుటయే గాక మోక్ష మరచేతిలోనుండును. "మోక్షసాధన సామగ్ర్యాం భక్తి రేవగరీయసి" అని శ్రీ శంకరాచార్యుని ప్రవచము. మోక్ష సాధనోపాయములన్నిటిలోను భక్తియే సర్వోత్కృష్టమైనది.

సీతారామాంజనేయ సంవాదమను వేదాంత గ్రంథమందు మోక్షమార్గమును, తారకయోగమనియు, సాంఖ్య యోగ మనియు, అమనస్క యోగమనియు, మూడు యోగములుగా విభజించి యున్నారు. ఇది మోక్ష ప్రతిపాదకమగు గ్రంథము. దీనిని పరశురామ, పంతుల లింగమూర్తి, గురుమూర్తి యను వారు తేట తెల్లమైన తెలుగు భాషలో పద్య గద్య రూపమున రచించినారు. తారక యోగము సీతామహాదేవియు, సాంఖ్య అమనస్క యోగములను శ్రీరామచంద్రమూర్తియు ఆంజనేయునకు ఉపదేశించునట్లు గ్రంథకర్త వ్రాసినారు.

"తారకంబు మనశ్శుద్ధి తారకంబు।
సాంఖ్య మాత్మస్వరూప విచారకంబు।
అనుభవజ్ఞానమమనస్కమట్లుగాన।
నాద్య మెరిగింతు మొదల నీవవధరింపు।"

అని సీతాదేవి మూడు యోగముల స్వరూపమును వివరించినారు.

తారక యోగము మనస్సును పరిశుద్ధము చేయును. ముముక్షువు తనకనేక జన్మలనుండి అంటియున్న కర్మ

వాసనలను కర్మదోషములను ప్రప్రథమములలో పరిహరించుకొని మనః పారిశుధ్యము పొందవలెను. మనో నైర్మల్యములేనిదే పరమాత్మ స్వరూప సాక్షాత్కారము కలుగదు. తారకనామమనగా రామనామము. రాముడనగా ఆత్మారాముడు. సమస్త జీవులలో సాక్షి భూతమగు, పరమాత్మ స్వరూపము. "రమయతీతి రామః" రమింపజేయువాడు గాన రాముడనియు "రమంతే అస్మిన్నితి రామః" యోగులు అతనియందు రమింతురు, గాన రాముడనియు రామ శబ్దానికి వ్యుత్పత్తులు చెబుతారు.

"సత్యజ్ఞానానంద। ప్రత్యగభిన్నాత్మునందు బ్రహ్మాదిబుధుల్। నిత్యము రమించుచుండగ। కాత్యాయని దామపదముగలిగె పరునకున్" అని రామ నామమును వివరించినారు.

"శ్రీరామ రామరామేతి । రమేరామేమనోరమే
సహస్రనామతస్తుల్యం । రామనామవరాననే"

శ్రీరామ నామము వెయ్యి విష్ణునామములకు సమానమనియు, నీ శ్లోకమును జపించుటవలన వెయ్యి రామనామమును జపించుట సమానమని యాశ్వరుడు రామనామ మహాత్మ్యమును పార్వతికి తెలిపిరి.

ఇంతేకాకుండా రామనామము కామితార్థ ఫలప్రదాయిని "అబల శ్రీరామ రామ రామాఖ్యమంత్ర । మీప్సితంబుల నర్థులకిచ్చుచుండ । గాంచినెరిసిగ్గుపడుచుండు కల్పతరువు, కామధేనువునలఘుచింతామణియును" రామనామము కల్పవృక్షము కామధేనువు చింతామణివలె కోరిన కోర్కెల నెల్లదీర్చును. మరియు ఆదివ్యాధులను గూడ పోద్రోలును.

"నిఖిల రోగంబున నిర్మూలముగజేయు
భవభయంబులనెల్ల బారద్రోలు" ననియు "రామనామంబు ముక్తికి రాచబాట" అనియు నిర్ణయించినారు. మోక్షమార్గము లన్నిటిలోనే యొడిదుడుకులు లేకుండ గమ్యస్థానాన్ని చేర్చుటకు రామనామము కంటె మరొక సాధనంలేదు. గాఢవైరాగ్యంతో భగవంతునిమీద అత్యధికమైన భక్తినుంచుటవల్లనే మనో మాలిన్యము లన్నీ నశించి మనస్సు పరిశుద్ధ మవుతుంది. పరిశుద్ధాంతకరణము చక్కగా దున్ని పదునుచేసిన పొలము వంటిది. దానిలో నాటిన భక్తిబీజములు నిత్యోపాసనాది విధులనే దోహదములతో మొలకలెత్తి వృక్షాలై మోక్షప్రాప్తియను శాశ్వత ఫలములనిచ్చును.

భక్తిశూన్యమగు వైరాగ్యము నిష్ఫలము. "తారకయోగము తెలియగ। నేరక వేదాంతవాక్య నికురుంబము చేనూరక వాదించుచు జెడువారికి। మోక్షంబుగలదెవాయు కుమారా।" అని తారకయోగసిద్ధి కలుగనిదే శుష్క వేదాంత చర్చల వలన మోక్షము చేకూరదని ఘంటా పదంగా చెప్పినారు.

ఇంతేకాకుండా తారకయోగ సిద్ధికి రెండు మార్గములు వివరింప బడినవి.

(1) రామనామమును జపించుట. (2) యమనియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యాన ధారణ సమాధులను అష్టాంగ యోగము నభ్యసించుట. ఈ యష్టాంగ యోగమును సమాధి యోగమనియు. నందురు. యోగియగువాడు నియమబద్ధమగు జీవితముతో నింద్రియములను జయించి యోగాసనము లభ్యసింప వలెను. మరియు ప్రాణాయామము చేత చిత్త నిరోధము చేసి పరమాత్మ ధ్యానమునందు మనస్సు నిలుప వలెను. అట్టి స్థితియే సమాధి స్థితి. ఈ ప్రకారముగా యోగి రామ నామము జపించుచు సమాధి స్థితుడైన యోగి మనో మాలిన్యములు నశించి పై జెప్పిన తారకయోగసిద్ధి కలుగును. "రాజయోగంబు ముక్తికి రాజపథము". మోక్షమార్గమున కిది చక్కని రాజ మార్గము. ఆచరణ యోగ్యమైనది.

(2) సాంఖ్య యోగము.

"సాంఖ్యమాత్మ స్వరూప విచారక[illegible] యోగమునందు తత్వముల సంఖ్య వివరింపబడినది. ఈ తత్వ సంఖ్యానీకము 24 తత్వములనియు 36 తత్వములనియు 96 తత్వములనియు గూడ తెలుపబడినది. వీనిలో ప్రధాన తత్వములు 24. అవి యేవన: పంచమహా భూతములు, పంచతన్మాత్రలు, శబ్దస్పర్శ రూప రసగంధములు, పంచ జ్ఞానేంద్రియములు, త్వక్చక్షుశ్రోత్ర జిహ్వా ఘ్రాణములు, పంచకర్మేంద్రియములు, వాక్పాణిపాదపాయూ పస్థలు, చిత్తము, బుద్ధి, మనస్సు, అహంకారమునను వానితో కలసి 24 తత్వములు. ఇవి త్రిగుణాత్మి మాయాశక్తిచేత కల్పింపబడినవి. జీవుడు ఈశ్వరుడునను రెండు తత్వములు పైవానితో కలసిన తత్వములు 26 వీనిని తెలిసికొనిన త్రిగుణా తీతులు పరమాత్మ సాక్షాత్కారమును బొందుచున్నారు. సృష్టికి మూలాధారములగు శుద్ధ సత్వ ప్రధాన

మగు మాయను, మలిన సత్వ ప్రధానమగు మాయను అతిక్రమించిన పరమ హంసలు జీవేశ్వరైక్య భావమున కర్తులగుచున్నారు. ఇది సాంఖ్య యోగ సిద్ధాంతము. ఈ యోగము యోగాభ్యాసులకు మాత్రమే ఆచరణయోగ్యము. చాలా కష్టతర మగు మార్గము. ఈ యోగ సాధనలలో దేని నాచరించుటకు ప్రారంభించినా సాధకునకు సాధన చతుష్టయ సంపత్తి అత్యావశ్యకము. ఈ సంపత్తి లేని వాడు మోక్ష పదవి నందుటకు అధికారి కాజాలడు.

ఈ నాలుగు సాధనము లెవ్వియనః

(1) నిత్యా నిత్య వస్తువివేకము (2) శమాదిషట్క సంపత్తి (3) ఇహాముత్రార్థ ఫలభోగ విరాగము (4) ముముక్షుత్వము.

నిత్యానిత్య వస్తువివేకము :— బ్రహ్మ యొక్కటే సత్యమనియు; మాయాశక్తిచే కల్పింపబడిన యీ చరాచర ప్రపంచము మన దేహములు అనిత్యములని నిశ్చలమైన జ్ఞానము కలిగియుండుట.

ఇహాముత్రార్థ ఫల భోగ విరాగము :— ఇహలోక మందల్లి సుఖభోగాదులందును, పరలోక భోగములందును ఆసక్తిలేక పోవుట.

శమాదిషట్కసంపత్తి :— శమము దమము, ఉపరతి తితిక్ష శ్రద్ధ సమాధానమునను ఆరు సుగుణములను కలిగి యుండుట. శమమనగా అంతరింద్రియ నిగ్రహము. దమమన బహిరింద్రి యనిగ్రహము. ఉపరతి — విహిత మగు [illegible]ర్మలను జ్ఞానముచేత క్రమ క్రమముగా విడచుట. తితిక్ష శీతోష్ణ సుఖ దుఃఖాది ద్వంద్వములను సహించుట. శ్రద్ధ — గురువులయందును, శాస్త్రము లందును, ఈశ్వరునియందును విశ్వాసము కలిగియుండు.

సమాధానము : — శాస్త్రదృష్టమును గురూపదేశమును సమన్వయము చేసికొని ఆత్మనిశ్చయము చేసికొనుట.

"శాస్త్ర దృష్టం గురోర్వాక్యం।
తృతీయంబాత్మ నిశ్చయమ్"

ఇవి ప్రమాణము. ముముక్షువిట్టి సాధన సంపత్తితో గూడినవాడై మోక్షమును బొందుటకు తారకసాంఖ్య. అమనస్క యోగము లభ్యసించవలెను. (3) అమనస్క యోగము :— అనగా మనోలయము, మనోవృత్తులను నాశముగావించి నిశ్చలమగుట. జీవాత్మ స్థూల సూక్ష్మ కారణ శరీరములతోగూడి మాయాబద్ధుడై యుండును. ఈ ప్రకృతి పురుషసంయోగము అనాది. జీవాత్మను తారక సాంఖ్యయోగములచేత పరిశుద్ధముచేసి అనాది సిద్ధమగు ప్రకృతి పురుషసంయోగమును విచ్ఛేదముచేసిన గాని జీవాత్మకు ఐక్యసంధానము కలుగదు. దీనికంతటికి మనస్సే ప్రధానము. "మనఏవ మనుష్యాణామ్ ; కారణంబంధ మోక్షయోః" అని గీతావాక్యము. జీవులకు బంధమునకు గాని మోక్షమునకు గాని మనస్సే కారణము. అట్టి బంధము నుండి జీవాత్మకు విముక్తి కలుగజేసి ఐక్యసంధానము కలిగించు మార్గములు అమనస్క యోగము నందు చెప్పబడినవి. ఇదియంతయు అనుభవజ్ఞానమే. ముముక్షువునకు చిట్ట చివరి భూమిక. ఆపైన చేయవలసిన దేమియు నుండదు.

ఈ సాంఖ్య అమనస్కయోగములు రెండు ఆచరించుట చాలా దుష్కరము. భక్తియోగముతో మిశ్రితమైన తారక యోగమే లోకసామాన్యమునకు ఆచరణ యోగ్యమును సులభ సాధ్యమునై యున్నది. ఈ భక్తియోగానికి సర్వ భూత సమత్వము మూలకందము. సమస్త భూతముల యందు పరమాత్మ అధిష్ఠించి యున్నందున అట్టి పరమాత్మ స్వరూప సాక్షాత్కారానికి సర్వభూతసమత్వమే ప్రధాన సాధనము. "మానవసేవయే మాధవసేవ" అను లోకోక్తి భక్తియోగసిద్ధాంతమునే ప్రతిపాదించుచున్నది. ఇది ముముక్షువునకు మోక్ష మార్గము లన్నింటిలోనికి సూక్ష్మమైనది. అట్టి భక్తియోగలక్షణాలను గీత 12 వ అధ్యాయంలో విశదీకరించారు.

ఇంతేకాక బ్రహ్మదేముడు, నారదమహర్షి, శుకమహర్షి సనకాదియోగులు మొదలుకొని ప్రహ్లాదుడు మున్నగు పరమ భాగవతోత్తము లందఱు భక్తిజ్ఞాన వైరాగ్యములలో భక్తియోగమునే బలపరచినారు. కేవలము శుష్కవేదాంతము లోక సంగ్రహము కానేరదు. సమాధియోగము జనసామాన్యానికి గృహస్థులకు చాలాదుష్కటము. సర్వసంగ పరిత్యాగము గావించి అరణ్యములలో సమాధినిష్ఠులై యున్న యోగులకే అది సాధ్యముగాన అందరికి అందుబాటులోనున్నది, అందరిని తరింపజేయునది తారక యోగమే.

(ఆలిండియారేడియో విజయవాడ వారి సౌజన్యముతో)

పలుకు బాట - తులసీదాసు

శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు.

రాముడుండునెడల కాముండుగదియడు
కాముడుండకున్న రాముడుండు
రవియు, చంద్రముండు రహియింత్రె ఒక్కచో
తులసి పలుకు బాట తెలిసి చనుము॥

బాహిరంతరముల ప్రభల గోరెదవేని
రామనామ మనెడి రత్నదీప
శిఖఁబదిల పఱుపుము జిహ్వాగేహళియందు
తులసి పలుకు సరణిఁ దెలిసికొనుచు॥

ఎన్నొ యేండ్లు బ్రదికి యెంతొ తెలివినొంది
పిన్నవారిసుమంత ప్రేమ గనరు
ఏమి ఫలమొ తులసి యెఱిగింపు వేడెద
ఒజ్జపుచ్చకాయ ఉనికిగాక॥

సంఘసేవ యంచు సంస్కారమంచును
వెలయ పల్కుచుంద్రు వేదులెక్కి
ఒరుల పచ్చజూచి యోర్వనేచాలరే
తులసి, వీరికింత తెలుపదగవె?

విదిత సత్యవాక్కు, విమలమౌ చిత్తమ్ము
కపటరహిత వృత్తిగలుగు భక్తు
మోసపుచ్చగలరె ముష్కర కలినైన
తులసి పలుకు బాట తెలిసి చనిన॥

బంధులున్నగాని బాధకేయగుదురు
సత్యపదవి కొరకు సాయపడరు
రాముకృపయె నీకు రక్షణయౌ నందెప్డు
తులసి పలుకు బాట తెలిసి చనుము॥

భార్య, సుతుడు, భుక్తి, వస్త్ర భోగములాది
పాపియింట నేనిఁబడయవచ్చు
సాధు సంగమమ్ము చక్రికృపయుగడు
దుర్లభములు రెండు తులసి వినుము॥

పరుల కొఱకె పూచి ఫలియించు సంతతము
సాధులనెడు నామ్ర శాఖ వితతి
ఎన్నిఱాలఁ గొట్టె దన్ని ఫలములిచ్చు
తులసి పలుకు దెలిసి తెలివిగొనుము॥

సాధుజనుల, సురల బాధఁబాపుకొఱకె
మనుజతనువుఁ జరిత నెనుపు దాల్చి
బాధసైచు గృపను భగవానుడెప్పుడు
కలిని బాధదీరు దెలియనిదియు॥

దగను గొనియు దీనతగని వానికి
జలదమొకడె పేయజాలు
ఆత్మమాని భక్తునార్తి దిర్పసారులు
చాల రొక్కపరుడు స్వామిదప్ప॥

నీరుద్రచ్చి పూన్కినేయి బడయవచ్చు
పిండవచ్చు నినుమునుండి నూనె
రాము భజనలేక బాముదాటగలేము
తులసి పలుకు బాట తెలిసిచనుము॥

వేషభాషల నెఱవేరు నట్టిపనుల
హానికలిగి తీరు నంత్యమందు
చిత్తశుద్ధితోడ సేసెడి పనులను
హానికలుగబోదు హరిసహాయమొదవు॥

బ్రదుకు సుకమె యెల్లవారు నఖిల[illegible]త్రు
ప్రభుని కరుణలేక పడయగలరె?
ధనికి సుఖముకొల్ల యనుచుదలచువారిఁ
దులసి యజ్ఞులంచు పలికెవినుము॥

చెఱువునీటినెల్ల చేపలే త్రాగిన
వానిబ్రదుకె బయట పడునుగాదె
కొంగతినునటంచు కొడిమెలేలతుదకు?
తులసి పలుకు బాట దెలిసిచనుము.

దీర్ఘరోగి, లోభిఁ, దీక్ష్ణవచస్కుని
నధికలోలుపు, మఱియధికకోపిఁ
బ్రాణమిత్రుడైన గాని, వానిచెలిమి
విడువుమంచు తులసి వెలయఁబలికె॥

ఏమిటీ?....

కుమారి పి. సులోచనాభాస్కర్.

సాయంకాలం వీధి దీపాలు వెలిగాయి. అంతగా చీకటి పడకపోయినా ఆట్టే వెల్తురు లేదనే చెప్పాలి. భాస్కర్ ఆఫీసునుంచి తిన్నగా రెండు మైళ్ళ చిల్లరగానున్న పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి రిపోర్టిచ్చి "యెంత వేగంగా గూటికి చేరుదామా" అన్న పక్షిలా తిరుగు ముఖం పట్టాడు. త్రోవలో ఛాలామంది స్నేహితులు యెదురయ్యారు, కాని పలకరిద్దామనుకుంటూనే వారిని దాటి పోతున్నాడు. కాస్త ఆయాసం తీర్చుకోమని ఆప్యాయంతో అడ్డగించి ఆహ్వానించిన వినాయకుణ్ణి కాదనలేకుండా భాస్కర్, గణేశ భవన్‌లో దూరి, బోడి చేతులతో యిచ్చిన కప్పు వేడినీళ్ళను, కాలకోటి కషాయం లాగు గొంతుకలో పోసుకున్నాడు. మిగిలిన మూడోవంతు బాటను కాళ్ళతో వెనక్కి తన్నుకుంటూ యిల్లు చేరుకున్నాడు. మైలున్నర దూరంలో పోసుకు వచ్చిన వేడినీళ్లు యిల్లు చేరుకునేసరికి ఖర్చయిపోయి యథాప్రకారం 'ఒరిజనాల్టీ' పైకి తన్నుకొచ్చింది. పిలవటానికి శక్తి చాలక 'టిక్ టక్' మని తలుపు తట్టాడు. లోపలి నుంచి "ఎవరది?" అన్న ప్రశ్న వచ్చింది. జవాబు మరొక 'టక్'. సులోచన చికాకుగా వచ్చి తలుపు తీసి అలసిపోయిన అవతారాన్ని చూసి సానుభూతైనా చూపకుండా "చూడ సొంపొస్తున్నారు" అంది హేళనగా.

"అవును" అంటూ విసురుగా నీరసంతో లోపలకు అడుగు పెట్టాడు భాస్కర్. ఎక్కడ తూలిపోతాడోనని, సులోచన భాస్కర్ నడుం చుట్టూ తన చేతిని పెనవేసి తిన్నగా గదిలోకి తెచ్చి విడిచింది. సులోచన కాఫీ తేవటానికి వంటింటివైపు వెళ్ళింది. భాస్కర్ ఉస్సు మనుకుంటూ, నెక్‌పై వూడదీసి, లాల్చీని ఫేంటులోనుంచి పెరికి దండెముమీదకు విసిరివేశాడు. ఎదురుగా సులోచన కాఫీతో హాజరయింది. అంత అలసటలోనూ ఆనందం బలవంతంగా భాస్కర్ పెదవులమీదకు వొంగి వాలింది. భాస్కర్ వొక్కొక్క గుక్క చొప్పున కప్పులో ద్రావకాన్ని (అమృత మంటారు కొందరు) కడుపులోకి తోడుతున్నాడు.

"ఏమండీ! అంత డీలా అయి రాకపోతే, అర్ధో, పావలావో పారేసి యే రిక్షాలోనో రాలేకపోయారూ? బొత్తిగా జ్ఞానసూన్యులయిపోతున్నారేం రాను రాను" అంది సులోచన.

"ఊఁ!" అని దీర్ఘంగా మూల్గేడు భాస్కర్.

"తనకు తోచను సరికదా! యింకొకరికి తోచింది వినటం మాని యిదేమిటి?"

"ఏమన్నాను?" అని ప్రశ్నించి చూసేడు భాస్కర్.

"మతి మరుపు కూడానా? యిటువంటి వాళ్ళను చూసి ఏడవాలో నవ్వాలో తెలీకుండావుంది అసలు యింతకీ యీ సైకాలజీ పీపుల్‌ని చూస్తే...." అని వూరుకుంది సులోచన.

"నీ గోలేమిటి చెపుదూ?" అన్నాడు భాస్కర్.

"అవును గోలేలెండి, పోనీ పోలీస్ స్టేషన్‌కు రిపోర్టు యిచ్చి వచ్చారా?" అంది సులోచన దగ్గర కుర్చీలో కూలబడుతూ.

"అబ్బబ్బా! హాయిగా ఒక్కగడియ పార్కుకేనా పోతే బాగుండేది. పెద్దలు చెరబోతున్నట్టు పరుగెత్తుకు వచ్చినందుకు జరిగింది" అంటూ తలగడాకు జేరబడ్డాడు భాస్కర్.

"అంత చికాకు, డీలా అవకూడదనే నా సారాంశం. పువ్వులు తెస్తానన్నారు మర్చిపోయారు. పోన్లెండి కొంత న్యూసెన్సు తగ్గిపోయింది" అని పూర్తి చెయ్యకుండానే భాస్కర్ అడ్డు తగిలి,

"ఏం? తేలేదని నిందారోపణ చెయ్యగలవు కానీ, ఒక్కనాడయినా తెచ్చినప్పుడు సరదాగా పెట్టుకున్నావా?" అన్నాడు.

"అదే పొరపాటు. నాకు పువ్వులు పెట్టుకోవాలనే ఆపేక్షగాని, సరదాగాని లేదని మీకు తెల్సును. సింప్లీ వాటి అందాన్ని చూసి మెచ్చుకుంటాను, ఆనందిస్తాను, అందులో సౌఖ్యం అనుభవిస్తాను. అంతమాత్రాన తేకూడదా? వాటిని తలలో పెట్టుకుంటేనేకాని వీలులేదని ఏశాస్త్రమైనా చెప్పిందా?" అంది ఓటమి అంగీకరించలేక.

"డ్రాప్ దట్ మేటర్" అన్నాడు భాస్కర్.

"ఇంతకీ నే చెప్పేదేమిటంటే మానవులు, ఒడ్డున నిల్చుని పనుల్ని జరిపించాలంటాను. వ్యక్తి తానై యే కార్యంలోకైనా దూకి, మట్టిలో మట్టయి, తన్మయత్వంతో కార్యంలో లీనమవకూడదు. అదే మొన్న ఈమధ్య "ది బెస్టు అమెరికన్ స్టేజి యాక్టరు 'విలియమ్ కాక్రిచ్'" తనకు జరిగిన సన్మానసభలో పేర్కొన్నాడు. "అతడు నటించేటప్పుడు తానై యేపాత్రలోనూ లీనం కాలేదని, తనను వ్యక్తిగతంగా వేరే వుంచుకొని, ప్రేక్షకలోకంలోని విసుర్పనలను స్టేజిమీదనుండే పరీక్షిస్తూ వుండేవాడినని వారిలో తన నటన ఎటువంటి భావాలను కల్గిస్తున్నదీ చూసి, వ్యక్తిగతంగా ఆనందించేవాడినని, తను చేస్తున్నది నటన అనే భావాన్ని గుర్తు దాటనిచ్చే వాడిని కాదని. ఏవ్యక్తి అయినా అలా చేసినవాడేఘను"డని పేర్కొన్నాడు. అది నాకెంతో నచ్చింది. కేవలం పాత్రలో లీనమయిపోతే గాని భావ ప్రకటన సాధ్యంకాదనే వాదులకు అతను అతీతుడు లీనం కాకుండా లీనమయినట్టు భావ ప్రకటన చేసినవాడే నటుడు. అప్పుడు నటుడు క్లయిమాక్స్‌రీచ్ అయినట్టు. ఇంకో విషయంగూడా గమనించండి. 'కూచి పూడి భాగవతులు' నాట్య ప్రదర్శనచేస్తూ నరసింహావ తార ఉగ్రరూపము కొరకు సహజ భీకరస్వరూప సృష్టి కోసమని, ఉపవాసనలు, మంత్రాలు చేసి కేవలం తనే నరసింహావతారమని లీనమై ఒకసారి కన్నకొడుకునే చీల్చి చంపేశారుట. అది కట్టుకథ అనడానికి సాధ్యపడదు కదా? అంతవరకు యెందుకు, రీసెన్ట్‌గా ఏం జరిగింది, ప్రసిద్ధ హిందీ విలన్ తార కులదీప్‌కౌర్‌ని రిహాల్సు చేస్తూ నటుడు పాత్ర లీనంలో ఆమె గుండెలలోకి అరంగుళం పోయేటట్టు కత్తితో పొడిచినట్టు పత్రికలలో చూసిందేకద!" అంటూ భాస్కర్ వైపు విజయంగా చూసింది సులోచన.

"ఊ" అన్నాడు భాస్కర్ ఆశక్తి చూపుతున్నట్టు.

"అవును యీ విషయం నే చెపితే నచ్చదు. ఇదే యే పెద్ద తత్త్వ శాస్త్రవేత్తో గీసి పారేస్తే ఆప్యాయంగా ఒక పొండవులను చదివించి ఆ పుస్తకం కొని చదివి, చూడు సులోచనా! ఆథర్ యెంత సాధక బాధకాలకు లోనై, స్టడీచేసి వ్రాసేడో అంటారు" అంటూ కుర్చీలో నుంచి లేచింది సులోచన.

"సరే! అయితే నేనయి యెందులో లీనమయిపోయానని నీ భ్రమ?" అన్నాడు భాస్కర్ కుతూహలంగా.

"పోలిస్‌స్టేషనుకు వెళ్ళి రిపోర్టిచ్చారు బాగుంది. అందుకు నేనెంతో సంతోషిస్తున్నాను. అక్కడ నుంచి 'స్ట్రయిట్'గా రిక్షాలో వస్తే యింత 'డీలా' వుండక పోవునా! డిగ్నిటీగా కూడా వుండును. మళ్ళీ పెద్ద మేనేజరుగారు, యువకులు. అధమం మనస్సు మరే చికాకు చేయకుండా, యితర ఆలోచనలు లేకుండా బ్లాంకుగా వుండేది. అక్కడనుంచి నడిచి రావడం కష్టమనిపిస్తుంది. దానికి నేను బాధనను, వెళ్ళిన పని ఎటువంటిది? రిష్టువాచీ పోయింది రిపోర్టు యివ్వడానికి. అది మానసికంగా కష్టమయినది; ఆ కష్టాన్ని యీ కష్టం రెట్టిస్తుంది. అయ్యో యింత కష్టానికి లోనయిపోతున్నానే అనే భావాన్ని కల్గచేసుకుంటున్నారు. అందుకుగాను కష్టంలో లీనమయి మరింత కష్టాన్ని కల్పించుకుని తను వేరే వ్యక్తిగతంగా చేయవల్సిన పనులు మరచారు. దాని వల్ల ఒకటి వ్యక్తిత్వప్పనుల నాశనం, రెండవది స్వతహాగా కల్గిన కష్టానికి శాంతి లేకపోవడం, మూడవది దాన్ని వ్యక్తీకరించడానికి లీనమై కల్పించుకున్న కష్టం కల్సి తడిసి మోపిడయి కుంగతీసాయి. చక్కగా రిపోర్టు ఇవ్వడం, రిక్షాయెక్కి రావడం, అంతే! దానిగురించి అనవసర కలవరముండకూడదు. డ్యూటీ, డ్యూటీయే! అవసరంపడితే కాస్త హెచ్చిస్తాం కావి కేవలం లీనమయి పోవడమనేది యెన్నడూ చేయకూడని పని" అని ముగించింది సులోచన.

"అరె బాప్‌రే! ముగిసిందా లెక్చర్. నీ వుపన్యాసం వినటంలో యెంత హాయి వుందనుకున్నావ్? ఊక దంచితే యెంతలాభమో? రోల్సు రాయస్ కారువెనక పరుగెత్తితే యెంతసుఖమో...." అని భాస్కర్ ముగించకుండానే సులోచన ముఖం ముడుచుకుని రివ్వునలేచి వెళ్ళబోయింది. భాస్కర్ చటాలున చెయ్యి పట్టుకున్నాడు నవ్వుతూ.

"చాలా పనులున్నాయి వదలండి" అంది.

"ఉహూ!" అన్నాడు భాస్కర్ గట్టిగా చెయ్యి అదిమి పట్టుకుంటూ.

"ఆడదానిలా యింట్లో కూర్చోపోతే అలాగ పార్టులోకి పోకూడదూ?" అంటూ గింజుకుంది సులోచన చెయ్యి విడిపించుకుందికి.

"యేం? ఆడవాళ్ళు యింట్లో కూర్చుంటారా? డిగ్రీలు పుచ్చుకుని, ఉపన్యాసాలతో యింట్లో భర్తలను నోరు మెదపకుండా దంచేస్తారు" అన్నాడు భాస్కర్ సులోచన ముఖంలోకి చూస్తూ.

"అబ్బా! యేం మోటుదనం, యింత సిల్లీగా వుంటా రేం?" అంది చిరుకోపంతో.

"సరే మగవాళ్ళలాగ నువ్వెందుకు బి. ఏ. వరకు చదివావు? సమానత్వం కామోలేమో? పద యిద్దరం కలిసి పిక్చర్‌కో, పార్కుకో పోదాం" అన్నాడు భాస్కర్ బుజ్జగిస్తూ.

"వంట్లో బాగాలేదు. నేనురాను" అంది.

"దారిలోనే డిస్పెన్సరీ" అన్నాడు హేళనగా.

"నేను రాను అంటే. యిదేం ఖర్మం" అంటూ విడిపించుకుని వంటింట్లోకి పారి పోయింది.

భాస్కర్ భార్య చిరు కోపానికి నవ్వుకుంటూ షవార్లు చేశాడు. మళ్ళీమేం తోచక మంచం మీద వాలేడు. సులోచన వుపన్యాసాలు యింకా చెవుల్లో గుంయిమని ప్రతిధ్వనిస్తున్నాయి. ప్రతీదీ ఆవేశంతో గంభీరంగా తడబడకుండా వుపన్యసిస్తుంది. అసలు తమ దాంపత్యానికి అదే కారణం. భాస్కర్ యీ ఆలోచనలతో చిన్నగా నవ్వుకున్నాడు. సులోచన అప్పుడే. నీటుగా డ్రస్ చేసుకుని వచ్చి, భాస్కర్ తనలో తను నవ్వుకోవటం చూసింది.

"కొంపదీసి, మెంటల్ డిసార్డర్ కాదుకద!" అంది కిలకిల నవ్వుతూ,

"అను యింకేమైనా అంటావ్" అంటూ ఆమెలో రెట్టించిన సౌందర్యం వైపు ఆశగా చూశాడు.

"యేం దిష్టకొడతారా?" అంది దూరంగా జరుగుతూ.

"యింకాఅను" అన్నాడు అమాయకంగా ముఖం పెడుతూ.

"యెంత అమాయకులండీ మీరు. పాపం! నోట్లో వెన్న పెడితే మింగలేరు, వేలు పెడితే కరవలేరు కదండీ? అవును మీరు రిస్ట్‌వాచ్ పారేసుకున్నారట. యెవరైనా ఓదార్చేరా పాపం" అంది వెటకారంగా సులోచన.

"అమాత్రం తెలీదనుకోకు, వెధవది యీనెల జీతంలో అటు వంటివి ఒకటికాదు, తొంభై కొని పారేస్తాను" అన్నాడు భాస్కర్ కోపం నటిస్తూ.

"నాకెందుకు?" అంది సులోచన దగ్గరగా వచ్చి భాస్కర్ భుజాలు పట్టుకుని.

"నువ్వనేది తెలుసు. అది మీవాళ్ళు నీకు కొని యిచ్చారు బుద్ధి గడ్డితిని నేను వాడుతున్నాను. పౌర పాట్లందరికీ వస్తాయి. కాలం కర్మం కూడి దొంగ వెధవ కొట్టేశాడు" అన్నాడు. భాస్కర్ విదలించుకుంటూ.

"నే నిప్పుడవన్నీ అన్నానా? మీరే తప్పుకుంటున్నారు" అంటూ విసురుగా లేవబోయింది.

భాస్కర్, సులోచనను అడ్డు పెట్టి.

"నిజం చెప్పు అది యెవరివల్ల పోయింది?"

"మీరెవరని అనుకుంటున్నారు" అంది.

"యింటిగలవాళ్ళబ్బాయే తీశాడు. అందుకేగా రిపోర్టిచ్చింది" అన్నాడు.

"మరయితే వేరే అడగాలా?" అంది.

"అదికాదు నేననేది, నీవల్లనా నావల్లనా? అని" అన్నాడు భాస్కర్.

"అదా సంగతి! నాకేం తెలుసు చెప్పడానికి? మీ బావ గారి నడగండి?" అంది సులోచన కళ్ళు త్రిప్పుతూ.

మా "బావగారెవరు?" అన్నాడు ప్రశ్నగా.

"తెలీదేం? యింటి కొచ్చిన దగ్గర నుంచి అతని కోసం తహతహ లాడిపోతారే పేకాటకు నన్నుగూడ చంపేవారే"

"ఓహో! అదా నీ దెప్పిపొడుపు. అవును మీ సూర్యనారాయణ బాబుకొడుకు గురించేనా అనేది" అన్నాడు భాస్కర్.

"ఛీ! వాడెవడూ మధ్య మా పెదనాన్నవడాన్కి. వింటే నలుగురూ నవ్వుతారు" అంది సులోచన ఛీదరింపుగా.

"యేం? అన్నయ్యా! యివాళ దావగారిచేత ఒక వంద ఆటలుతోమించాలి యిందులో నీ చెయ్యి కలిస్తే అర

కప్పు కాఫీ లంచమిస్తాననడం తెలుసా?" అన్నాడు భాష్కర్ హేళనగా.

"మీవన్నీ అడ్డు బుకాయింపులే. రావోయ్ బావా! మీ చెల్లి ఒంపెత్తుమనిషి. నే లేకపోయినా పరవాలేదు, కావలసిన పుస్తకాలు తీసుకొంటూ వుండవోయ్, అనడం బాగుందా?" అంది సులోచన మెరిసే కళ్ళతో.

"ఊ ....! యింక చాలిద్దాం. యెలాగో వెధవ యిద్దరినీ అన్యాయంచేసి కొట్టేశాడు. సరే యెక్కడికి పోగలడులే, రేపు యీపాటికి స్టేషన్‌లో నాలుగు తగలే సరికి మూడుచెరువుల నీళ్ళు త్రాగి మరీ లెస్తాడు" అన్నాడు భాష్కర్.

యింతిలోకీ వరండాలో నుంచి చిన్నగా దగ్గు విని పించి, సులోచనా భాష్కర్ లిద్దరూ అటువైపు చూశారు. సూర్యనారాయణమూర్తి గారు మెల్లగా గదిలోకి ప్రవేశించాడు. సులోచన చటాలున లేచి దూరంగా జరిగి నిల్చుంది.

"ఏం నాయనా? కులాసాగా వుంటున్నారా?" అన్నాడు సూర్యనారాయణమూర్తి.

"ఊ!" అన్నాడు యిష్టం లేకపోయినా.

"అబ్బా! దిన దినాన్కి వంట్లో యేం బాగుండటం లేదు, ముసలాడినయిపోతున్నాను. కూర్చోవమ్మా నిల్చుండి పోయావేం?" అంటూ సూర్యనారాయణమూర్తి అక్కడ కుర్చీలో చతికిల పడ్డాడు.

"ఇదిగో చూడు నాయనా! యీనెల యింటికి ఎలక్ట్రిక్ దీపాలు వేయిద్దామనుకుంటున్నాను. మొన్ననే అప్లికేషన్ దాఖలు చేశాను. రెండు రోజులలో వచ్చి వైరింగ్ చేస్తారనుకుంటా. డాబామీద యీ భాగంవైపు రెండు గదులు వేయించదలిచాను, బాగుందా?" అన్నాడు సూర్యనారాయణమూర్తి.

"మధ్య మేమెవరం? అద్దెల వాళ్ళం" అన్నాడు భాష్కర్ చికాకుగా.

"అద్దె మరి పెంచలేమండి" అంది సులోచన.

"అబ్బె! బ్బె! మీకు బొత్తిగా లోకజ్ఞానంలేదు. జీవితమంతా కొత్త. నాకేం అద్దె యెక్కువ వద్దు. మరి యేమిటీ ముసలాడిలా పేలుతున్నాడనుకునేరు. నేను చాలా తీవ్రంగా ఆలోచించాను. వెధవది డబ్బును మనం గడిస్తాముకాని, మనల్నది గడించదు. యేం చెప్పమంటావు తల్లీ? పోయేకాలమప్పుడు నాకెందుకీ చిచ్చు. యిప్పటికి సుమారు డెబ్బయి సంవత్సరాలుగా మాతరం వారీ వూళ్ళో వుంటున్నారు బొరా! అనిపించుకున్నారు...."

"యింతకీ మీరు...." అన్నాడు భాష్కర్.

"చెపుతూన్న గోలంతా అదే నాయనా! యింటా వంటా లేని యీపాడు బుద్ధులు మావాడికి ఎలా పుట్టిందీ నమ్మలేకుండా వున్నాను. ఉదయం నుంచీ బయటికి రాలేకుండా కుళ్ళి కుళ్ళి చచ్చేను. 'చల్ల కొచ్చి ముంతదాచడమేం?' నాకంతా తెల్సింది. వెంటవే[illegible] రావడానికి వెధవ ఆత్మాభిమానం కాలి చచ్చింది. నాకు నువ్వొకడివి, మావాడొకడు కాదు. వాడే నీతప్పు్మడయితే యింత నిష్కర్షగా" అని కళ్ళు తుడుచుకున్నాడు.

"అలాగయినట్టయితే యింతవరకూ రాకుండానే వాడిని చంపెద్దును" అన్నాడు భాష్కర్ కోపంగా.

"ముసలాడిని, పదేపది. యిటూఅటూ కోర్టులంట, స్టేషన్‌లంట తిరగలేను. యివి చేతులుకా[illegible] కాళ్ళనుకో. వంశపారంపర్యంగా గడించి యిచ్చిన మాపెద్దల గౌరవ ప్రతిష్టలు నాశనం చెయ్యకు. వెధవ నడుగుదామంటే నిన్నటి నుంచీ అగుపించలేదు. యీనెల [illegible]ద్దెలతో ఒకవేళ తియ్యక పోయినా కొత్తది కొని [illegible] యిచ్చుకుంటాను. పోలీసులను యింటికి తెప్పించి వీధి కెక్కించకు. అటువైన నీయిష్టం" అంటూ కళ్ళు తుడుచుకుని[illegible]ల్చున్నాడు సూర్యనారాయణమూర్తి.

"ఊరుకోండి పెదనాన్నగారూ! దానికే అంతయిదయిపోవాలా? నే వున్నాగా, రిపోర్టు తిప్పించేస్తాను. మీరు మాత్రం హాయిగా వుండండి" అని వోదార్చింది సులోచన.

"వాడొచ్చాక చీల్చి మరీ కనుక్కుంటాను తల్లీ!" అంటూ సూర్యనారాయణమూర్తి వెళ్లిపోయాడు. భాష్కర్ అయోమయంగా సులోచన వైపు చూశాడు.

"ఏం మానవులండీ! యెంతచదివితే యేం? మీలో కాసంతయినా దయవుందా? పాపం ముసలాడు అంతబాధపడుతుంటే ఒదార్చటం పోయి, మీరు కాబట్టి. మీ వాడని

వూరుకున్నారు, నేనే అదే మాతమ్ముడయితే మింగేస్తాను. నరికేస్తానంటారేం?"

"చాల్లే! అవన్నీ ఒకటోరకం దొంగవెధవ వేషాలు. పోనీ ఆ దయారసమేదో, యిద్దరి భాగాలు కలిపి నీలోనే వుంచేడు దేవుడు. ఎవరు పుణ్యం చేసినా యిద్దరం పంచుకోవల్సిందే" అన్నాడు భాష్కర్.

"అబ్బే! ప్రపంచంలో యింత నిర్దాక్షిణ్యులున్నారని యివాళ తెల్సింది" అంది లోచని.

"రేపు యింకొకటి, యెల్లుండి మరొకటి, అవతలనాడు మరోకొత్తది, తెలుస్తుంటాయి, అవే జీవితానుభవాలు. పెద్దలు ప్రతీదీ దానికి ఆధారంతోనే చెప్తారు, అందుకే జరుగుతాయి. రేపటి నుంచీ నువ్వొక పెద్ద" అన్నాడు భాష్కర్.

"మాటలకేంలెండి! చూశారా? అతను పెద్దలుగడించిన గౌరవ ప్రతిష్టల కోసం యెంత బాధపడ్డాడో?" అంది. సులోచన.

"వెధవ వాడి గౌరవం, నా గౌరవం, నడిబజారులో కట్టలు తెంచుకున్న గోదావరిలాగ పారుతున్నది" అన్నాడు భాష్కర్.

"తోడి మానవుడిని నమ్మలేని మీరు...." అని వూరుకుంది సులోచన.

"ఆత్మ విశ్వాసాలే లేని యీ రోజులలో తోడి మానవుడి మీద విశ్వాసం లేదని యేడుస్తావేం?" అన్నాడు భాష్కర్.

"మీతో మాట్లాడలేం! యెడ్డెం అంటే తెడ్డెం అంటారు. పోయింది నా వాచీ, పోనీలెండి, వాళ్ళని వీధికెక్కించకండి. రిపోర్టు మీరు విత్‌డ్రా చేసుకోక పోయినా నే పోయి చేసి వస్తాను" అంటూ విసురుగా లోపలికి పోయింది సులోచన.

రాత్రల్లా మాటలు లేవు, ఆ తరువాత కూడా లేవు. భాస్కర్ మాత్రం రిపోర్టు విత్‌డ్రా చేసుకున్నాడు. ఆ సంగతి సులోచనకు చెప్పలేదు. కాని గ్రహించే ఉంటుంది. యిద్దరూ బింకంగానే వున్నారు. పెళ్ళయిన రెండు సంవత్సరాలకీ యిదే తను భార్యతో మాటలు మానేయడం. భాస్కర్‌కి చాలా కష్టం వేసింది. కప్పు పక్కకు విసిరి కేలండరు చూశాడు. గబ గబ బయలుదేరి, కాలకృత్యాలు తీర్చుకుని బట్టలు వేసుకున్నాడు. కాఫీ టేబిల్ మీద భాస్కర్ కోసం యెదురు చూస్తున్నది. నాలుగు గుక్కలలో ఖాళీ చేసి అటూ ఇటూ పచార్లు చేస్తూ ఆలోచించి ఆఖరుకు తెగించి గొంతుక సర్దుకుంటూ "లోచనీ! లోచనీ!" అని పిల్చాడు.

సులోచన వచ్చి, యింత పుదయాన్నే అతను తయారవడం చూసి ఆశ్చర్యపోయింది.

"పెట్లో ఆమూల, యీ మూల దాచిన దేమైనా వుంటే ఇయ్యి" అన్నాడు ముక్తసరిగా. ఎందుకని అడగాలనుకుంది గాని మాట్లాడకుండా ఒక కవరు తెచ్చి యిచ్చి భాష్కర్ ముఖంలోకి ప్రశ్నగా మాత్రం జూసి వూరుకుంది.

"యివాళ ఇది తెలుసుకో! యిది పరువు నష్టపు దావా క్రింద జరీమానాగా పోతుంది. రిపోర్టు విత్‌డ్రా చేసుకుంటే ముసలాడు తెచ్చి పెట్టిన ముప్పు. బహుశా యివాళే అతను నీకు వాచ్ కొని యిచ్చేస్తాడనుకుంటా" అంటూ తిరిగి వెళ్ళబోయాడు. సులోచన చటాలున భాష్కర్ కోటు పట్టుకుని ఆపి.

"ఓ! ఎంత కన్నింగ్ ఫాక్స్? నిజంగా సెంచరీ ఫాక్స్. యిటువంటి వెధవల్ని వేస్టేజి లేకుండా వాళ్ళ గోతులు వాళ్ళనే లైనులో తవ్వుకోమని, అందులో దించి, ఒకే ఒక బులెట్‌తో కాల్చి చంపెయ్యాలి" అంది కోపంతో భాష్కర్ కోటు కాలర్ నలుపుతూ.

"ఆ....ఆ....మెల్లిగా, యిది వింటే, నన్ను చంపనాలోచిస్తున్నారని మరో కేసు తెలిసిందా?. అయినా నీ యెదట వున్నది నేను, నీ చేతిలో వున్నది నా కోటు కాలర్. టైమ్ లేదు త్వరగా వెళ్ళా"లంటూ వెళ్లిపోయాడు భాష్కర్. వెళ్ళిన దిక్కే చూస్తూ సులోచన గట్టిగా వేడి నిట్టూర్పు విడిచింది.

అల్లికలు — జెర్సీ

[గత సంచికలో జెర్సీ వెనుక భాగము, ఎదుటివైపు ఎడమ ప్రక్క భాగములు అల్లు విధము వ్రాయడమైనది. ఇప్పుడు ఎదుటివైపు కుడిప్రక్క భాగము, చేతులు, మెడ పట్టీ మొదలగునవి అల్లువిధము ఈ దిగువనీయబడినవి.]

ఎదుటివైపు కుడిప్రక్క భాగము

12 వ. నెంబరు సూదులతో ఎఱుపు రంగు ఊలుతో 61 కుట్లు కాస్టాఫ్ చేయవలెను. వెనుకవైపు వేసిన మాదిరిగా 5 నమూనాలు వేసి, నెం. 10. సూదులమీదకు మార్చి మరి రెండు నమూనాలు వేయవలెను.


ఇదే విధముగా నమూనాలు వేయుచు తరువాత నమూనాలలో ప్రతి 5, 6 వరుసలలో చివర ఒక్కొక్క కుట్టు చొప్పున హెచ్చు చేయుచూ ఆ విధముగా హెచ్చుచేసిన వరుసలు 10 అగువరకూ అల్లవలెను(71 కుట్లు)

పై విధముగా 14 నమూనాలు వేసి 17. వ. నమూనాలో మొదటి వరుసతో ముగించవలెను.

చంక ఆకారమేర్పరచుట :— తరువాత వరుస ప్రారంభములో 4 కుట్లు కాస్టాఫ్ చేసి, ఒక వరుస విడిచి మరి యొక వరుసలో ఇదే మాదిరిగా కాస్టాఫ్ చేయుచూ అదే విధముగా రెండు సార్లు అల్లి ముగించవలెను. (59 కుట్లుండును.)

ఇదే విధముగా నమూనాలు వేయుచు 42. వరుసలు అల్లి ఆఖరి నమూనాలో 8. వ వరుసతో పూర్తి అగునట్లు అల్లవలెను. మామూలు నమూనాలో కంటె చంక చివర భాగములో రెండు కుట్లు తక్కువ అగునట్లు అల్లవలెను.

మెడ ఆకార మేర్పరచుట:— తరువాత వరుస మొట్ట మొదటి 5 కుట్లు కాస్టాఫ్ చేసి తరువాత వరుస మామూలుగా అల్లి, ఆ తరువాత వరుసలో కూడా మొట్ట మొదటి 5 కుట్లు కాస్టాఫ్ చేసి, తరువాత 3 వరుసలలో మెడవైపు భాగములో ఒక్కొక్క కుట్టు చొప్పున తగ్గించవలెను.



తరువాత వరుస(7. వ. [illegible]) — (ఒకేసారి) ని. 1, మే. 1, [illegible] ని. 1, పా. [illegible] *ప. 2, స్లి. 1, ని. 1, [illegible] స్టార్ దగ్గర నుండి తిరిగి వేయుచూ చిట్ట చివర 11 [illegible] ప. 2, ని. 1 అల్లవలెను. మెడవైపు ఒక [illegible] కుట్టు చొప్పున తగ్గించుచూ 15 వరుసల వరకూ [illegible]ముగా తగ్గించుచూ అల్లవలెను. (30 కుట్లు అగువ[illegible]

పై విధముగా అల్లిన తరువాత ఒక వ[illegible]మూలుగా అల్లి ఎడమవైపు ఎదుటి భాగము[illegible] భుజము ఆకారమేర్పరచుటకు అల్లిన మాదిరిగా [illegible]లెను.

చే తు లు.

నెం. 12. సూదులతో ఎఱుపురంగు [illegible] కుట్లు వేసి చేయి అడుగు భాగము (అంచు) ప్రారంభించవలెను.

మొదటి వరుస:—*ని. 1, ప. 1 స్టార్ దగ్గర నుండి చివర వరకూ అదే మాదిరిగా అల్లవలెను. (ఒక నిట్టు, ఒక పర్ల్ చొప్పున వేయుటకు రిబ్ అని పేరు.)

పై వరుస వలె మరి 10 వరుసలు వేయవలెను.

హెచ్చు చేయుట: తిరుగ వైపు (Wrong side):— మొట్టమొదటి నుండి రిబ్బు వేయుచూ, చిట్ట చివర ఒక్క కుట్టు పర్ల్ అల్లవలెను. సూదిమీద 91 కుట్లు వచ్చు వరకూ రెండు వైపుల ఒక్కొక్క వైపు ఒక్కొక్క కుట్టు చొప్పున హెచ్చు చేయుచూ అల్లవలెను.

ఇప్పటి వరకూ అల్లినదంతా నెంబరు. 10 సూదుల మీదకు మార్చి, ముందు వేసిన మాదిరిగా 6 నమూనాలు వేయవలెను.

చేయి పై భాగము ఆకార మేర్పరచుట:— తరువాత 14 వరుసలలో మొట్టమొదట, చిట్టచివర కూడా ఒక్కొక్క కుట్టు చొప్పున తగ్గించవలెను. (63 కుట్లు)

తరువాత వరుస:— ని. 2 (ఒకేసారి) మే. 1, స్లి. 1, ని. 1, పా. స్లి. స్టి. ఓ, వ. 2, ని. 6, వ. 2, *ని 2 (ఒకేసారి) మే. 1, ని. 1, మే. 1, స్లి 1, ని. 1, పా. స్లి. స్టి. ఓ, వ. 2, ని. 6, వ. 2 స్టార్ దగ్గరనుండి తిరిగి చేయుచూ చిట్ట చివర 4 కుట్లు ని. 2 (ఒకేసారి) మే. 1, ని. 2 (ఒకేసారి)

తరువాత 16 వరుసలలో మొట్టమొదట, చివర కూడా ఒక్కొక్క కుట్టు చొప్పున తగ్గించవలెను (31 కుట్లు)

తరువాత వరుస:— ని. 1, స్లి. 1, ని. 1, పా. స్లి స్టి ఓ, వ. 2, ని. 6, వ. 2, ని. 2 (ఒకేసారి) మే 1, ని. 1, మే. 1, స్లి. 1, ని. 1, పా. స్లి. స్టి. ఓ, వ. 2, ని. 6, వ. 2, ని. 2 (ఒకేసారి) ని.1.

తరువాత 4 వరుసలలో మొట్టమొదట, చివర కూడా ఒక్కొక్క కుట్టు చొప్పున తగ్గించవలెను. (21 కుట్లు) మిగిలిన కుట్లు కాస్టాఫ్ చేయవలెను.

ఇదే మాదిరిగా రెండవ చేయి కూడ అల్లవలెను.

బొత్తాముల పట్టీ.

నెం. 12 సూదులతో, నీలిరంగు ఊలుతో 12 కుట్లు అల్ల వలెను తరువాత 162. వరుసలు రిబ్ అల్లి కాస్టాఫ్ చేయ వలెను.

బొత్తాము కాజాల పట్టీ.

నెం. 12. సూదులతో, నీలిరంగు ఊలుతో 12 కుట్లు 4 వరుసలు రిబ్ అల్ల వలెను.

బొత్తాము కాజాకు మొదటి వరుస :— 5. రిబ్, రెండు కుట్లు కాస్టాఫ్ చేయవలెను 5. రిబ్

బొత్తాము కాజాకు రెండవ వరుస :— 5. రిబ్, రెండు కుట్లు కాస్టాన్ చేయవలెను 5. రిబ్.

20 వరుసలు రిబ్ అల్ల వలెను. ఈ పై 22 వరుసలు తిరిగి 6 సార్లు అల్ల వలెను. తరువాత మళ్ళీ బొత్తాము కాజాలకు అల్లే రెండు వరుసలు అల్లి, రిబ్ రెండు వరుసలు అల్లి కాస్టాఫ్ చేయవలెను.

మెడపట్టీ

నెం. 10. సూదులతో 12 కుట్లు నీలిరంగు ఊలుతో అల్ల వలెను. రిబ్ 36 అంగుళములు లేక కావలసినంత పొడవు అల్లి, కాస్టాఫ్ చేయవలెను.

ముగింపు:— అంచులయందు తప్ప మిగిలిన భాగములన్నీ యిస్త్రీ చేయవలెను. చేతివైపు నుండి ప్రారంభించి భుజములు కలిపి అల్ల వలెను. చేతులు, ప్రక్కలయందు కలిపి అల్ల వలెను. తరువాత బొత్తాముల పట్టీ, బొత్తాము కాజాల పట్టీ కూడ కలిపి అల్లి, మెడపట్టీ సరిగా మధ్యలో నుండు నట్లు చూచి, మధ్యనుండి ప్రారంభించి కలిపి అల్ల వలెను. అప్పుడిరువైపుల మిగిలిన చివర భాగములు జారుముడి లేక కావలసిన మాదిరిగా (పటములో వలె) వేయ వలెను. ★

కస్తూర్బా మహిళా పాఠశాల

పెద్దాపురం

శ్రీమతి బారు సరోజినీదేవిగారిచే స్థాపించ బడిన శ్రీ కస్తూర్బా మహిళాపాఠశాల అష్టమ వార్షికోత్సవము 10 — 3 — 54 వ తేదీని శ్రీమతి డాక్టర్ శకుంతలా బాపినీడుగారి అధ్యక్షతన పెద్దాపురం విక్టోరియా మెమోరియల్ క్లబ్‌లో జయప్రదముగా జరిగినది.

పాఠశాల విద్యార్థినులు 'గాజులచేహారి' నృత్యనాటిక, 'భ్రాంతి' నాటకము, మరియు నృత్యములుచేసి సభికుల నానందపరచిరి. శ్రీమతి శకుంతలాబాపినీడుగారు స్త్రీవిద్య గూర్చి ఉపన్యసించిరి. తరువాత శ్రీ మాగంటి బాపినీడు గారు విద్య, దాని ఆవశ్యకతను గురించి ఉపన్యసించి, బాలికల కృషికి సంతోషించి వారిని ప్రోత్సాహించిరి. విద్యార్థినులకు బహుమతులొసగబడెను. తరువాత సభ రామధున్‌తో ముగిసెను.



వివేకానందుడు

జీవదయా పబ్లికేషన్సు, శ్రీ కర్రి అప్పారెడ్డి, గొల్లల మామిడాడ, తూర్పు గోదావరి జిల్లావారు ప్రచురించిన పద్యకావ్యం. వెల రూ 2-0-0. రచన : 'బాలసరస్వతి ' బిరుదాంకితులు శ్రీ ఉందేల మాలకొండారెడ్డిగారు.

'దేశ గర్వము దీప్తి జెందగ, దేశ చరితము తేజరిల్లగ, దేశ మరసిన ధీరపురుషుల' వీరగాథలు ఎంత మంది రచించిన — ఎన్నిసార్లు చదివిన, తనివి తీరదు. హిందూ మతము యొక్క ఘనత సడలనున్నతరి, యద్దానిని సముద్ధరించి, ఖండఖండాంతరముల వ్యాపింప జేసిన మహా నీయుడు వివేకానందుడు. వినినంతనే విద్యుచ్ఛక్తి ప్రవాహమువలె ఆపాదమస్తకమును స్పందింప జేసి, అనివార్యమగు చిత్త సంస్కారమును గల్గించునట్టి దాతని దివ్యవాణి. సర్వ మత సమన్వయము — విశ్వమానవ సౌభ్రాతృత్వముల జాటుచు మానవకోటికి శతాబ్దములపాటు సరిపడునట్టి ప్రబోధ సుధాకర మాతని సందేశము. ఇట్టి వానిని కథావస్తువుగా నెన్నుకొనుటయందే ఈ పిన్న కవి సామర్థ్యము గానవయ్యెడిని. "ఎల్లరు నిజసత్వ సమాన ఫలార్థులేగద !" కథా వస్తువునకెనయగు మధురగంభీర రసమయ పదాళిచే—

"ఓచిన్నారి తపస్వి ! వంగఋషి రాజోత్తంస ! నీమంగళ
శ్రీచారిత్ర్యము సంస్మరింప హృదయక్షేత్రాన భవ్యాశయ
ప్రాచుర్యమ్ములతోచెఁబూ చెఁగవితారాజీవగేహమ్మునీ
యాచంద్రార్క యశోవధూటి కొక పువ్వందింతుఁగై
కొందువా !"

అను నాందీపద్య కుసుమముతో ప్రారంభించి, యింపగు మణి మయ పుష్పహారమును గూర్చి, శ్రీ వివేకానందునికే గాక, ఆంధ్ర భారతికే ఒక అమూల్యాలంకారముగా సమర్పించినాడీ "బాల సరస్వతి". ఆ బాలగోపాలము, స్త్రీలు - పురుషులు, కవులు — తత్వ వేత్తలు ఏక రీతిని పఠించి ఆనందించదగ్గ రీతి నున్నదీతని కవితా మాధుర్యము. ఆంధ్ర లోక మీ పిన్న వయస్కుని అభినందించుచున్నది; ఇంకను మున్ముందు ఈ కవి కలమున వ్రాయనున్న కవితా గుచ్ఛముల కెదురు జూచుచున్నది. "శతమానం భవతి" అని ఆంధ్ర మహిళ ఆశీస్సులిచ్చుచున్నది.

మనుస్మృతి

శ్రీ కనకమేడల వెంకటేశ్వరరావుగారి విరచితమైన గేయ కావ్యం. ధర్మ శాస్త్ర గ్రంథంగా కాకుండా హృదయానికి, మేధకూ జరిగే సంఘర్షణ సమన్వయం ఈ కావ్య లక్ష్యం. వెల రూ 0-12-0. వలయువారు కె. వెంకటేశ్వరరావు, 9 రండాల్సు రోడ్డు, మద్రాసు 7 కు వ్రాయవలెను.

శ్రీరామానందలహరి

బాలకవి శ్రీ రత్నాకర బాలరాజుగారు, శివానందలహరి శ్లోకములందలి భావములు గ్రహించి, శ్రీరామ స్తోత్రపు పద్యములుగా నొనర్చినారు. చక్కటి శైలిలో భక్తిరసభూయిష్ఠమైన పద్యములు గలవు. వెల రూ 0-8-0. దొరుకుచోటు—రావుజీ ప్రెస్, భద్రిబిల్డింగ్సు, అనంతపురం.

"క్షేత్రయ్యపదాభినయ ప్రచారసమితి"

విశాఖపట్నంలో శ్రీ విస్సా అప్పారావుగారు, శ్రీ వడ్డాది బాపిరాజుగారు తదితర ప్రభుతులు, కళాభిమానులు స్థాపించిన సమితి.

కూచిపూడి భాగవతులకు పేరందిన మన నృత్య కళ అంతరించిపోతున్న దినాల్లో ఒక కళా నికేతనాన్ని స్థాపించి, కళారాధకులను సమావేశపరచి, శాస్త్రీయ నృత్యాన్ని ప్రచారంలోకి తీసుకు రావడం ఆశయంగా పెట్టుకుని స్థాపించబడ్డ సమితి యిది. ఆంధ్రులందరి యొక్క ఆదరాభిమానాలు కోరుతూంది.

కె. సుగుణమణి.